శుక్రవారం
25•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
•సంపుటి 8 •సంచిక 210
•పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



గురువారం చండీయాగ మండపంలో అమ్మవారికి హారతినిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దంపతులు

పంచాక్షరి ప్రతిధ్వని

అభినవకైలాసం.. ఎర్రవల్లి యాగక్షేత్రం

- చండీ, రుద్ర, బగళ, నవగ్రహ హవనాలు
- పంచాక్షరి జపంతో మార్మోగిన యాగశాల
- నాలుగోరోజు పూర్తయిన మహారుద్ర సహిత సహస్ర చండీయాగం
- ప్రత్యేక పూజల్లో సీఎం కేసీఆర్ దంపతులు
- నేడు పూర్ణాహుతితో యాగం ముగింపు
- విశాఖ శారదాపీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి హాజరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

శివశివ శంకర భూతపతే.. శంభో మహాదేవ అంటూ పవిత్ర పరమేశ్వరుడి ప్రార్థనలు ఒకవైపు.. జయజయ విమలే..బగళే అంటూ.. దశమహావిద్యల్లో ప్రముఖమైన బగళాముఖి స్తోత్రాదులు ఇంకోవైపు.. అనంత పరమేశ్వరనాయకి అయిన చండీ సప్తశతి మరోవైపు ప్రతిధ్వనిస్తుంటే.. సిద్దిపేటలోని ఎర్రవల్లి యాగక్షేత్రం అభినవ కైలాసంగా మారిందా అనిపించింది. సర్వం సుభిక్షం.. సమస్తం సుసంపన్నం అన్న ఆకాంక్షతో.. ప్రజలందరు సంతోషంగా ఉండాలని, వానలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలన్న మహాసంకల్పంతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేపట్టిన మహారుద్ర సహిత సహస్ర చండీయాగం నాలుగోరోజు విజయవంతంగా కొనసాగింది. గురువారం ఉదయం యాగశాలలోకి సతీసమేతంగా ప్రవేశించిన సీఎం కేసీఆర్ మొదట రాజశ్యామల మాత మండపంలో పూజలు నిర్వహించారు. మహాకాళి, మహాలక్ష్మి, మహా

మిగతా 2వ పేజీలో

సెట్స్ షెడ్యూల్‌లో మార్పులు

ఫిబ్రవరి మొదటివారం నుంచి వరుసగా నోటిఫికేషన్లు

- మే 20న లాసెట్
- మే 15 నుంచి పీఈసెట్
- మే 28 నుంచి పీజీఈసెట్
- మే 31న ఎడ్‌సెట్

సెట్స్ కన్వీనర్ల సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో మే నెలలో నిర్వహించే పలు ప్రవేశ పరీక్షలకు సంబంధించిన తేదీల్లో స్వల్ప మార్పులు చేశారు. గురువారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షల కన్వీనర్ల సమావేశంలో నాలుగు ప్రవేశ పరీక్షల తేదీల్లో మార్పులు చేశారు. ఈ నెల ఐదో తేదీన ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తే జేఈఈ మెయిన్ వంటి జాతీయ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇబ్బందిపడే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని సెట్స్ కన్వీనర్ల కమిటీ చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. లాసెట్, పీఈసెట్, పీజీఈసెట్, ఎడ్‌సెట్ తేదీల్లో స్వల్ప మార్పులు ఉంటాయని, మిగతా పరీక్షల తేదీల్లో ఎలాంటి మార్పులు లేవని పేర్కొన్నారు.

మార్పులు ఇవే

లాసెట్ మే 26కు బదులుగా.. మే 20న నిర్వహించనున్నారు. మే 20 నుంచి ప్రారంభం కావాల్సిన పీఈసెట్ పీఈటీ పరీక్షలను మే 15 నుంచే ప్రారంభిస్తారు. మే 27 నుంచి 29 వరకు నిర్వహించాల్సిన పీజీఈసెట్ ప్రవేశ పరీక్షలను 28 నుంచి 31 వరకు నిర్వహించనున్నారు. ఎడ్‌సెట్ మే 30, 31 తేదీల్లో జరుగాల్సి ఉండగా, ఒక్క రోజుకే (మే 31) కుదించారు.

ఆన్‌లైన్ కేంద్రాల్లో పకడ్బందీ చర్యలు

ప్రవేశ పరీక్షలన్నింటినీ ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నామని, ఈ మేరకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని పాపిరెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సమస్యలు రాకుండా ట్రాన్స్‌కో అధికారులకు లేఖ రాస్తామని చెప్పారు. పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని కేంద్రాలలో టెక్నీషియన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. ప్రవేశ పరీక్షల పూర్తి షెడ్యూల్‌ను నిర్ణయించేందుకు ఫిబ్రవరి మొదటివారం నుంచి ప్రవేశ పరీక్షల కమిటీలు సమావేశం అవుతాయని, వెంటనే నోటిఫికేషన్ విడుదల చేస్తాయని చెప్పారు. మార్చి, ఏప్రిల్, మేలో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. వాటికి అనుగుణంగా దరఖాస్తుల షెడ్యూల్ ప్రకటిస్తామని ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ యాదయ్య తెలిపారు.

(ప్రవేశ పరీక్షల నూతన షెడ్యూల్ 8వ పేజీలో)

లోక్‌సభ ఎన్నికల్లో

టీఆర్‌ఎస్ క్లీన్‌స్వీప్!

రాష్ట్రంలోని 16 స్థానాల్లో గులాబీ రెపరెపలు • జాతీయస్థాయిలో ఎన్డీయేకు ఎదురుగాలి!



	సీట్లు	ఓట్లు
ఎన్డీయే	233	37.6%
యూపీఏ	167	32.2%
ఇతరులు	143	30.2%

42.4% ఓట్లతో టీఆర్‌ఎస్ ప్రభంజనం

- ఒక స్థానంలో ఎంఐఎం గెలుపు
- ఏపీలో వైసీపీకి 19 స్థానాలు
- రిపబ్లిక్ టీవీ – సీ ఓటర్ సర్వేలో వెల్లడి
- కేంద్రంలో సాధారణ మెజార్టీకి దూరంగా ఎన్డీయే, యూపీఏ
- ప్రాంతీయపార్టీలే నిర్ణయాత్మక శక్తులు

న్యూఢిల్లీ, జనవరి 24:

తెలంగాణలో టీఆర్‌ఎస్‌కు ఎదురులేదని రిపబ్లిక్ టీవీ – సీ ఓటర్ తాజా సర్వే తేల్చిచెప్పింది. ఇప్పటికిప్పుడు లోక్‌సభకు ఎన్నికలు జరిగితే తెలంగాణలోని మొత్తం 17 స్థానాల్లో 16 చోట్ల టీఆర్‌ఎస్ క్లీన్‌స్వీప్ చేస్తుందని తెలిపింది. ఎంఐఎం ఒక స్థానంలో గెలిచి తన పట్టును నిలుపుకొంటుందని వెల్లడించింది. కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలు ఖాతా తెరిచే పరిస్థితి కూడా లేదని సర్వే ఫలితాలను బట్టి తెలుస్తున్నది. అటు ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ సారథ్యంలోని

మిగతా 4వ పేజీలో

అడవిదొంగలపై ఉక్కుపాదం

- అటవీ, పోలీసు శాఖల సమన్వయంతో దాడులు
- 450 మంది కరుడుగట్టిన నేరగాళ్ల గుర్తింపు
- రోజువారీ నివేదికలు తెప్పిస్తున్న సీఎం కేసీఆర్
- సీఎంవో నుంచి నిరంతర పర్యవేక్షణ
- అవినీతికి పాల్పడిన అధికారులపై వేటు
- తాజాగా ముగ్గురు అధికారుల సస్పెన్షన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో కలపను అక్రమంగా తరలిస్తున్న అడవిదొంగలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. హరితహారం ద్వారా అడవుల సంరక్షణ, అభివృద్ధికోసం చర్యలు తీసుకుంటున్న సర్కారు.. అదేసమయంలో అటవీ సంపదను దోచుకునే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తున్నది. కలప అక్రమరవాణాను నిరోధించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపట్లా క్రమశిక్షణ చర్యలు తీసుకొంటున్నది. తాజాగా గురువారం ఫారెస్ట్ డివిజనల్‌స్థాయి అధికారితోపాటు ముగ్గురు అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అడవుల సంరక్షణ

మిగతా 2వ పేజీలో

నేడు రెండోవిడుత పోలింగ్

- 3,342 పంచాయతీల్లో ఎన్నికలకు సర్వంసిద్ధం
- రెండో విడుతలో 788 తుదివిడుతలో 573 పంచాయతీలు ఏకగ్రీవం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం రెండోవిడుత పోలింగ్ జరుగనున్నది. ఇందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధంచేసింది. ఈ విడుతలో 4,135 గ్రామాల్లో ఎన్నికలు జరుగాల్సి ఉండగా, రిజర్వేషన్లు కలిసిరాకపోవడంతోపాటు, కోర్టు కేసుల నేపథ్యంలో ఐదు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడంలేదు. ఈ విడుతలో మొత్తం 788 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో 3,342 గ్రామాల్లో ఎన్నికలు నిర్వహిస్తుండగా, 10,668 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలిచారు. 36,602 వార్డుస్థానాలకు ఎన్నికలు జరుగాల్సిఉండగా, కోర్టు కేసులు, రిజర్వేషన్లు అనుకూలంగా లేక పోవడంతో 94 వార్డుల్లో ఎన్నికలు

మిగతా 8వ పేజీలో

సీబీఐ కొత్త చీఫ్ ఎంపిక వాయిదా

మోదీ నివాసంలో ఉన్నతస్థాయి కమిటీ సమావేశం

నిర్ణయం తీసుకోకుండానే ముగిసిన భేటీ

4

ఇస్రోకు మరో ఘన విజయం

విజయవంతంగా కక్ష్యలోకి మైక్రోశాట్-ఆర్

మరోమారు శాస్త్రవేత్తల నమ్మకాన్ని నిలబెట్టిన పీఎస్‌ఎల్వీ సీ 44

సైనిక అవసరాల కోసం పనిచేయనున్న మైక్రోశాట్

గగనతలం నుంచి హైరిజల్యూషన్ ఫొటోలు

4





గురువారం ఎర్రవల్లిలోని యాగక్షేత్రంలో చండీ అమ్మవారి పూజలో పాల్గొన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, శోభ దంపతులు, మనుమడు హిమాన్షు, మనుమరాలు అలేఖ్య, ఐఏఎస్ అధికారులు నర్సింగరావు, సోమేశ్‌కుమార్ తదితరులు

గురువారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని యాగక్షేత్రంలో శ్యామలాదేవికి హారతి ఇస్తున్న విశాఖ శారదాపీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి. చిత్రంలో అమ్మవారికి నమస్కరిస్తున్న సీఎం కేసీఆర్, ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



యాగక్షేత్రంలో మహారుద్రుడి వద్ద యజ్ఞం నిర్వహిస్తున్న రుత్విక్కులు

పంచాక్షరి ప్రతిధ్వని

Iవ పేజీ తరువాయి...

పారాయణం, మహామృత్యుంజయజపం వంటివి నిర్వహించారు. అనంతరం బ్రహ్మ స్వరూపిణి అయిన బగళాముఖి మండపంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతుల సమక్షంలో వేదపండితులు, రుత్విక్కులు పూజలుచేశారు. వరుసగా నాలుగో రోజు కూడా బగళాముఖికి పదివేల జపము జరిగింది. హరిద్రాన్నముతో రెండు వేల మూలమంత్ర సహితంగా హవనంచేశారు. ఆ తర్వాత సీఎం దంపతులను వేదపండితులు ఆశీర్వదించారు. మరోవైపు నవగ్రహ మండపంలో ఆదిత్య హృదయం, సూర్యనమస్కారాలు నిర్వహించారు. ప్రధాన యాగశాల అయిన చండీ మండపంలో రాజరాజేశ్వరిదేవి ప్రార్థన చేశారు. 400సార్లు చండీ సప్తశతి పారాయణం జరిగింది. వేదపండితులు సుభాషితాలు వినిపించారు. భజన కార్యక్రమాలతో మధ్యాహ్న పూజలు పూర్తికాగా సాయంకాలం నాలుగు గంటలకు లక్ష నవార్ణజపం పూర్తిచేశారు. సాయంత్రం ప్రదోషకాల సమయంలో అన్ని మండపాల్లో వైభవంగా పూజలు జరిగాయి. పూజానంతరం జరిగిన భజనకార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకొన్నది. శుక్రవారం జరిగే పూర్ణాహుతి కార్యక్రమంతో యాగం పూర్తికానున్నది. పూర్ణాహుతి కార్యక్రమాన్ని స్వయంగా జరిపించేందుకు విశాఖ శారదాపీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి ఎర్రవల్లి క్షేత్రానికి గురువారం రాత్రి చేరుకొన్నారు. ప్రదోషకాల పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాలుగోరోజు పూజాకార్యక్రమాలను శృంగేరీ పీఠ ప్రతినిధి బ్రహ్మశ్రీ మాడుగుల మాణిక్య సోమయాజులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబసభ్యులతోపాటు ఎంపీలు కల్వకుంట్ల కవిత, జోగినిపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యాయాదవ్, బూర నర్సయ్యగౌడ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీబీపాటిల్, సీతారాంనాయక్, బండప్రకాశ్, పసునూరి దయాకర్, వివేక్ దంపతులు, మాజీమంత్రులు జూపల్లి కృష్ణారావు, లక్ష్మారెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, ఎర్రబెల్లి దయాకర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, నన్నపునేని నరేందర్, భూపాల్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ఢిల్లీలో ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలాచారి, రైతుసమన్వయసమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, టీఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, టీఎస్‌టీఎస్ చైర్మన్ చిరుమల్ల రాకేశ్, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, టీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, టీఆర్‌ఎస్ నేతలు చందర్‌రావు, శానంపూడి సైదిరెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఐఏఎస్ అధికారులు నర్సింగరావు, సోమేశ్‌కుమార్, భూపాల్‌రెడ్డి, శాంతకుమారి, యోగితారాణా తదితరులు పాల్గొన్నారు.

సాగులో సమతుల్యం

- వానకాలం నుంచి పంటకాలనీల ఏర్పాటుకు సిద్ధం
- రాష్ట్రంలో తీరనున్న కూరగాయలు, పండ్ల కొరత
- మిగులు పంటలను ఎగుమతి చేసేందుకు ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు
- సెర్ప్, స్త్రీనిధి సంస్థల నుంచి నిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కూరగాయలు, పండ్ల ఉత్పత్తిలో ఏర్పడిన లోటును పూడ్చటంపై వ్యవసాయ, ఉద్యానవనశాఖలు దృష్టి సారించాయి. ఆయా పంటలను అదనంగా ప్రోత్సహించేందుకు పంటకాలనీలను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో లోటుఉన్న పంటలను సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలని, అవసరానికి మించిఉన్న పంట ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేయాలని ప్రతిపాదించింది. ఈ విధానాలతో రైతులకు అదనపు ఆదాయం కలిగించేలా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆలోచనల మేరకు వ్యవసాయ, ఉద్యానశాఖలు ఇప్పటికే పంటకాలనీల ఏర్పాటుపై కసరత్తు ప్రారంభించాయి.

6.34 లక్షల టన్నుల కూరగాయల లోటు!

రాష్ట్రంలో ఏడాదికి 22.28 లక్షల టన్నుల కూరగాయలు అవసరం అవుతున్నాయి. ఇందులో రాష్ట్ర రైతులు 15.94 లక్షల టన్నులు మాత్రమే పండిస్తున్నారు. దాదాపు 6.34 లక్షల టన్నుల లోటుఉన్నది. టమాట, వంకాయ, బెండ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ , ముల్లంగి వంటివి అవసరానికంటే 8.66 లక్షల టన్నులు అధికంగా ఉత్పత్తి అవుతుండగా, పచ్చిమిర్చి, బీర, కాకర, సొరకాయ, దోసకాయ, బీన్స్, క్యాప్సికం, ఆలుగడ్డ, చేమగడ్డ, క్యారట్, కందగడ్డ, ఆకుకూరలు, ఉల్లిగడ్డలు సహా 14 రకాల పంటలకు సంబంధించి 7.01 లక్షల టన్నుల కొరత ఉన్నది. కొరతగా ఉన్న కూరగాయల రకాలను 2.13 లక్షల ఎకరాల్లో అదనంగా సాగుచేయాలని ఉద్యానశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది.



ఎనిమిది రకాల పండ్లకూ కొరతే..

పండ్ల ఉత్పత్తిలో రాష్ట్రం చాలా వెనుకబడి ఉన్నది. ఇక్కడ వినియోగించే దాదాపు అన్నిరకాల పండ్ల ఉత్పత్తీ తక్కువగానే ఉన్నది. జామ, ద్రాక్ష, ఆపిల్, కర్బూజ, నేరేడు, అరటి, పైనాపిల్, దానిమ్మ అవసరాని కంటే .4.46 లక్షల టన్నుల లోటు ఉంది. ఆపిల్ రాష్ట్రంలో పండే పంట కాకపోవడంతో తప్పకుండా దిగుమతి చేసుకోవాల్సిందే.. జామ 23 వేల టన్నులు అవసరం కాగా, 13 వేల టన్నులు, ద్రాక్ష 27 వేల టన్నులకు 3 వేల టన్నులు, అరటి పండ్లు 3.39 లక్షలకు 73 వేల టన్నులు, దానిమ్మ 49వేల టన్నులకు 11 వేల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. ఆయా పండ్లఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించాలంటే అదనంగా 38వేల ఎకరాల్లో సాగుచేయాలని ఉద్యానశాఖ నివేదించింది. ఇక మామిడి, బొప్పాయి, కర్బూజ, సపోటా, కమలా, బత్తాయి ఉత్పత్తి అవసరానికి మించి 9.43 లక్షల టన్నులు అదనంగా ఉన్నది. ఈ పండ్లను ఎగుమతి చేయాలని భావిస్తున్నది. అందుకోసం ఆహారశుద్ధి పరిశ్రమలను స్థాపించాల్సిన అవసరం ఉన్నది.

స్త్రీనిధి ద్వారా నిధులు..

పంటకాలనీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), స్త్రీనిధి బ్యాంకుల నుంచి నిధులను ఖర్చు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. క్రాప్ కాలనీల ద్వారా రైతులు ఇష్టానుసారంగా పంటలు పండించి నష్టపోకుండా చూడడం.. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఏ ప్రాంతంలో పండించిన పంటను ఆ ప్రాంతంలో ప్రాసెసింగ్ చేయడం ద్వారా అదనపు ఆదాయాన్ని కల్పించడం ప్రభుత్వ ప్రధానమైన ఉద్దేశం. ఈ ప్రాసెసింగ్ యూనిట్లలో స్వయం సహాయకసంఘాలను భాగస్వామ్యం చేసి, స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు అందించి మహిళలకు ఉపాధి కల్పించనున్నారు.

రాష్ట్రంలో నూతన పండ్ల రకాల సాగు

ఉద్యానశాఖ ప్రోత్సాహంతో రాష్ట్రంలో కొత్త రకం పండ్ల పంటల సాగును రైతులు చేపడుతున్నారు. గతంలో కేవలం ఉత్తరాది రాష్ట్రాలకే పరిమితమైన డ్రాగన్ ఫ్రూట్, అంజీర్, యాపిల్‌బేర్ (గంగిరేగి), తాయిజామ వంటి పండ్ల సాగు తెలంగాణలోని పలు జిల్లాలకు విస్తరిస్తున్నది. నిజామాబాద్, మెదక్, నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో కొద్ది విస్తీర్ణంలో జరుగుతున్నది. గతేడాది నుంచి ఈ పండ్ల తోటల సాగు ఇతర రాష్ట్రాలలో చేపట్టేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో రాబోయే రోజుల్లో కొత్తరకాల పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ బృహత్‌కార్యక్రమానికి సంబంధించి పంటకాలనీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రైతుల నుంచి సమాచారం సేకరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఫిబ్రవరి, మార్చిలో రైతులవారీగా భూములు, పంటల వివరాలు సేకరించి ఏప్రిల్‌లో ఆ వివరాలను డిజిటలైజ్ చేయాలని నిర్ణయించింది.

కాంగ్రెస్ కార్టూన్‌పై ఒవైసీ ఫైర్

- ఈసీని కించపరుచడంపై ఆగ్రహం
- హద్దు మీరొద్దని హెచ్చరిక



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఎన్నికల సంఘాన్ని విమర్శిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రదర్శించిన వివాదాస్పదమైన కార్టూన్‌పై ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నాయకులు హద్దుమీరుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఎన్నికలు నిర్వహించడంలో ఎన్నికల సంఘం విఫలమైందంటూ కాంగ్రెస్ నాయకులు గురువారం నిరసన వ్యక్తంచేస్తూ ఓ బ్యానర్‌ను ప్రదర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని ధృతరాష్ట్రుడితో, ఈ ఆర్వో, డీఈవో, సీఈవోను దుశ్శాసనుడితో, ఓటర్లను ద్రౌపదితో పోల్చుతూ బ్యానర్ ఏర్పాటుచేశారు. ఇదే బ్యానర్‌లో సీఎం కేసీఆర్, అసదుద్దీన్ ఒవైసీ ఫొటోలను ఉంచారు. దీనిపై స్పందిస్తూ ఒవైసీ మీడియాతో మాట్లాడారు. 'ఇదే కార్టూన్‌ను సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ, రాహుల్‌గాంధీ మీద వేస్తే సహిస్తారా. ఎలా ఫీల్ అవుతారు?' అని ప్రశ్నించారు. ఓటమిపాలైన కాంగ్రెస్.. విచక్షణ కోల్పోయి ఇలాంటి కార్టూన్లకు తెరలేపిందని, కాంగ్రెస్ హద్దుమీరి ప్రవర్తిస్తున్నదని మండిపడ్డారు. 'తెలంగాణ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. మీరు ఓడిపోయారు. మీరు విచక్షణ కోల్పోతున్నారు. కౌరవులకంటే హీనం మీరు. అదుపులో ఉండండి' అంటూ హెచ్చరించారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 6.04 గంటలకు

విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, పంచమి సాయంత్రం 6.20 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: ఉత్తర సాయంత్రం 4.26 వరకు, తదుపరి హస్త, అమృతఘుడియలు: ఉదయం 9.49 నుంచి 11.25 వరకు, రాహుకాలం: ఉదయం 11.05 నుంచి మధ్యాహ్నం 12.28 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.07 నుంచి 9.52 వరకు, తదుపరి మధ్యాహ్నం 12.51 నుంచి 1.35 వరకు, వర్జ్యం: లేదు.

8,223 గ్రామాల్లో కంటిశిబిరాలు పూర్తి

- 1,36,72,552 మందికి పరీక్షలు
- 20,96,668 మందికి కండ్లద్దాల పంపిణీ
- నిరాటంకంగా వైద్యశిబిరాల నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంధత్వరహిత తెలంగాణ సాధన దిశగా.. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల కోసం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా 8,223 గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలోని 676 వార్డుల్లో వైద్యశిబిరాల నిర్వహణ పూర్తయింది. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి గురువారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 1,36,72,552 మందికి కంటివైద్య పరీక్షలు చేయగా.. 20,96,668 మందికి కండ్లద్దాలు అందజేశారు. కాగా, గురువారం రాష్ట్రవ్యాప్తంగా 89,073 మందికి కంటి పరీక్షలు చేశారు.

కంటి వైద్య శిబిరాల్లో సేవలు పొందిన వారి సంఖ్య

క్యాటగిరీ	గురువారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	89,073	1,36,72,552
రీడింగ్ అద్దాలు పొందినవారు	7,125	20,96,668
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	5,931	10,02,504
కంటి సమస్యలపై రెఫరల్	4,783	8,50,336

కంటి సమస్యకు పరిష్కారం దొరికింది



దీర్ఘకాలికంగా కంటి సమస్యతో బాధపడుతున్నా. సీఎం కేసీఆర్ ఉచితంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిసి శిబిరానికి వచ్చా. వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. కండ్లజోడు అవసరమని గుర్తించి వెంటనే ఇచ్చారు. దీంతో కంటి సమస్యకు పరిష్కారం లభించింది.

- రాజేశ్, కొత్తగూడెం

ఉమ్మడి హైకోర్టు చరాస్తుల విభజన కొలిక్కి

- రెండు రాష్ట్రాల సీఎస్‌ల చర్చల్లో స్పష్టత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి హైకోర్టు చరాస్తుల విభజన అంశం కొలిక్కి వచ్చింది. గురువారం హైదరాబాద్‌లోని బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు బిల్డింగ్‌లో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ సీఎస్ ఎస్కే జోషి, ఏపీ సీఎస్ ఏసీ పునీత, రెండు రాష్ట్రాల రిజిస్ట్రార్ జనరల్స్, న్యాయశాఖ కార్యదర్శులు పాల్గొన్నారు. ఉమ్మడి హైకోర్టు చరాస్తుల విభజనపై చర్చించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లో పేర్కొన్నట్టుగా జనాభా నిష్పత్తి ప్రాతిపదికన ఉండాలని ఏపీ సీఎస్ పునీత చేసిన సూచనలను అందరూ అంగీకరించారు.



స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను సంఘం ప్రతినిధులకు అందజేస్తున్న మేడిపల్లి రెవెన్యూ సిబ్బంది

చాత్తాద శ్రీవైష్ణవ సంఘానికి భూమి కేటాయింపు

అంబర్‌పేట: చాత్తాద శ్రీవైష్ణవ సంఘం భవనానికి రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించింది. మేడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఎకరం ప్రభుత్వ స్థలాన్ని సంఘం ప్రతినిధులకు అప్పగించారు. మేడిపల్లి తహసీల్దార్ అహల్య ఆదేశాల మేరకు అక్కడి కార్యాలయం సిబ్బంది.. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్, ఉపాధ్యక్షుడు అమరేశ్ విష్ణు, ప్రధాన కార్యదర్శి పరాంకుశం వెంకటేశ్వర్లు, కోశాధికారి తిరుక్కోవల్లూరి కృష్ణస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోధనం పరాంకుశం, యువజన క్రీడాకార్యదర్శి తిరునగరి రాజేశ్‌కుమార్‌కు ఆ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వేణుమాధవ్ మాట్లాడుతూ స్థలంతోపాటు రూ.కోటి మంజూరుచేసినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

అడవిదొంగలపై ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి...

ముల్తానీ గ్యాంగ్‌కు చెందిన ఆరుగురిని అరెస్టుచేశారు. వీరు ఈ కలపను నిజామాబాద్ డిప్యూటీ మేయర్ ఫహీంకు చెందిన బిలాల్ సామిల్లు, కార్పొరేటర్ మిస్బాబేగ్‌కు చెందిన సోహేలి సామిల్లుతోపాటు మరో రెండు సా మిల్లులకు తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈ కలపంతా మహారాష్ట్రలోని నాందేడ్ అటవీ ప్రాంతం నుంచి తీసుకువస్తున్నట్టు నకిలీ పత్రాలు సృష్టించి చెక్‌పోస్టుల వద్ద అధికారులను మాయచేస్తున్నట్టు విచారణలో తేలింది.

అధికారులపైనా కఠిన చర్యలు

స్మగ్లర్లతో అంటకాగుతున్న అధికారులపైనా ప్రభుత్వం కఠినచర్యలు ప్రారంభించింది. స్మగ్లర్లతో కుమ్మక్కయిన ఉట్నూర్ ఎఫ్ఎస్వో రాజేందర్, నిర్మల్ జిల్లా సోన్ చెక్‌పోస్టు సిబ్బంది సద్దాం, నిజామాబాద్ జిల్లాకు చెందిన ఏఆర్ ఎస్సై షకీల్‌పై పీడీ యాక్ట్ నమోదుచేశారు. ఈ అక్రమ రవాణాలో నిజామాబాద్ నార్త్ ఎఫ్‌డీవో వేణుబాబు, నార్త్ రేంజ్ అధికారి రవిమోహన్‌భట్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్‌ల ప్రమేయం ఉన్నట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. వీరంతా సా మిల్లు యజమానుల నుంచి మామూళ్లు తీసుకుంటున్నట్టు తేలింది. దీంతో సర్కారు తాజాగా ముగ్గురు అటవీ అధికారులపై వేటువేసింది. ఇటీవల నిర్మల్ జిల్లాలో పట్టుబడిన అక్రమ కలప కేసుతో సంబంధం ఉందని ఆరోపణలు వచ్చిన ఆదిలాబాద్ ఇచ్చోడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీశ్‌కుమార్, నేరడుగొండ ఎస్‌ఐ హరిశేఖర్‌లను కరీంనగర్ రేంజ్ డీఐజీకి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎవరున్నా ఉపేక్షించేది లేదు

పర్యావరణ సమతుల్యత రక్షణలో భాగంగా అడవులను కాపాడటంపై సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. కలపస్మగ్లర్లు, అటవీనేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ఆదేశాలు జారీచేయడంతో ఈ నెల పదో తేదీ నుంచి అటవీ, పోలీస్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక దాడులను నిర్వహిస్తున్నారు. అడవులను లూటీ చేసే స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతామని, ఇందులో రాజీపడే ప్రసక్తే లేదని సీఎం కేసీఆర్ తాజా శాసనసభ సమావేశాల్లోనూ పునరుద్ఘాటించారు. అడవుల్లోని పెద్దపెద్ద వృక్షాలను కలపగా మార్చి వ్యాపారం సాగిస్తున్నవారిపైనా నిఘా పెట్టారు. సీఎం కార్యాలయం నుంచి సైతం ఉన్నతాధికారులు ప్రతి నిమిషం గమనిస్తున్నారు. స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రోజువారీగా నివేదికలు తెప్పించుకుంటున్నట్టు తెలిసింది. కలప రవాణాలో ఏ స్థాయి ప్రజాప్రతినిధులు ఉన్నా.. ఎంతటివారు ఉన్నా సరే వదిలేదిలేదని ఇప్పటికే స్పష్టమైన సంకేతాలు వెళ్లాయి. క్షేత్రస్థాయిలో అటవీశాఖ బృందా లు కలప స్మగ్లర్లకోసం ముమ్మర వేట కొనసాగిస్తున్నాయి. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 499 గ్రామాలలో దాడులు జరిగాయి. 450 మంది వరకు కరడుగట్టిన అటవీనేరగాళ్లను, స్మగ్లర్లను గుర్తించారు. 310 సామిల్లులపై దాడులుచేసి 480 కార్పెంటర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల నేపథ్యంలో కొంద రు అవినీతి అధికారులు, మరికొందరు 'నాయకుల' రూపంలో ఉన్న కలప వ్యాపారస్థులు కుమ్మక్కై అడవులను అడ్డంగా కొట్టుకుని అమ్ముకుంటున్న దందాలు కూడా ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

పాత నేరస్థులపై పీడీ కేసులు

అశ్వారావుపేట, నమస్తే తెలంగాణ: అడవుల అక్రమరవాణాకు సంబంధించి పాత నేరస్థుల జాబితాను అధికారులు సిద్ధంచేశారు. పాత నేరస్థులను కట్టడి చేయటం ద్వారా అడవులను కాపాడాలని ప్రణాళికలు రూపొందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 450 మంది పాత నేరస్థులపై పోలీసులు విచారణ ప్రారంభించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ విచారణ చురుగ్గా సాగుతున్నది. విచారణ పూర్తయ్యాక కలప స్మగ్లర్లపై పీడీ కేసులు నమోదుచేస్తారు. రాబోయే రోజుల్లో స్మగ్లర్లు ఒక్క చెట్టును కూడా నరికే పరిస్థితి లేకుండా స్మగ్లర్లను నియంత్రిస్తామని ఉన్నతాధికారులు స్పష్టంచేశారు. అశ్వారావుపేట మండలంలో 15మంది పాతనేరస్థులపై విచారణచేస్తున్నామని ఫారెస్ట్ రేంజర్ ముక్తార్ హుస్సేన్ తెలిపారు.

అక్రమార్కుల గుండెల్లో దడ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అటవీ ప్రాంతం అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలప అక్రమార్కుల గుండెల్లో దడ మొదలైంది. జిల్లాకు సరిహద్దుగా ఉన్న ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అక్రమంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అటవీ ప్రాంతాల నుంచి కలప అక్రమ రవాణా జరుగుతున్నది. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల ఆర్థిక బలహీనతలను ఆసరాచేసుకుని అడవులను నరుకుతున్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట వద్ద ఫారెస్ట్ అధికారులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏటూరు నాగారం నుంచి ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తున్న జిట్రేగి దిమ్మెలను, కరకగూడెం మండలంలోని తాటిగూడెం వద్ద మొక్కజొన్న కంకుల మధ్యలో తరలిస్తున్న టేకు, జిట్రేగి దిమ్మెలను పట్టుకున్నారు. కలప అక్రమార్కులను నియంత్రించేందుకు ప్రభుత్వం పీడీ యాక్టును ప్రయోగించేందుకు సన్నద్ధమయింది.

లోకం పోకడ



నాది పెద్దపులి గుర్తు.. నేనెక్కడ నుంచి తెచ్చివ్వాలి మొర్రో..!

కన్ఫర్డ్ ఐఏఎస్ పదోన్నతులు సిద్ధం

- త్వరలో డీవోపీటీకి పంపనున్న రాష్ట్రం
- నాన్‌క్యాడర్ ఐఏఎస్‌ల జాబితా ఎంపికకు కసరత్తు.. దరఖాస్తులకు ఆహ్వానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రప్రభుత్వం కన్ఫర్డ్ ఐఏఎస్‌ల పదోన్నతుల కోసం రెవెన్యూశాఖలో అర్హులైన డిప్యూటీ కలెక్టర్ల జాబితాను రూపొందించింది. ఈ జాబితాను అతి త్వరలో డీవోపీటీకి పంపించనున్నారు. సర్కారు ఆదేశాల మేరకు సీసీఎల్ఏ ఈ జాబితాను రూపొందించి, ప్రభుత్వానికి అందజేసింది. జాబితాలోని అధికారుల ట్రాక్‌రికార్డును పరిశీలించిన జీఏడీ తుదిజాబితాను ఓకే చేసింది. ఇందులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లైన ఎన్ సత్యాశారదాదేవి, సీ నారాయణరెడ్డి, సామలూరు హరీశ్, గుగులోత్ రవి, కే నిఖిల, మస్రత్‌ఖానమ్ అయేషా, కందుల స్నేహ, సంగీత సత్యనారాయణ, షేక్ యాస్మిన్ భాష, ఎస్ వెంకట్రావు ఉన్నారు. వీరితోపాటు 2017లో కేంద్రానికి చేరి కన్ఫర్డ్ ఐఏఎస్‌ల జాబితాలో పెండింగ్‌లో ఉన్న సీనియర్ డిప్యూటీ కలెక్టర్ స్వర్ణలత పేరు కూడా ఉన్నది. కాగా, రెవెన్యూశాఖలో సీనియార్టీకి సంబంధించిన వివాదంలో ఉన్న ఒక అధికారి పేరును ప్రభుత్వానికి పంపించలేదని తెలిసింది. ఇదిలాఉండగా, నాన్‌క్యాడర్ కన్ఫర్డ్ ఐఏఎస్‌ల ఎంపికకు రాష్ట్రప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఫిబ్రవరి నెలాఖరువరకు స్వీకరించిన దరఖాస్తుల నుంచి 10 మందిని ఎంపికచేసి డీవోపీటీకి పంపిస్తారు. డీవోపీటీ వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఇద్దరిని ఎంపికచేస్తుంది. ఈ ఎంపికతో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు నాన్‌క్యాడర్ కన్ఫర్డ్ ఐఏఎస్ పోస్టులు భర్తీకానున్నాయి. 2013-14లో నాన్‌క్యాడర్ కన్ఫర్డ్ ఐఏఎస్‌ల పదోన్నతుల కోసం డీవోపీటీకి జాబితాను పంపించారు. జాబితాలో డీవోపీటీ వరకు వెళ్లిన తరువాత కొద్దిపాటి తేడాతో కన్ఫర్డ్ ఐఏఎస్ దక్కని అధికారులు తెలంగాణలో ఆరుగురు ఉన్నారు. ఈ దఫా ఐఏఎస్ పదోన్నతి కోసం వీరు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నది.

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవల్లిలో గల సీఎం కేసీఆర్ వ్యవసాయక్షేత్రంలో నిర్వహిస్తున్న యాగంలో సరస్వతీదేవి అలంకరణలో ఉన్న చండీమాతకు పూజలు చేస్తున్న రుత్వికులు



గురువారం చండీయాగంలో భాగంగా బగళాముఖి అమ్మవారికి హారతి ఇస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు దంపతులు. చిత్రంలో సీఎం కేసీఆర్ మనుమలు హిమాన్షు, ఆదిత్య, మనుమరాలు అలేఖ్య తదితరులు ఉన్నారు.



నవగ్రహ పూజలో పాల్గొన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, శోభ దంపతులు, సీఎం మనుమలు, మనుమరాలు



యాగశాలలో శృంగేరి శారదామాత రూపం



చండీ యాగశాలలో శారదా పీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకుంటున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి



మహారుద్రసహిత సహస్ర చండీమాతా పూజలో పాల్గొన్న ఎంపీలు జోగినిపల్లి సంతోష్‌కుమార్, కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి తదితరులు



చండీయాగానికి హాజరైన టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణిని పలుకరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు



మహారుద్రసహిత సహస్ర చండీయాగంలో భాగంగా ముత్తైదువులకు సారె అందజేస్తున్న ఎంపీ కవిత, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సతీమణి శైలిమ

తారకరాముడి ఆపన్నహస్తం



- బాధితుల విజ్ఞప్తులపై కేటీఆర్ సత్వర స్పందన
- వైద్యం కోసం ఆర్థికసాయం అందించేలా చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రత్యక్షంగా కలిసినా, సామాజిక మాధ్యమాల ద్వారా విన్నవించినా, సమస్యపై పత్రికల్లో చూసినా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు వెంటనే స్పందిస్తారు. బాధితులకు ఆపన్నహస్తం అందించి మానవత్వాన్ని చాటుకుంటారు. వైద్య చికిత్సల కోసం ఆర్థికసాయం అందించాలని గురువారం ట్విట్టర్ ద్వారా బాధితులు చేసిన విజ్ఞప్తులపై స్పందించి.. సాయం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

☞ జనగామ జిల్లా ఓబుల్ కేశవాపూర్‌వాసి దూసరి సాగర్(25) పేద గీత కార్మికుడు. కాలేయసమస్యతో సన్‌షైన్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. చికిత్సకు రూ.13.92 లక్షలు ఖర్చవుతుందని దవాఖాన వర్గాలు తెలిపాయి. సాయం అందించాలని ట్విట్టర్ వేదికగా కేటీఆర్‌కు విజ్ఞప్తిచేశారు. వెంటనే స్పందించిన ఆయన.. ఆ మొత్తాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. సాగర్‌కు సాయం చేయాలని ఇప్పటికే మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి కూడా సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు.

☞ రెండునెలలు కూడా నిండని తమ కుమార్తె హైపోగ్లూకోమియా వ్యాధితో బాధపడుతున్నదని, ఆమె చికిత్సకు అవసరమైన సాయాన్ని అందించాలని కూకట్‌పల్లికి చెందిన వీఎన్వీ ప్రసాద్ ట్విట్టర్‌లో కేటీఆర్‌ను కోరారు. స్పందించిన ఆయన చిన్నారికి సాయం అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు.

☞ హైదరాబాద్‌కు చెందిన 11 ఏండ్ల మజియా తమ కుమార్తె అరుదైన వ్యాధితో బాధపడుతున్నదని, ఆమె చికిత్సకు అవసరమైన సాయాన్ని అందించాలని తల్లిదండ్రులు ట్విట్టర్ వేదికగా కేటీఆర్‌కు విజ్ఞప్తిచేశారు. స్పందించిన ఆయన.. మజియాకు సాయం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు.

దుష్టశక్తుల అంతానికి పరిష్కారం చూపాలి



- ట్విట్టర్ ద్వారా స్పందించిన నిజామాబాద్ ఎంపీ కవిత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ట్విట్టర్ ద్వారా స్పందించారు. పోషకాహారలోపం, విద్య అందకపోవడం, లైంగిక దుష్ప్రవర్తన వంటి సమస్యలు ఇప్పటికీ మన దేశ బాలికలపై ప్రభావం చూపుతున్నాయని విచారం వ్యక్తంచేశారు. ఇలాంటి దుష్టశక్తుల అంతానికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉన్నదని, అప్పుడే మన దేశం నిజమైన ప్రగతి వైపు పయనిస్తుందని అభిప్రాయపడ్డారు.

నేటినుంచి హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్

- కళలు, సాహితీ, సంస్కృతులపై అతి పెద్ద అంతర్జాతీయ ఉత్సవం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కళలు, సాహితీసంస్కృతుల మేళవింపుతో హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ శుక్రవారం ప్రారంభం కానున్నది. మూడురోజులపాటు జరిగే ఈ వేడుకలను బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఉత్సవాల్లో దేశవిదేశాల నుంచి కవులు, కళాకారులు, రచయితలు, పరిశోధకులు, ప్రచురణకర్తలు, విద్యార్థులు పాల్గొంటున్నారు. వివిధ సాహిత్య ప్రక్రియలపై చర్చలు, ఫొటో ప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు, చైతన్య కార్యక్రమాలు, లఘుచిత్రాల ప్రదర్శన ఉంటాయి. ప్రముఖ కళాకారిణి, మల్లికా సారాబాయి, ఉర్దూ కవి కైఫీ ఆజ్మీల శతజయంతితోపాటు మహాత్మాగాంధీ 150వ జయంతి సంవత్సరాన్ని పురస్కరించుకొని ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. తెలంగాణ టూరిజమ్ పెవిలియన్, హెచ్‌పీఎస్ హంపీ థియేటర్, మూవింగ్ ఇమేజెస్ టాకీస్, మీట్ ద ఆథర్ కార్నర్ వేదికలను ఏర్పాటుచేశారు. మూడు రోజులపాటు జరిగే 150 కార్యక్రమాలు, 30 సదస్సుల్లో.. 40 మంది కళాకారులు, 60 మంది కవులు, 220 మంది వివిధరంగాల నిపుణులు పాల్గొంటున్నారు. అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా ప్రతినిధులు వస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 8గంటల వరకు కార్యక్రమాలు జరుగుతాయి.

బాలికల సంరక్షణకు ప్రాధాన్యం

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో తగ్గిన బాల్యవివాహాలు
- బాలికా సంరక్షణ దినోత్సవంలో హోంమంత్రి మహమూద్ అలీ



జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవంలో పాల్గొన్న హోంమంత్రి మహమూద్ అలీ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ / తెలుగు యూనివర్సిటీ: బాలికల సంరక్షణకు సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని హోం మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో రాష్ట్రంలో బాల్యవివాహాలు తగ్గుముఖం పట్టాయని చెప్పారు. గురువారం నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహమూద్ అలీ మాట్లాడుతూ.. బాలికల పట్ల వివక్ష చూపకుండా వారికి సమాన అవకాశాలు కల్పించాలన్నారు. కుటుంబంలోని ఒక్క బాలిక విద్యావంతురాలైతే ఆ కుటుంబం మొత్తం ముందంజలో ఉంటుందని చెప్పారు. మహిళల రక్షణకోసం షీటీమ్స్ ఏర్పాటుచేశామని, ఆడబిడ్డ పుట్టినప్పటినుంచి విద్య వరకు అన్నివిధాలుగా సహాయం చేస్తున్నామని, ఆడపిల్ల పెండ్లి భారం అనుకొనే ఎందరో పేద తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఎంతో భరోసా ఇచ్చాయన్నారు. బాలికల విద్యకు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నామని, ప్రత్యేకించి ముస్లిం మైనార్టీ బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు తీసుకొంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని చెప్పారు. పెరిగిపోతున్న టెక్నాలజీతో యువత పెడదోవ పట్టకుండా, టెక్నాలజీని వినియోగించుకొని మరింత వృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్లు లక్ష్మీదేవీ, లలితకుమారి, హైదరాబాద్ డీఈవో వెంకటనరసమ్మ పాల్గొన్నారు. పలువురు బాలికలను వండర్ కిడ్స్ , సూపర్ కిడ్స్ బహుమతులు అందజేశారు.

ఎఫ్‌ఆర్వోలకు నియామక పత్రాలు

- 66 మందిలో 21 మంది మహిళలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన 66 మంది ఫారెస్ట్ రేంజ్ అధికారులు గురువారం నియామకపత్రాలు అందుకున్నారు. అరణ్యభవన్‌లో అటవీ సంరక్షణ అధికారి పీకే ఝా అభ్యర్థులకు పత్రాలు అందజేశారు. 66 మందిలో 21 మంది మహిళలు ఉండగా, 18 నెలల శిక్షణలో భాగంగా 41 మంది అసోంకు, 25 మంది కర్ణాటకలోని ధార్వాడ్‌కు వెళ్లనున్నారు. ఫిబ్రవరి రెండోవారంలో శిక్షణ మొదలుకానున్నది. రాష్ట్ర ప్రభుత్వం అడవుల సంరక్షణ, అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యతనిస్తున్నదని, ఈ ప్రక్రియలో భాగస్వాములవుతున్న కొత్త ఎఫ్ఆర్వోలు నిబద్ధతతో పనిచేయాలని పీకే ఝా సూచించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు రఘువీర్, పృథ్వీరాజ్, మునీంద్ర పాల్గొన్నారు.

18 నుంచి టైలరింగ్, డ్రాయింగ్ పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వచ్చేనెల 18 నుంచి టైలరింగ్, ఎంబ్రాయిడరీ, డ్రాయింగ్ లోయర్‌గ్రేడ్ పరీక్షలను, ఫిబ్రవరి 19 నుంచి హయ్యర్‌గ్రేడ్ పరీక్షలను నిర్వహిస్తున్నామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ తెలిపారు. ఉదయం 10నుంచి 12.30 గంటలవరకు, మధ్యాహ్నం 2నుంచి 4.30 గంటలవరకు పరీక్షలు నిర్వహిస్తారు. వివరాలకు www.bes.telangana.gov.inలో సంప్రదించాలని డైరెక్టర్ తెలిపారు.

వెబ్‌సైట్‌లో హెడ్‌మాస్టర్స్ అకౌంట్స్ పరీక్ష ఫలితాలు

డిసెంబర్‌లో నిర్వహించిన హెడ్‌మాస్టర్స్ అకౌంట్స్ పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేశామని పరీక్షల డైరెక్టర్ సుధాకర్ తెలిపారు. ఫలితాలను www.bes.telangana.gov.inలో పెట్టామని, సర్టిఫికెట్లు పంపిణీ చేశామనిచెప్పారు.

బ్యాలెట్ పేపర్లకు మళ్లీ ప్రసక్తే లేదు

- ఎన్నికల్లో ఈవీఎంలనే వినియోగిస్తాం
- ఎవరి బెదిరింపులకూ భయపడం
- విమర్శలు, సూచనలను స్వీకరిస్తాం
- సీఈసీ సునీల్ అరోరా స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) వినియోగంపై దేశ వ్యాప్తంగా విమర్శలు వ్యక్తం అవుతున్నా ఎన్నికల సంఘం (ఈసీ) ఏమాత్రం వెనక్కి తగ్గడంలేదు. ఈవీఎంలను వినియోగించొద్దన్న బెదిరింపులకు భయపడబోమని, మళ్లీ బ్యాలెట్ పేపర్ల యుగంలోకి వెళ్లే ప్రసక్తే లేదని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) సునీల్ అరోరా గురువారం తేల్చిచెప్పారు. ఎన్నికల కమిషన్‌పై బురద చల్లేందుకు కొన్ని వర్గాలు ఈవీఎంలను 'ఫుట్‌బాల్'లా ఉపయోగించుకుంటున్నాయని ధ్వజమెత్తారు. 'పోలింగ్ కోసం ఎట్టిపరిస్థితుల్లోనూ బ్యాలెట్ పేపర్లను ఉపయోగించే ప్రశ్నే లేదు. కండబలం ఉపయోగించి బ్యాలెట్ బాక్సులను అపహరించడం, క్షేత్రస్థాయిలో పోలింగ్ సిబ్బందిని వేధించడం, ఓట్ల లెక్కింపులో జాప్యం లాంటి పరిస్థితులను మళ్లీ కొనితెచ్చుకునే ప్రసక్తే లేదు' అని స్పష్టం చేశారు. శుక్రవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో సునీల్ అరోరా మాట్లాడుతూ రాజకీయ పార్టీలు సహా ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి నుంచి విమర్శలను, సలహాలను స్వీకరించేందుకు సిద్ధమన్నారు. ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని, 2014 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని సైబర్ నిపుణుడిగా చెప్పుకొంటున్న ఓ వ్యక్తి ఇటీవల ఆరోపించిన నేపథ్యంలో సునీల్ అరోరా ఈ వ్యాఖ్యలు చేశారు. ఈవీఎంలపై అనుమానాల నేపథ్యంలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లను ఉపయోగించాలని పలు ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈవీఎంల పనితీరును సునీల్ అరోరా సమర్థించారు. 2014 లోక్‌సభ ఎన్నికలు మొదలు ఇప్పటివరకు జరిగిన వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పూర్తి భిన్నమన్నారు. ఈవీఎంలను హ్యాక్‌చేసేందుకు అవకాశముంటే ఈ ఫలితాలెలా వస్తాయని ప్రశ్నించారు. దేశ రక్షణకు విస్తృత స్థాయిలో సేవలందిస్తున్న రెండు ప్రభుత్వ రంగ సంస్థలు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలను, పేపర్ ట్రయల్ మెషిన్లను (వీవీ ప్యాట్లను) తయారు చేస్తున్నాయని, కనుక వీటి పనితీరు గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సునీల్ అరోరా చెప్పారు.

సీబీఐ డైరెక్టర్ ఎంపికపై నిర్ణయం వాయిదా

- మోదీ నివాసంలో సమావేశమైన ఉన్నతస్థాయి కమిటీ
- నిర్ణయం తీసుకోకుండానే ముగిసిన భేటీ
- తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వర్‌రావు నియామకంపై పిటిషన్ విచారణ నుంచి వైదొలిగిన జస్టిస్ సిక్రీ

న్యూఢిల్లీ, జనవరి 24: సీబీఐ నూతన డైరెక్టర్ ఎంపిక కోసం గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో జరిగిన ఉన్నత స్థాయి కమిటీ సమావేశం అసంపూర్తిగా ముగిసింది. దీంతో మరోమారు భేటీ కావాలని నిర్ణయించినట్లు తెలుస్తున్నది. 'ఈ పదవికి అర్హులైన అధికారుల అర్హత వివరాలను కమిటీ సభ్యులకు పంపిణీ చేయడం జరిగింది. కానీ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ అధికారి తెలిపారు. ప్రధాని మోదీ అధికారిక నివాసంలో జరిగిన ఈ సమావేశానికి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే హాజరయ్యారు. సమావేశం తర్వాత ఖర్గే మీడియాతో మాట్లాడుతూ అర్హులైన అధికారుల పేర్లు మాత్రమే తెలుసుకున్నామని చెప్పారు. 'ఆయా అధికారుల పేర్లపై చర్చించాం. వారి అనుభవాలు తదితర విషయాలు తెలియజేయలేదు. అధికారులకు సంబంధించిన పూర్తి వివరాలు అందజేయాలని మేము కోరాం. తదుపరి భేటీ వచ్చేవారం జరుగవచ్చు' అని చెప్పారు. ఇదిలా ఉండగా సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం నాగేశ్వర్‌రావును నియమించడాన్ని సవాల్ చేస్తూ కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్ గురువారం విచారణకు వచ్చినప్పుడు ఆ బెంచ్ నుంచి తప్పుకుంటున్నట్లు జస్టిస్ సిక్రీ తెలిపారు. దీనిపై విచారణ జరుపడం తనకు ఇష్టం లేదని, ధర్మాసనం నుంచి వైదొలుగుతున్నట్లు కామన్ కాజ్ తరఫు న్యాయవాది దుష్యంత్ దవేకు తెలిపారు. ఈ పిటిషన్‌పై విచారణ బెంచ్ నుంచి ఇంతకుముందు చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ తప్పుకున్న సంగతి తెలిసిందే. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మను తొలిగించిన ఉన్నతాధికార కమిటీలో జస్టిస్ సిక్రీ కూడా ఉన్న విషయం విదితమే.

లోక్‌సభ ఎన్నికల్లో
టీఆర్‌ఎస్ క్లీన్‌స్వీప్!

మొదటిపేజీ తరువాయి...

వైసీపీ ఘన విజయాన్ని సొంతం చేసుకుంటుందని సర్వే పేర్కొన్నది. మరోవైపు జాతీయస్థాయిలో ఎన్డీయేకు ఎదురుగాలి వీస్తున్నదని, ఆ కూటమి సాధారణ మెజార్టీ సాధించడం కష్టమేనని సర్వేలో తేలింది. అటు యూపీఏ, ఇటు ఎన్డీయే మెజార్టీ సాధించలేని పక్షంలో ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటును నిర్దేశించనున్నాయని సర్వే స్పష్టంచేసింది.

తెలంగాణలో టీఆర్‌ఎస్ ప్రభంజనం

తెలంగాణలో టీఆర్‌ఎస్ రికార్డుస్థాయిలో 42.4% ఓట్లు సాధించి అగ్రస్థానంలో ఉంటుందని రిపబ్లిక్ టీవీ-సీ వోటర్ సర్వే పేర్కొంది. యూపీఏ 29%, ఎన్డీఏ 12.7%, ఎంఐఎం 7.7% ఓట్లను సాధిస్తాయని సర్వే వివరించింది. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పట్టిన తెలంగాణ ప్రజలు.. లోక్‌సభ ఎన్నికల్లోనూ అదే తీరులో జేజేలు పలుకనున్నారని, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే పునరావృతమవుతాయని వెల్లడించింది.

తెలంగాణలో మొత్తం స్థానాలు : 17	
టీఆర్‌ఎస్	16
ఎంఐఎం	01
యూపీఏ	00
ఎన్డీయే	00
ఓట్ల శాతం	
టీఆర్‌ఎస్	42.4%
యూపీఏ	29%
ఎన్డీయే	12.7%
ఎంఐఎం	7.7%

ఏపీలో వైసీపీకి 19 స్థానాలు

ఏపీలోని మొత్తం 25 లోక్‌సభ స్థానాల్లో 19 చోట్ల ప్రతిపక్ష వైసీపీ గెలుస్తుందని సర్వే తెలిపింది. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని అధికార టీడీపీ కేవలం ఆరుస్థానాలకే పరిమితం కానున్నదని పేర్కొంది. ఇక్కడ కూడా కాంగ్రెస్, బీజేపీ ఒక్క స్థానాన్ని కూడా గెలిచే పరిస్థితులు లేవని తెలిపింది. ఏపీలో వైసీపీ 41.3% ఓట్లతో అగ్రస్థానంలో, టీడీపీ 33.1% ఓట్లతో రెండో స్థానంలో ఉంటుందని అంచనావేసింది.

ఎన్డీయేకు గడ్డుకాలం!

జాతీయస్థాయిలో ఎన్డీయే కూటమికి కష్టకాలం తప్పదని సర్వే పేర్కొన్నది. గత ఎన్నికల్లో ఎన్డీయే 336 స్థానాల్లో ఘన విజయం సాధించగా, వచ్చే ఎన్నికల్లో 233 స్థానాల్లో మాత్రమే గెలుస్తుందని తెలిపింది. యూపీలో ఎస్పీ-బీఎస్పీ కూటమి (మహా ఘట్‌బంధన్), తెలంగాణలో టీఆర్‌ఎస్, ఏపీలో వైసీపీ, పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, తమిళనాడులో డీఎంకే అత్యధిక స్థానాల్లో గెలుస్తాయని సర్వేలో తేలింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి 233 స్థానాలు, యూపీఏకి 167 స్థానాలు లభిస్తాయని, ఇతర ప్రాంతీయ పార్టీల అభ్యర్థులు 143 చోట్ల గెలుస్తారని సర్వే వెల్లడించింది. ఏ కూటమికీ పూర్తిస్థాయిలో మెజార్టీ వచ్చే అవకాశాలు లేవని పేర్కొంది. లోక్‌సభలో సాధారణ మెజార్టీకి 272 సీట్లు అవసరం కాగా, అధికారానికి ఎన్డీయే 39 సీట్ల దూరంలో ఉంటుందని, యూపీఏ కూడా సొంతంగా ప్రభుత్వం ఏర్పాటుచేసే పరిస్థితి ఉండనందున టీఆర్‌ఎస్, తృణమూల్, డీఎంకే, వైసీపీ వంటి ప్రాంతీయ పార్టీలు చక్రం తిప్పనున్నాయని సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయి.

ఎన్డీయేకు ఎదురుగాలి!

233 స్థానాల్లో కూటమి గెలుపు ■ యూపీఏ 167 చోట్ల విజయం ■ 143 స్థానాల్లో ప్రాంతీయ పార్టీల ఆధిక్యం

- లోక్‌సభ ఎన్నికల్లో ఏ కూటమికి దక్కని మెజార్టీ
- రిపబ్లిక్ టీవీ — సీ ఓటర్ సర్వేలో వెల్లడి
- ప్రాంతీయ పార్టీలదే హవా
- చక్రం తిప్పనున్న టీఆర్‌ఎస్, ఎస్పీ-బీఎస్పీ, తృణమూల్, డీఎంకే, వైసీపీ



న్యూఢిల్లీ, జనవరి 24: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయేకు గడ్డుకాలం తప్పదని రిపబ్లిక్ టీవీ – సీ ఓటర్ సర్వేలో తేలింది. 2014 ఎన్నికల్లో సొంతంగా 282 స్థానాలు, ఎన్డీయే కూటమిగా 336 స్థానాల్లో గెలిచి అధికార పగ్గాలు స్వీకరించిన బీజేపీకి ఈ దఫా కష్టాలు తప్పకపోవచ్చన్నది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే 233 స్థానాలు గెలుచుకుంటుందని సర్వే పేర్కొన్నది. ఎన్డీయే, యూపీఏ కూటముల్లో ఎవరికీ పూర్తిస్థాయి మెజార్టీ రాదని, బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరిస్తుందన్నది. జనవరిలో జరిపిన సర్వే ఫలితాలను గురువారం విడుదల చేసిన రిపబ్లిక్- సీ ఓటర్ సర్వే ఎన్డీయేకు 37.6% ఓట్లు, యూపీఏకు 32.2%, ఇతరులకు 30.2% ఓట్లు రానున్నట్లు తెలిపింది. ఎన్డీయే, యూపీఏ మధ్య ఓట్ల తేడా కేవలం 5.4 శాతమే కావడం గమనార్హం. లోక్‌సభలోని మొత్తం 543 స్థానాలకు ఎన్డీయే కూటమికి 233, యూపీఏకి 167చోట్ల, ప్రాంతీయ పార్టీల అభ్యర్థులు 143 చోట్ల గెలుస్తారన్నది. లోక్‌సభలో సాధారణ మెజార్టీ 272 సీట్లు కాగా, ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్డీయేకి మరో 39 మంది సభ్యుల మద్దతు కావాలి. ఈ నేపథ్యంలో టీఆర్‌ఎస్, తృణమూల్, డీఎంకే, వైసీపీ వంటి ప్రాంతీయ పార్టీలు చక్రం తిప్పనున్నట్లు పేర్కొంది.

సర్వే ఫలితాలు ఇవి..

బీహార్‌లోని 40 స్థానాలకు బీజేపీ-జేడీయూ-ఎల్జేపీ కూటమి 35 చోట్ల, యూపీఏ 5 స్థానాల్లో గెలువనున్నాయి. మధ్యప్రదేశ్‌లో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన బీజేపీ గణనీయంగా పుంజుకోనున్నది. మధ్యప్రదేశ్‌లోని 29 స్థానాలకు ఎన్డీయే -23, యూపీఏ-6 స్థానాల్లో గెలువనున్నాయి. గుజరాత్‌లో బీజేపీ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవచ్చు. రాష్ట్రంలోని 26 స్థానాలకు బీజేపీ-24, కాంగ్రెస్-2 చోట్ల గెలువనున్నాయి. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయినా మొత్తం 25 స్థానాలుండగా.. బీజేపీ-18, కాంగ్రెస్-7 స్థానాల్లో విజయం సాధించనున్నాయి. ఢిల్లీలో బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని సర్వే తెలిపింది. ఢిల్లీలోని ఏడు స్థానాల్లో మొత్తం ఏడింటిని బీజేపీ కైవసం చేసుకోనున్నది. హర్యానాలో ఎన్డీయే-7, యూపీఏ-3 చోట్ల గెలువనున్నాయి. ఒడిశాలో అధికార బీజేడీకి భంగపాటు తప్పదని సర్వే తెలిపింది. రాష్ట్రంలోని మొత్తం 21 స్థానాలకు బీజేపీ-12, బీజేడీ-9 చోట్ల విజయం సాధిస్తాయని తెలిపింది. కర్ణాటకలో ఎన్డీయే, యూపీఏల మధ్య హోరాహోరీ పోరు నెలకొంటుందని తేలింది. రాష్ట్రంలోని మొత్తం 28 స్థానాలకు యూపీఏ-14, ఎన్డీయే-14 స్థానాల్లో విజయం సాధించనున్నాయి. తమిళనాడులో కాంగ్రెస్-డీఎంకే కూటమి మొత్తం 39 స్థానాలను గంపగుత్తగా కైవసం చేసుకోనున్నది. డీఎంకే 30 స్థానాల్లో, కాంగ్రెస్ 9 చోట్ల గెలువనున్నాయి. మహారాష్ట్రలో మొత్తం 48 సీట్లకు యూపీఏ-28, ఎన్డీయే-16, శివసేన-2 చోట్ల గెలుపొందనున్నాయి. కేరళలో అధికార ఎల్డీఎఫ్‌కు ఎదురు దెబ్బ తగులనున్నది. మొత్తం 20 స్థానాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్16 స్థానాల్లో, ఎల్డీఎఫ్ నాలుగు చోట్ల గెలువనున్నాయి. పంజాబ్‌లోని 13 స్థానాల్లో యూపీఏ-12, ఎన్డీయే ఒక చోట విజయం సాధించనున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో యూపీఏ-6, ఎన్డీఏ-5 స్థానాల్లో గెలువనున్నాయి. అసోంలో యూపీఏ-7, ఎన్డీయే-6, ఏఐయూడీఎఫ్ ఒక స్థానంలో గెలుస్తాయని తేలింది. జార్ఖండ్‌లో యూపీఏ-8, ఎన్డీయే-5, జేవీఎం ఒక చోట గెలుపొందనున్నాయి.

తగ్గిన మోదీ హవా

ప్రధాని మోదీ హవా క్రమంగా మసకబారుతున్నట్లు సర్వే తెలిపింది. మిత్రపక్షాలు ఒక్కొక్కటి దూరమవడం ఎన్డీయేకు ఇబ్బందికరం కాగా, మిత్రపక్షం శివసేనతో విభేదాలు ఉన్నాయి. విద్య, ఉద్యోగాల్లో ఈబీసీలకు 10% రిజర్వేషన్లు కల్పించడం వచ్చే ఎన్నికల్లో తమకు కలిసి వస్తుందని బీజేపీ భావిస్తున్నది. మరోవైపు రామ మందిర నిర్మాణానికి ఆర్డినెన్స్ కోసం ఆరెస్సెస్, వీహెచ్‌పీ కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయి.

యూపీ, బెంగాల్‌లో..

కీలక రాష్ట్రమైన ఉత్తర్‌ప్రదేశ్‌లో మహా ఘట్‌బంధన్ పేరుతో ఎస్పీ-బీఎస్పీ-ఆర్‌ఎల్డీ పొత్తు కుదుర్చుకోవడం కమలనాథులకు అశనిపాతంగా మారింది. గతంలో యూపీలోని మొత్తం 80 స్థానాల్లో ఎన్డీఏ ఏకంగా 73 చోట్ల ఘన విజయం సాధించింది. ప్రస్తుత సర్వే ప్రకారం మహా ఘట్‌బంధన్ ఏకంగా 51 స్థానాల్లో జయకేతనం ఎగురవేస్తుందని సర్వే తెలిపింది. బీజేపీ 25 స్థానాల్లో, యూపీఏ నాలుగు చోట్ల గెలుస్తుందని పేర్కొన్నది. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, ముఖ్యమంత్రి మమతాబెనర్జీ కీలకంగా మారనున్నారు. రాష్ట్రంలోని మొత్తం 42 స్థానాల్లో తృణమూల్ 34 సీట్లను గెలుచుకుంటుందని, బీజేపీ 7 చోట్ల విజయం సాధిస్తుందని సర్వే తెలిపింది. యూపీఏ ఒక స్థానంలో గెలుస్తుందని వెల్లడించింది.

ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ హవా

బీహార్, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా, ఒడిశా రాష్ట్రాల్లో కమలనాథులు గణనీయమైన సీట్లు సాధించే అవకాశం ఉందని సర్వే తెలిపింది. కర్ణాటకలో కాంగ్రెస్‌తో హోరాహోరీ పోరు నెలకొన్నది. ఇక్కడ రెండు పార్టీలకు చెరి సమానంగా సీట్లు రానున్నట్లు తేలింది. ఇక మహారాష్ట్రలో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగలనున్నది. ఇక్కడ కాంగ్రెస్-ఎన్సీపీ కూటమి అత్యధిక స్థానాల్లో విజయం సాధించనున్నట్లు సర్వే వెల్లడించింది. బీజేపీ, శివసేనల మిత్రబేధం కూటమికి కలిసి రానున్నది.

అమరవీరుడు, లాన్స్‌నాయక్ నజీర్‌కు
అశోకచక్ర

- ఎంపిక చేసిన కేంద్రప్రభుత్వం
- కశ్మీర్ వాసికి ఈ పురస్కారం తొలిసారి
- మిలిటెంట్ నుంచి సైనికుడిగా మారి పలు ఆపరేషన్లలో విజయం సాధించిన నజీర్
- రిపబ్లిక్‌డే సందర్భంగా రాష్ట్రపతి పురస్కార ప్రదానం



న్యూఢిల్లీ: శాంతి కాలంలో ఇచ్చే అత్యున్నత సైనిక పురస్కారం 'అశోకచక్ర'కు కశ్మీర్ అమరవీరుడు లాన్స్‌నాయక్ నజీర్ అహ్మద్ వని (38) ఎంపికయ్యారు. కశ్మీర్‌కు చెందిన ఓ సైనికుడిని ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం వరించడం ఇదే తొలిసారి. గతేడాది నవంబర్‌లో కశ్మీర్‌లోని షోపియా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నజీర్ మరణించారు. ధైర్యంగా ఉగ్రవాదులను నిలువరించేందుకు అమరుడైన ఆయనను 'అశోక చక్ర'కుకేంద్రం గురువారం ఎంపికచేసింది. దీనిపై కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాకు చెందిన నజీర్ కుటుంబం హర్షం వ్యక్తం చేసింది. 'ప్రతికూల పరిస్థితుల్లోనూ లక్ష్య చేధనలో లాన్స్‌నాయక్ దిట్ట. ఉగ్రవాదుల ఏరివేతలో ఆయన తెగువ నిరుపమానం. దేశం కోసం లక్ష్యం సాధించిన వ్యక్తి నజీర్' అని రాష్ట్రపతి భవన్ పేర్కొంది. గణతంత్ర దినోత్సవం నాడు (ఈ నెల 26న) రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ పురస్కారాన్ని నజీర్ భార్య మహజబీన్‌కు అందజేస్తారు. నజీర్‌కు అతార్, షాహిద్ అనే కుమారులు ఉన్నారు.

ఆయనంటే చావుకే భయం: లాన్స్‌నాయక్ నజీర్‌కు భయమే తెలియదు. ఎదురుగా తూటాల వర్షం కురుస్తున్న ప్రత్యర్థుల అంతం లక్ష్యంగా దూసుకెళ్లేవాడు. మొదట ఉగ్రవాదిగా ఉన్న ఆయన తర్వాత పోలీసులకు లొంగిపోయాడు. 2004లో సైన్యంలో చేరాక 17 ఉగ్రవాద ఏరివేత ఆపరేషన్లలో పాల్గొన్నాడు. ఆయన తెగువ, ధైర్యసాహసాలకు గుర్తింపుగా ప్రభుత్వం రెండు సార్లు సేనా మెడల్స్‌తో సత్కరించింది. గతేడాది నవంబర్ 25న జమ్ముకశ్మీర్‌లోని షోపియా జిల్లాలో ఆరుగురు ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్‌లో ఓ ఇంట్లో నుంచి కాల్పులు జరుపుతున్న ఉగ్రవాదిని గుర్తించిన నజీర్.. ఏకంగా అతడికి ఎదురుగా వెళ్లి కాల్పులు జరిపాడు. ఈ సందర్భంగా ఉగ్రవాది తూటాలు నజీర్ శరీరంలోకి దూసుకెళ్లాయి. అయినా వెనుకడుగు వేయని ఆయన అలాగే ముందుకు దూసుకెళ్లి ఆ ఉగ్రవాదిని హతమార్చాడు. ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. కానీ, తీవ్రగాయాలతో నజీర్ అమరుడయ్యాడు.

ఇస్రోకు మరో ఘన విజయం

- విజయవంతంగా కక్ష్యలోకి మైక్రోశాట్-ఆర్
- మరోమారు శాస్త్రవేత్తల నమ్మకాన్ని నిలబెట్టిన పీఎస్‌ఎల్వీ సీ 44
- సైనిక అవసరాల కోసం పని చేయనున్న మైక్రోశాట్
- గగనతలం నుంచి హైరిజల్యూషన్ ఫొటోలు
- పీఎస్‌ఎల్వీ నాలుగోదశలో కలాంశాట్ ప్రయోగం
- ప్రపంచంలోనే అత్యంత తేలికైన ఉపగ్రహంగా కలాంశాట్ రికార్డు


నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్తున్న పీఎస్‌ఎల్వీ సీ 44 రాకెట్

శ్రీహరికోట, జనవరి 24: అంతరిక్షరంగంలో వరుసగా ఘన విజయాలు సాధిస్తున్న ఇస్రో కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. సైనిక అవసరాల కోసం తయారుచేసిన మైక్రోశాట్-ఆర్ ఉపగ్రహాన్ని 'పీఎస్‌ఎల్వీ సీ 44' రాకెట్ విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. దీంతోపాటు చెన్నై విద్యార్థులు రూపొందించిన ప్రపంచంలోనే అత్యంత తేలికైన ఉపగ్రహం కలాంశాట్‌ను కూడా తన వెంట తీసుకెళ్లింది. 28 గంటల కౌంట్‌డౌన్ అనంతరం గురువారం రాత్రి 11.37కు శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ అంతరిక్ష కేంద్రంలో ఉన్న మొదటి ల్యాంచ్‌పాడ్ నుంచి పీఎస్‌ఎల్వీ సీ 44 నిప్పులు చిమ్ముతూ గగనతలంలోకి దూసుకెళ్లింది. ప్రశాంతమైన వాతావరణం, గగనతలంలో మిణుకుమిణుకుమంటున్న నక్షత్రాల సాక్షిగా ఇస్రో నమ్మినబంటైన పీఎస్‌ఎల్వీ మరోమారు తనపై శాస్త్రవేత్తలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తూ.. రెండు ఉపగ్రహాలను నిర్దేశిత లక్ష్యాలను చేర్చింది. ఈ కొత్త ఏడాదిలో ఇస్రో చేపట్టిన తొలి ప్రయోగం ఇది. పీఎస్‌ఎల్వీకి ఇది 46వ ప్రయోగం.

ఇమేజింగ్ శాటిలైట్

పీఎస్‌ఎల్వీ మోసుకెళ్లిన మైక్రోశాట్-ఆర్ బరువు 740 కిలోలు. ఇది ఇమేజింగ్ శాటిలైట్. దీంట్లో ఉండే శక్తిమంతమైన కెమెరాలతో ఫొటోలు తీస్తుంది. సైనిక అవసరాల కోసం దీనిని రూపొందించారు. గగనతలంలోకి ప్రవేశించిన 13 నిమిషాల 30 సెకన్ల అనంతరం 274 కి.మీ. దూరంలో ఉన్న పోలార్ సన్ సింక్రనస్ కక్ష్యలోకి మైక్రోశాట్-ఆర్‌ను పీఎస్‌ఎల్వీ సురక్షితంగా చేర్చింది. అనంతరం రాకెట్ నాలుగోదశ.. కలాంశాట్-వీ2ను మరింతపైకి తీసుకెళ్లింది. దీని నిర్దేశిత కక్ష్య భూమికి 450 కి.మీ.ల ఎత్తులో ఉంది. ఇక్కడికి చేరటానికి 90 నిమిషాలు పడుతుంది. అయితే, కడపటి సమాచారం అందిన వరకూ రాకెట్ నాలుగోదశ కలాంశాట్‌ను ఇంకా నిర్దేశిత కక్ష్యవైపు తీసుకెళ్తున్నది. కేవలం 10 సెంటీమీటర్ల సైజులో 1.2 కిలోల బరువు మాత్రమే ఉండే కలాంశాట్-వీ2ను చెన్నైలోని స్పేస్‌కిడ్జ్ ఇండియా అనే ప్రైవేటుసంస్థకు చెందిన విద్యార్థులు తయారుచేశారు. దీనికి అయిన వ్యయం రూ.12 లక్షలు. ఆరు రోజుల్లో దీనిని రూపొందించారు. ఇప్పటివరకూ ప్రపంచంలో తయారుచేసిన ఉపగ్రహాల్లోకెల్లా ఇదే అత్యంత తేలికైనది. అత్యంత తేలికైన నానోశాటిలైట్‌లను కమ్యూనికేషన్స్‌లో ఎలా వినియోగించుకోవచ్చన్న దానిపై పరిశోధనలు నిర్వహించటానికి దీనిని ప్రయోగించారు. ఈ తరహా బుల్లి శాటిలైట్లు విపత్తు సమయాల్లో నిర్వహించే సహాయక చర్యల్లో ఉపయోగపడనున్నాయి. దీనిని అంతరిక్షంలోకి తీసుకెళ్లటానికి ఇస్రో ఒక్క రూపాయి కూడా తీసుకోకపోవటం విశేషం. 2017లో 64 గ్రాముల బరువున్న కలాంశాట్ తొలి వర్షన్‌ను రూపొందించారు. దీనికి గులాబ్‌జామూన్ అనే ముద్దుపేరు కూడా పెట్టారు. దీనిని నాసా ప్రయోగించింది. కానీ, అది నిర్దేశిత కక్ష్యను చేరలేదు.

కొత్త ప్రయోగాలు

ఇస్రో ఈసారి ఒక కొత్త ప్రయోగం చేసింది. సాధారణంగా ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళ్లే రాకెట్ చివరిదశ రోదసిలోనే ఉండి అక్కడ వ్యర్థపదార్థంగా మారిపోతుంది. కానీ, ఈసారి ఆ చివరిదశ రాకెట్‌ను కూడా ఉపయోగించుకునే వినూత్న టెక్నాలజీని ఇస్రో అభివృద్ధి చేసింది. నాలుగోదశ రాకెట్ ఉన్నత కక్ష్యలోకి వెళ్లి.. అక్కడ ఆర్బిటల్ ప్లాట్‌ఫాం (వేదిక)లాగా ఉపయోగపడనుంది. తదనంతరకాలంలో ఇస్రో చేపట్టే ప్రయోగాలకు ఇది పనికొస్తుంది. అంతేకాదు, పీఎస్‌ఎల్వీ ప్రయోగానికి ఇస్రో ఈసారి కేవలం రెండు బూస్టర్లను మాత్రమే ఉపయోగించింది. తమ నమ్మినబంటు పీఎస్‌ఎల్వీ మరోమారు తమకు ఘనవిజయాన్ని అందించటంతో సతీశ్‌ధావన్ స్పేస్ సెంటర్‌లో ఉత్కంఠగా ప్రయోగాన్ని వీక్షించిన శాస్త్రవేత్తలు ఆనందంలో మునిగిపోయారు. పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇస్రో మాజీ అధిపతులు కస్తూరిరంగన్, కిరణ్‌కుమార్ కూడా ప్రయోగాన్ని దగ్గరుండి వీక్షించారు.


యూపీలో వచ్చేది
కాంగ్రెస్ సర్కారే!

- ప్రియాంక, జ్యోతిరాదిత్యకు నిర్దేశించిన లక్ష్యం అదే!
- అమేథీ పర్యటనలో రాహుల్ వ్యాఖ్యలు
- ప్రధాని మోదీ నిలువెత్తు విద్వేషానికి ప్రతీక అంటూ విమర్శలు



అమేథీ: ఉత్తర్‌ప్రదేశ్‌లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంతోనే తన సోదరి ప్రియాంక గాంధీకి బాధ్యతలు అప్పగించినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో పార్టీ సంపూ ర్ణ బలంతో బరిలోకి దిగుతుందన్నారు. 2 రోజుల పర్యటనలో భాగంగా రాహుల్ తన నియోజకవర్గం అమేథీలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గురువారం అమేథీలోని ఓ అతిథిగృహం వద్ద కార్యకర్తల సమావేశంలో, సలోన్ ప్రాంతంలో జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. 'యూపీ తూర్పు, పశ్చిమ ప్రాంతాల ఇంచార్జులుగా ప్రియాంక, జ్యోతిరాదిత్య సింధియాలకు ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించాం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాం గ్రెస్ ప్రభుత్వ ఏర్పాటే వారి ముందున్న సవాల్' అని చెప్పారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ అని ప్రధాని మోదీ మాట్లాడినట్లు 'బీజేపీ ముక్త్ భారత్' అని అభ్యంతరకర పదజాలం తాను వాడనన్నారు. 'మోదీ అం టే ద్వేషానికి ఆయన నిలువెత్తు ప్రతీక' అని విమర్శించారు. 'గలీ గలీ మే షోర్ హై.. చౌకీదార్ చోర్ హై' నినాదాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. ఈ సంద ర్భంగా రాహుల్ ఓ శివాలయంలో పూజలు చేశారు.


ఎస్సీ, ఎస్టీ చట్ట సవరణలపై
స్టే విధించేందుకు 'సుప్రీం' నిరాకరణ



న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీపై అకృత్యాలకు పాల్పడిన నిందితులకు ముందస్తు బెయిలు ఇవ్వరాదన్న నిబంధనను పునరుద్ధరిస్తూ సంబంధిత చట్టానికి (ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టానికి) చేసిన సవరణలపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంలో గతేడాది మార్చి 20న సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌తోపాటు ఎస్సీ, ఎస్టీ చట్టానికి చేసిన కొత్త సవరణలను సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్లను కలిపి విచారణ జరుపుతామని జస్టిస్ ఏకే సిక్రీ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం స్పష్టం చేసింది. ఈ పిటిషన్లపై విచారణ కోసం జస్టిస్ యూయూ లలిత్‌తో కూడిన ధర్మాసనాన్ని మళ్లీ ఏర్పాటు చేయాలని చీఫ్‌జస్టిస్ రంజన్ గొగోయ్‌కి నివేదించింది. ప్రభుత్వ ఉద్యోగులపై కక్ష సాధింపునకు ఎస్సీ, ఎస్టీల చట్టాన్ని తీవ్రస్థాయిలో దుర్వినియోగం చేయడాన్ని గమనంలోకి తీసుకుని గతేడాది మార్చిలో తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో జస్టిస్ లలిత్ భాగస్వామిగా ఉన్నారు. ఈ చట్టం కింద దాఖలైన ఏ కేసులోనూ తక్షణ అరెస్టులు జరుపరాదని ఆ ధర్మాసనం పేర్కొన్నది. ఎస్సీ, ఎస్టీల చట్టానికి పార్లమెంట్ ఆమోదించిన కొత్త సవరణలపై స్టే విధించలేమని గతంలో స్పష్టం చేసిన సుప్రీంకోర్టు.. ఈ చట్టంలోని నిబంధనలను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై వివరణ ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

రాహుల్ ఒంటరిగా
రాజకీయాలు నిర్వహించలేరు


- అందుకే ప్రియాంక సాయం తీసుకున్నారు
- లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జనవరి 24: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఒక్కరే ఒంటరిగా రాజకీయాల్ని నిర్వహించలేరనే విషయం ప్రియాంక నియామకంతో తేటతెల్లమైందని లోక్‌సభ స్పీకర్ సుమిత్రామహాజన్ అన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ప్రత్యక్ష రాజకీయాల్లో వస్తున్న ప్రియాంకకు ఆమె స్వాగతం పలికారు. గురువారం స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఒంటరిగా రాజకీయాల్ని నిర్వహించలేమనే విషయాన్ని రాహుల్ అంగీకరించారు. అందుకే తన సోదరి ప్రియాంక సాయాన్ని ఆయన తీసుకున్నారు. ఇది ఒక మంచి పరిణామం' అని అన్నారు.

మోదీపై పోటీచేయండి

ప్రియాంకకు వారణాసి నేతల ఆహ్వానం



వారణాసి: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి స్థానం నుంచి ప్రధాని నరేంద్రమోదీకి పోటీగా బరిలో దిగాలని కాంగ్రెస్ యువనేత ప్రియాంకగాంధీని స్థానిక నేతలు ఆహ్వానించారు. ఆమెను పార్టీ అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారణాసి నుంచి ప్రియాంక పోటీ చేయాలని నగరమంతా గురువారం పోస్టర్లు వెలిశాయి. గత ఎన్నికల్లో వారణాసి నుంచి కాంగ్రెస్ తరుపున బరిలోకి దిగిన అజయ్‌రాయ్ నేతృత్వంలో ఈ పోస్టర్లు అంటించారు. మరోవైపు వారణాసిలో ప్రియాంక పోటీ చేయాలని యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా అజయ్ రాయ్ మాట్లాడుతూ.. 'వారణాసి నుంచి ప్రియాంక విజయానికి కాంగ్రెస్ సైనికులు సిద్ధంగా ఉన్నారు. ఆమె ఇక్కడి నుంచి బరిలోకి దిగితే దేశవ్యాప్త ప్రభావం ఉంటుంది. కాశీలో ప్రధాని మోదీ ప్రాభవం ఇప్పుడు కొడిగట్టింది. మోదీ-అమిత్‌షా ద్వయం ప్రజా వ్యతిరేక విధానాలతో చిరు వ్యాపారులు, బడుగులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. ప్రధానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదు' అని పేర్కొన్నారు.

9వ జాతీయ ఓటర్ల దినోత్సవం 2019



శ్రీ సునీల్ అరోరా
భారత ఎన్నికల అధికారి

సందేశం

9వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా, దేశంలోని పౌరులందరినీ, 18 సం॥లు నిండి ఓటర్లుగా నమోదు చేసుకోబోతున్న వారందరికీ నా శుభాకాంక్షలు. యుక్త వయస్సు రాగానే ఓటు హక్కును మన పవిత్ర రాజ్యాంగ కర్తలు, అర్హులైన భారతీయ పౌరులందరికీ కల్పించారు. భారత ఎన్నికల సంఘంగా మేము దానిని మీకందించడానికి ఎంతో కృషి చేస్తున్నాం.

యావత్ దేశమంతటా 17వ లోక్‌సభ ఎన్నికలకు, ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ ఎన్నికలకు సిద్ధమవుతోంది. మేము కూడా దేశంలోని 87 కోట్లపైగా ఓటర్లకు, 10 లక్షల పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

జాతీయ ఎన్నికల్లో మొదటి సారిగా మిల్లెనియల్స్ మా అంబాసిడర్స్‌గా పాలుపంచుకుంటున్నారు. దీనికి వారి కుటుంబసభ్యులు సైతం సహకరిస్తారని ఆశిస్తాము. ఈ ఎన్నికల్లోనే కాక, రాబోయే అన్ని ఎన్నికల్లోనూ పాలు పంచుకుంటారని భావిస్తున్నాము.

ఎక్కువ మంది ఓటింగ్‌లో పాలు పంచుకుంటే, అదే ధృఢమైన ప్రజాస్వామ్యానికి పునాది. మేం, భారతీయ కమీషన్‌లో **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అన్న ప్రధాన లక్ష్యంతో కృషి చేస్తున్నాం.

మాకు ఈ రోజు ఎంతో కీలకమైన రోజు. 25 జనవరి, 1950న భారత ఎన్నికల సంఘం స్థాపించబడిన రోజు. ఈనాడే పటిష్ట భారత ప్రజా స్వామ్య వ్యవస్థ సుస్థాపితమైన రోజు. దేశంలో అద్భుత ప్రజాస్వామ్య వారసత్వాన్ని చాటిచెబుతూ, ఎటువంటి భయభ్రాంతులు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నాటి నుండి విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

మా లక్ష్యం - ప్రతి ఎన్నికలను ప్రతి ఒక్కరికీ మరింత చేరువ చేయడమే, ఓటరుతో స్నేహపూర్వకంగా, పారదర్శకంగా మెలగడమే. ఈ దిశగా మేము ఎన్నో చర్యలు చేపట్టాం. ఎన్నికల ఆఫీసును చేరువ చేసి, సకల సమాచారం, సహకారం కోసం - ఓటర్ హెల్ప్‌లైన్ నెం: 1950 అందించాం. ఇదే నెంబర్‌పై ఎస్ఎమ్ఎస్ సేవలు ఫోన్ ద్వారా పంపిస్తున్నాం. ఆన్‌లైన్ ఓటర్ సేవలను ఫోన్ ద్వారా అందిస్తున్నాం.

భారత ఎన్నికల సంఘం తరఫున, నేను దేశంలోని ఓటరులందరినీ తమ పవిత్రమైన ఓటుహక్కు వినియోగించుకోవలసిందిగా మనవి చేస్తున్నాను. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి భయం, ఆందోళన, లంచాలకు లొంగక భారత ప్రజాస్వామ్యాన్ని గెలిపించవలసిందిగా కోరుతున్నాను. ఇది 5 సంవత్సరాలకు ఒకసారి వచ్చే అద్భుత అవకాశం మీరు కోరుకున్న వారు మీ తరఫున లోక్‌సభలో నిలుస్తారు. అందుకే నేడే ఓటర్‌గా నమోదు చేసుకోండి.

మరొక్కసారి, జాతీయ ఓటర్ల దినోత్సవం 2019 తరఫున దేశంలోని ప్రజలందరికీ మన స్ఫూర్తిగా నా శుభాభినందనలు అందజేస్తున్నాను.

జై హింద్

"ఎలక్షన్ కమీషన్ 25 జనవరి తన సంస్థాపన దినోత్సవంగా **'జాతీయ ఓటర్ల దినోత్సవం'** గా జరుపుకుంటోంది, 2011 జనవరి 25 నుంచి ప్రతీ సంవత్సరం ఇలా జరుపుకోంటోంది. ఏ ఓటరు తన హక్కును కోల్పోకూడదు అనే లక్ష్యంతో ఈ రోజు 9వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించబడుతోంది. చట్టం ప్రకారం ప్రతీ ఒక్కరికి ఈ హక్కును కల్పించుటలో పూర్తిగా వాస్తవరూపంలోకి తీసుకువచ్చుటకు మరియు భారత ప్రజాస్వామ్య నాణ్యతను పెంపొందించుటకు ఈ సందర్భాన్ని ఉపయోగిస్తూ ఓటర్ల నమోదు ప్రక్రియను పెంపొందించు లక్ష్యంతో కమీషనర్ ఉన్నారు. తెలంగాణలో పోలింగ్ స్టేషన్ల ప్రదేశాలన్నింటి వద్ద కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద నూతనంగా నమోదైన ఓటర్లు నూతన పివిసి కలర్ కార్డుతో పాటు లోగో మరియు **"Proud to be a voter – Ready to Vote"** నినాదం కలిగి ఉంటారు."

తెలంగాణ వ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

తెలంగాణ సుస్థిర మరియు క్రియాశీల ప్రభుత్వం కలిగిన వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం, ఇది 2018 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా మార్గదర్శకంగా నిలిచింది, ఒక్క సంఘటన కూడా లేకుండా ఎంతో ప్రశాతంగా నిర్వహించబడినవి. ఈ పరపతి అంతా ఎలక్షన్ కమిషన్‌కు దక్కుతుంది, వారు ఎలక్షన్లను సవ్యంగా, సజావుగా నిర్వహించుటకు అవిశ్రాంతంగా పని చేశారు. గతంలోని ఓటర్ శాతం 69.5 శాతంతో పోల్చితే ఇప్పుడు 73.4 శాతమునుకు పెరిగింది. ఎలక్షన్ కమిషన్ ప్రయత్నాలతో ఇది ఎంతో గొప్ప అభివృద్ధి, విజయంగా పేర్కొనవచ్చును.
ఇప్పుడు జాతీయ ఓటర్ల దినోత్సవం ఎంతో సంతోషంగా జరుపుకునే వేడుక **NVD**. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో వివిధ రకాల కార్యకలాపాలతో మరియు ఎంతో ఆసక్తి కలిగించే అంశాలతో నిర్వహించబడుతోంది. క్విజ్, వ్యాసరచన, మాక్ పార్లమెంట్, మహిళలకు రంగోలి పోటీలు, హై స్కూల్స్ సీనియర్ స్థాయిలో పోటీలు నిర్వహించబడతాయి. వీటిని అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద నిర్వహిస్తారు. మరియు విజేతలకు బహుమతులు మరియు సర్టిఫికేట్లు పంపిణీ ఉంటుంది. జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున తెలంగాణలో అన్ని విద్యాసంస్థలు/ప్రభుత్వ కార్యాలయాలలో **NVD** ప్రతిజ్ఞ చేయబడుతుంది. పోలింగ్ స్టేషన్, శాసన సభ నియోజకవర్గం, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో **NVD** కార్యక్రమాలకు హాజరయ్యే పౌరులందరూ కూడా ప్రతిజ్ఞ చేయవలసి ఉంటుంది.

జాతీయ ఓటర్ల దినోత్సవం
25 జనవరి
2019

భారతదేశ పౌరులమయిన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మనదేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామనీ, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు చేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము.



డా॥ రజత్ కుమార్ ఐ.ఎ.ఎస్
ప్రధాన ఎన్నికల అధికారి, తెలంగాణ

సందేశం

భారత ఎన్నికల సంఘం 25 జనవరిని తన సంస్థాగత దినోత్సవం రోజును 2011 నుండి ప్రతి ఏడాది జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం మీకందరికీ తెలుసు. ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశ్యం - ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, అర్హులైనవారందరినీ ఓటర్లుగా నమోదు చేయడం తద్వారా భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం. ఈ రోజు మనం 9వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అన్న ముఖ్యాంశంతో జరుపుకుంటున్నాం.

తెలంగాణ మొట్టమొదటి సాధారణ ఎన్నికలు డిసెంబర్ 2018లో ఎంతో ప్రశాంతంగా చక్కగా జరిగాయని తెలియజేస్తున్నాను. తెలంగాణ ఓటరు మహాశయులందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు సమర్పిస్తున్నాను. పోలింగ్ శాతం రాష్ట్రంలో చారిత్రాత్మకంగా 73.40% ముసు పెన్నడూ లేని విధంగా నమోదు అయ్యింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు గానీ, ఉద్రిక్తపరిస్థితులు, ఆందోళనలు, తలెత్తలేదు. రీపోలింగ్ జరగలేదు. వికలాంగులైన వారికి సైతం - కల్పించిన ప్రత్యేక వసతుల వలన పోలింగ్‌లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. వారి పోలింగ్ శాతం 70% వరకూ నమోదైంది.

లోక్‌సభకు ఎన్నికలు అతి తొందరలోనే రాబోతున్నాయి. దీనిలో మీ ఓటు హక్కును మీరు వినియోగించాలంటే ముందుగా మీ పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలి. ఓటర్ లిస్ట్‌లో పేరు లేకపోతే ఓటును వేయలేరు. ఓటర్ల జాబితాల సవరణ 1-1-2019 నుండి ప్రారంభమై, ఫిబ్రవరి 4వ తేదీ వరకు కొనసాగుతాయి. మీ దరఖాస్తులు సమర్పించడానికి ఇదే ఆఖరు తేదీ. తుది జాబితా 26.02.2019 న ప్రకటించబడుతుంది. 31 డిసెంబర్ 2018 నాటికి 18 సంవత్సరాలు నిండిన పౌరులందరూ ఓటు హక్కును పొందడానికి అర్హులు.

కనుక అర్హులైన పౌరులందరూ వెంటనే తమపేరు నమోదు చేసుకొని, రానున్న జాతీయ సార్వత్రిక ఎన్నికల్లో తమ విలువైన ఓటు హక్కును ఎటువంటి భయం, భీతి లేకుండా, కులం, మతం, ప్రాంతం, భాష లేదా లంచాలకు లొంగకుండా నిజాయితీగా వినియోగించుకోవలసిందిగా కోరుతున్నాను.

నేను మరొక్కసారి చేసే విన్నపమల్లా **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అనే భావన ఎన్నికల సంఘం వారి మహదాశయాన్ని నిజం చేసేందుకు మనందరం నిరంతరం కృషి చేద్దాం... ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందేలా, వినియోంచుకునేలా చూద్దాం!!



జాతీయ ఓటర్ల దినోత్సవం
25 జనవరి 2019

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కండి

#గో వెరిఫై
(పరిశీలించుకోండి)

మీ పేరు, వివరాలు తాజా ఓటర్ల జాబితాలో ఉన్నాయో, లేవో తెలుసుకోండి.
ఓటరు హెల్ప్‌లైన్ 1950కి కాల్ చేయండి లేదా "ఓటరు హెల్ప్‌లైన్" ఆండ్రాయిడ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి.
లేదా www.nvsp.in ను సందర్శించండి.

ఓటరుగా మీరు నమోదు కాకపోతే #గో రిజిస్టర్ ను నేడే www.nvsp.in లో నమోదు చేసుకోండి. లేదా "ఓటరు హెల్ప్‌లైన్" యాప్ ను వాడండి

ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి

భారత ఎన్నికల సంఘం
https://eci.gov.in

ప్రధాన ఎన్నికల అధికారి,
తెలంగాణ

Voter Helpline **1950**



2014 ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందంటూ జరుగుతున్న ప్రచారం అంతా ఓ రాజకీయ ఎత్తుగడ. కాంగ్రెస్ చేస్తున్న కుట్ర. ఒకరకంగా భారత్‌ను బద్నాం చేయటానికే ఇదంతా చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసే ఇదంతా చేస్తున్నారు..

రవిశంకర్ ప్రసాద్, కేంద్ర మంత్రి

ఈవీఎంలపై వస్తున్న అనుమానాలు, విమర్శలు తీవ్రమైనవి. ఈ నేపథ్యంలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వాటిని వినియోగించకపోవటమే మంచిది. బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహిస్తే అనేక అంచెల్లో పరీక్షించుకోవటానికి వీలున్నది. కాబట్టి ఈవీఎంలపై ఆలోచించాలి.

మాయావతి, బీఎస్పీ అధినేత్రి



చరిత్రలో నేడు



1565

తల్లి కోట యుద్ధం. దక్కనీ సుల్తానుల చేతిలో విజయనగర సేనల ఓటమి. దక్షిణ భారతంలో చివరి హిందూ రాజ్యం పతనం.

1914



సమానహక్కుల కోసం దక్షిణాఫ్రికా డర్బన్‌లో భారతీయులతో సమావేశాలు నిర్వహించిన గాంధీ.

1955



అణుశక్తి గడియారాన్ని కనుగొన్న కొలంబియా యూనివర్సిటీ. మూడు వందల ఏండ్లలో ఒక సెకన్ కూడా తేడా రాని గడియారం అది.

చైనా ప్రాబల్య దేశంగా అవతరించడాన్ని సహించలేని పాశ్చాత్య ప్రభుత్వాలు వివిధ ఆరోపణలు చేయడం వల్ల ఒరిగేదేమీ లేదు. హువావే తదితర చైనా కంపెనీలను తమ సాంకేతిక పరికరాలతో గూఢచర్యానికి పాల్పడుతున్నాయని పాశ్చాత్య దేశాలు ఆరోపిస్తున్నాయి. కానీ ఇందుకు ఆధారాలు చూపడం లేదు. ఇటువంటి పరిస్థితులే యుద్ధాలకు దారితీశాయని చరిత్ర చెబుతున్నది. ఈ ఘర్షణ మార్గాన్ని చేపడుతున్న రాజకీయ నాయకులు పరిణామాల గురించి ఆలోచించాలి.

సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ (హాంగ్ కాంగ్)

ఆస్ట్రేలియా పౌరసత్వం గల యాంగ్ హెంగ్‌జున్‌ను చైనా ప్రభుత్వం అరెస్టు చేయడం వివాదాస్పదమైంది. గూఢచార నవలల రచయిత అయిన యాంగ్ ఇటీవలే అమెరికా నుంచి చైనా వెళ్లారు. ఆయన గూఢచర్యం చేస్తున్నారని చైనా ఆరోపించింది. ఈ అంశంపై ఆస్ట్రేలియా ప్రభుత్వం ఏ విధంగా స్పందించాలనే చర్చ సాగుతున్నది. ఇటీవల చైనా టెలికం కంపెనీ అధికారి మెంగ్‌ను కెనెడా ప్రభుత్వం అరెస్టు చేసింది. ఈ వివాదంలో ఆస్ట్రేలియా చైనా వ్యతిరేక వైఖరి తీసుకోకుండా అడ్డుకోవడానికే యాంగ్‌ను అరెస్టు చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ది సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్

వెనెజులా సంక్షోభం

లాటిన్ అమెరికా దేశమైన వెనెజులా సంక్షోభం తీవ్రస్థాయికి చేరుకున్నది. దేశాధ్యక్షుడు మదురోను కూలదోయడానికి అమెరికా బహిరంగంగా ప్రయత్నిస్తున్నది. ప్రతిపక్ష నాయకుడు జువాన్ గాయిడో బుధవారం నాడు తనకు తానే దేశాధ్యక్షుడిగా ప్రకటించుకున్నాడు. తాను తాత్కాలిక అధ్యక్షుడినేనని, వెంటనే నిష్పక్షపాత ఎన్నికలు జరుపుతానని ప్రకటించినప్పటికీ, అక్కడి ప్రభుత్వాన్ని కూలదోయడానికి అమెరికా పన్నిన ఎత్తుగడలో ఇదొక భాగమని స్పష్టమవుతూనే ఉన్నది. గాయిడో అధ్యక్షుడిగా ప్రకటించుకున్న వెంటనే అమెరికా అతడికి మద్దతు తెలిపింది. సైన్యం తిరుగుబాటు చేసి కొత్త అధ్యక్షుడిగా ప్రకటించుకున్న గాయిడోకు మద్దతు ఇవ్వాలని అమెరికా పిలుపు ఇచ్చింది. కెనడా యూరప్ దేశాలు, లాటిన్ అమెరికాలోని అమెరికా అనుకూల ప్రభుత్వాలు కూడా గాయిడోకు మద్దతు ప్రకటించాయి. మరోవైపు అదే ప్రాంతంలోని క్యూబా, మెక్సికో, బొలీవియా వెనెజులా నాయకుడు మదురోకు మద్దతు ప్రకటించారు. రష్యా, టర్కీ కూడా అమెరికా చర్యలను తీవ్రంగా ఖండించాయి. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో జరిగినట్టుగా ప్రపంచమంతా రెండు శిబిరాలుగా చీలినట్టయింది. మదురో ప్రభుత్వాన్ని కూలదోయాలని పిలుపు ఇచ్చిన అమెరికా వెనెజులాపై మరిన్ని ఆంక్షలు విధిస్తూ, దేశాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టాలని ప్రయత్నిస్తున్నది. అవసరమైతే సైనిక జోక్యం కూడా చేసుకుంటామని ట్రంప్ ప్రకటించాడు. సైనిక జోక్యం చేసుకుంటే, మరింత సంక్షోభం తప్పదని రష్యా హెచ్చరించింది. మదురో ప్రభుత్వం అమెరికాతో దౌత్య సంబంధాలు తెగదెంపులు చేసుకున్నట్టు ప్రకటించింది. ఐరాస ఎప్పటి మాదిరిగానే శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలంటూ నామమాత్రపు ప్రకటనలు చేస్తున్నది.

వెనెజులా సంక్షోభంలో ఉన్న మాట నిజమే. ఆర్థిక సంక్షోభం తీవ్రమైన రాజకీయ, సామాజిక సంక్షోభానికి దారితీసింది. మహామాంద్యంలో ఉన్నప్పుడు అమెరికా, సోవియెట్ యూనియన్ కుప్పకూలినప్పుడు రష్యా కూడా ఇంతటి సంక్షోభంలో లేవు. దాదాపు ముప్పై లక్షల మంది తినడానికి తిండి లేక దేశం విడిచి వలసపోయారని అంచనా. భారీగా నిరసన ప్రదర్శనలు సాగుతున్నాయి. అయితే ప్రభుత్వ వైఫల్యం పట్ల అసంతృప్తిగా ఉన్నప్పటికీ, ప్రతిపక్షాల మీద కూడా ప్రజలకు సానుభూతి లేదు. ప్రతిపక్షాలన్ని కలిసి కూడా తగిన ప్రత్యామ్నాయాన్ని అందించలేకపోతున్నాయి.

వెనెజులా ఒకప్పుడు బాగా బతికిన దేశమే. చమురు, బంగారం ఎగుమతుల వల్ల వచ్చిన ఆదాయంతో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలుచేసింది. దేశాధ్యక్షుడు హ్యూగో చావెజ్ 2013లో మరణించడంతో ఆయన స్థానంలో మదురో అధికారం చేపట్టారు. ఈలోగా చమురు ధరలు తగ్గి ఆర్థిక ఇక్కట్లు మొదలయ్యాయి. అమెరికా కూడా వెనెజులాపై అనేక ఆంక్షలు విధించింది. దేశంలోని బహుళజాతి సంస్థలు దేశాన్ని అస్థిరపరచడంలో ప్రధాన పాత్ర పోషించాయనే ఆరోపణ కూడా ఉన్నది. ఎగుమతులు దెబ్బతినడంతో, ఆహారం, మందుల కొరత ఏర్పడ్డది. ద్రవ్యోల్బణం భారీగా పెరిగిపోయింది. కరెన్సీకి విలువ లేకుండా పోయింది. ఒకవైపు దేశంలో అశాంతిని సృష్టించిన ఈ అమెరికా మరోవైపు ప్రతిపక్షాలను రెచ్చగొట్టడం మొదలుపెట్టింది. సైన్యాన్ని కూడా రెచ్చగొట్టింది. కానీ సైన్యం పూర్తిగా మదురోకు మద్దతుగా నిలబడ్డది. 2018 ఎన్నికలను ప్రతిపక్షం బహిష్కరించింది. ఎలాగూ ఓడిపోతామని తెలిసినందువల్లనే ప్రతిపక్షం ఎన్నికలను బహిష్కరించిందనేది మదురో ఆరోపణ. కానీ అమెరికా, యూరప్ దేశాలు ఎన్నికలు సక్రమంగా జరుగలేదని, మదురో ఎన్నికకు విశ్వసనీయత లేదని అంటున్నాయి. పార్లమెంట్‌లో మాత్రం ప్రతిపక్షాల మెజార్టీ ఉన్నది. కానీ న్యాయస్థానం మదురోకు మద్దతుగా వ్యవహరిస్తూ, చట్టసభను రద్దుచేసి కొత్తగా రాజ్యాంగసభను ఏర్పాటుచేసింది. ఇందులో మదురో మద్దతుదారులే ఎక్కువగా ఉన్నారు. చట్టసభలో ప్రతిపక్షాలు మెజార్టీ సాధించినప్పుడు, ఉభయపక్షాలు కలిసి దేశాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కిస్తే బాగుండేది. కానీ బయటి దేశాల మద్దతు గల ప్రతిపక్షాలు దేశాధ్యక్షుడితో ఘర్షణకు దిగాయి. మరోవైపు ఇతరదేశాల జోక్యం వల్ల పరిస్థితి విషమించింది.

వెనెజులా సంక్షోభంలో ఉన్న మాట నిజమే. ఆర్థిక సంక్షోభం తీవ్రమైన రాజకీయ, సామాజిక సంక్షోభానికి దారితీసింది. మహామాంద్యంలో ఉన్నప్పుడు అమెరికా, సోవియెట్ యూనియన్ కుప్పకూలినప్పుడు రష్యా కూడా ఇంతటి సంక్షోభంలో లేవు. దాదాపు ముప్పై లక్షల మంది తినడానికి తిండి లేక దేశం విడిచి వలసపోయారని అంచనా. భారీగా నిరసన ప్రదర్శనలు సాగుతున్నాయి. అయితే ప్రభుత్వ వైఫల్యం పట్ల అసంతృప్తిగా ఉన్నప్పటికీ, ప్రతిపక్షాల మీద కూడా ప్రజలకు సానుభూతి లేదు. ప్రతిపక్షాలన్ని కలిసి కూడా తగిన ప్రత్యామ్నాయాన్ని అందించలేకపోతున్నాయి. ప్రచ్ఛన్నయుద్ధకాలంలో, లాటిన్ అమెరికాలో భూమి పుత్రులు, వామపక్షశక్తులు అధికారాన్ని చేజిక్కించుకోవడం, అమెరికా ఆ ప్రాంత ప్రభుత్వాలను కూలదోయడం కథకథలుగా విన్నాం. కానీ అమెరికా ఇంకా అహంకారపూరిత వైఖరిని వదులుకోలేదు. లాటిన్ అమెరికా దేశాలను అస్థిరత్వం పాలు చేసి అక్కడి ప్రజలు బతకలేక వలస పోయే దుస్థితిని అనేక రూపాల్లో సృష్టిస్తున్నది. మరోవైపు మెక్సికో సరిహద్దు దగ్గర గోడ కట్టకపోతే బతుకలేమంటూ ప్రతి పక్షాలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గొడవలు పెట్టుకుంటున్నాడు. అమెరికా తాజాగా వెనెజులా అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకొని అక్కడి ప్రభుత్వాన్ని కూలదోసే కుట్రలు పన్నుతున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే అన్ని ప్రాంతాల్లో అంతర్జాతీయ వ్యవస్థ దెబ్బ తింటుంది. అంతర్జాతీయ సమాజం చొరవ చూపి చట్టబద్ధమైన పాలనలు సాగేవిధంగా, ఏ దేశంలోనూ బయటిశక్తులు జోక్యం చేసుకోకుండా కట్టడి చేసేలా ప్రయత్నాలు సాగించాలె.

జనగళం

ఓటుహక్కు విలువ

ప్రజాస్వామ్య పరిరక్షణలో 'ఓటు హక్కు' గురించి ప్రజలను చైతన్యపరిచేందుకు ఎన్నికల కమిషన్ ఏర్పాటైన జనవరి 25ను 'జాతీయ ఓటర్ల దినోత్సవం'గా ప్రకటించింది. భారత ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నా వంతు కర్తవ్యాన్ని గుర్తించి ఉన్నతమైన నాయకున్ని ఎన్నుకుంటానని ఓటర్లతో ప్రమాణం కూడా చేయిస్తున్నది. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష, ఆర్థిక భేదభావం లేకుండా దేశంలో నివసించే 18 ఏండ్లు నిండిన ప్రతీ యువతీయువకుడు ఓటు హక్కు పొందే అవకాశం రాజ్యాంగం ఆర్టికల్ 326 కల్పిస్తున్నది. 125 కోట్ల జనాభా కలిగిన మన దేశంలో సుమారు 100 కోట్ల ఓటర్లు ఉన్నారు. అయితే కేవలం 50 కోట్ల లోపు ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటుండటం సిగ్గుచేటు.

ప్రజాస్వామ్య దేశంలో న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలకంటే శక్తివంతమైన పాత్ర పార్లమెంట్, అసెంబ్లీలది. ఉన్నత విలువలతో కూడిన ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన రాజకీయ నేతలే నేరస్తులైతే నేరమయ భారతం నిర్మితమవుతుంది. కాబట్టి తమ ఓటు ద్వారా మంచి నాయకున్ని ఎనుకోవాలని స్థానిక సంస్థలు, చట్టసభలకు ఎన్నికలు జరిగినప్పుడు ప్రజలంతా ఓటు వేయడానికి వెళ్లేలా ఆ రోజున సెలవు దినంగానూ ప్రకటిస్తున్నది. అయినా చాలామంది ఓటు వేసేందుకు ముందుకురావడం లేదు. గ్రామాల్లో కన్నా విద్యావంతులు అధికంగా ఉన్న పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండటం అందరినీ ఆశ్చర్యపోయేటట్లు చేస్తుంది.

ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్క పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోనేలా చూడాలి. ఒకవేళ ఎన్నికల్లో పోటీచేసే వ్యక్తి నచ్చకపోతే నోటా ఎలాగూ ఉన్నది. కాబట్టి కచ్చితంగా ఓటుహక్కు వినియోగించేలా ప్రతి పౌరున్ని మేల్కొనేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్, ప్రభుత్వానిదే. ఓటు హక్కు వినియోగంపై ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి. విరివిగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే ప్రజల్లో చైతన్యం అవకాశాలున్నాయి. అందరూ ఓటు హక్కు వినియోగించుకుంటేనే ప్రజాస్వామ్యం విజయం సాధించినట్టు లెక్క.

- కె.వేణుగోపాల్, మార్కాపురం

(నేడు జాతీయ ఓటరు దినోత్సవం)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

జాతీయం



ఎం.ఎస్.నిలీనా

ఫలితాలివ్వని కేంద్ర పథకాలు

నిరుద్యోగాన్ని రూపుమాపుతాననే ప్రధాన నినాదంతోనే నరేంద్ర మోదీ 2014లో అధికారం చేజిక్కించుకున్నా రు. గత నాలుగేండ్ల కాలంలో నిరుద్యోగ నిర్మూలన కోసమని మోదీ అనేక పథకాలను ప్రవేశపెట్టారు. తన పథకాలతో ఏటా రెండు కోట్ల కొత్త ఉద్యోగాలను సృష్టిస్తానని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే 2018 ఆర్థిక సంవత్సరంలోనే 70 వేల ఉద్యోగాలను ఒక వ్యవసాయరంగంలోనే కల్పించగలిగామని మోదీ గొప్పగా చెప్పుకున్నారు.

దేశంలో నిరుద్యోగమే ఈమధ్య కాలంలో ప్రధాన సమస్య అయ్యింది. నిరుద్యోగంపై కేంద్రం చెబుతున్నదానికి భిన్నంగా వాస్తవ గణాంకాలున్నాయి. అనేక అధ్యయన సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలు సైతం దేశంలో నానాటికీ నిరుద్యోగం పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఎకానమీ (సీఎంఐఈ) సంస్థ తన 2019 నివేదిక ప్రకారం.. ఒక 2018లోనే కోటి పది లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారని తెలియజేసింది. అంతేగాకుండా ఆ ఆర్థిక సంవత్సరంలో నిరుద్యోగ శాతం 7.4కు చేరుకున్నదని తెలిపింది. ఇది గత పదిహేను నెలలకన్నా గరిష్ఠంగా ఉన్నదని ఆందోళన వ్యక్తంచేసింది. దేశవ్యాప్తంగా 'లేబర్ బ్యూరో' నిర్వహించిన ఇంటింటి సర్వే ప్రకారం అయినా 2013–14 తర్వాత నిరుద్యోగం క్రమంగా పెరుగుతూనే ఉన్నదని తెలిపింది. ఇదిలా ఉంటే.. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలన్నీ స్వయం ఉపాధి కల్పన, నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగ కల్పనకు ఊతమిచ్చే పథకాల రూపకల్పనకు సంబంధించినవిగా ఉంటే ఎగుమతులు లక్ష్యంగా ఉత్పాదకతను పెంచటం లాంటివి ఉన్నాయి. ఈ లక్ష్యాలన్నీ పలురకాల పథకాల ద్వారా సాధిస్తామని మోదీ ప్రభుత్వం తెలిపింది. అందులో ముఖ్యంగా చెప్పుకోదగినవి–మేక్ ఇన్ ఇండియా, ప్రధాన్‌మంత్రి కౌషల్ వికాస్ యోజన (పీఎంకేవీవై). ఇదే స్కిల్ ఇండియాగా కూడా పిలువబడుతున్నది. ఈ కోవలోనే ప్రధాన్‌మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ), ప్రధానమంత్రి ముద్ర స్కీమ్(పీఎంఎంఎస్), ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన (పీఎంఆర్‌పీవై)లాంటి పథకాలతో దేశంలో నిరుద్యోగాన్ని పారదోలుతానని చెప్పుకొచ్చారు. కానీ నిరుద్యోగం పెరుగుతున్నదన్న గణాంకాలను కొలిచే విధానంలో ఉన్న సంప్రదాయ పద్ధతుల కారణంగానే నిరుద్యోగం ఉన్నదని చెబుతున్నారని మోదీ నమ్మబలుకుతున్నారు. ఆధునిక భారతంలో ఈ పథకాల లక్ష్యాలు ఏ మాత్రం చేరలేదనేదే అసలు సత్యం. ఈ నేపథ్యంలోనే దేశంలోని కార్మిక సంఘాలన్నీ మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా జనవరి 8,9 తేదీల్లో దేశవ్యాప్త బంద్ నిర్వహించటం గమనార్హం.

మోదీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం 2016లో పీఎంఆర్‌పీవై అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా కార్మికులకు ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్)ను 12 శాతం జమచేస్తుంది. 15 వేల కన్నా తక్కువ వేతనం ఉన్న ఉద్యోగులకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపింది. జాతీయ కార్మిక సంఘం ఏఐటీయూసీ నేత తపన్ సేన్ ప్రకారం.. 40 శాతం మంది కార్మికులు ఈ పథకాన్ని పొందకుండా దూరంగా ఉన్నారని తెలిపారు. అలాగే ఈ పథకాన్నుంచి తప్పించుకోవటం కోసం కంపెనీ యజమానులు అనుసరించే మోసపూరిత విధానాలు, ప్రభుత్వ పర్యవేక్షణ కారణంగా కార్మికులు తీవ్రంగా నష్టపోతున్న స్థితి ఉన్నది. దీనికి ఓ ఉదాహరణగా మహారాష్ట్రలోని షోలాపూర్‌లో పవర్‌లూమ్ కంపెనీలు అనుసరిస్తున్న విధానాన్ని చెప్పుకోవచ్చు. 2015లో 15 పవర్‌లూమ్ కంపెనీల కార్మికులు తమకు ప్రావిడెంట్ ఫండ్ పథకాన్ని అమలు చేయటం లేదని ప్రభుత్వానికి, లేబర్ కమిషనర్‌కు విన్నవించుకున్నారు. దీనికి ఉదాహరణగా మ్యాకల్ గ్రూప్ పవర్ లూమ్ కంపెనీ యజమానులు తమ కుటుంబసభ్యుల పేరుతో 15 చిన్న కంపెనీలు నడుపతున్నట్లు చూపారు. ప్రావిడెంట్ చట్టం ప్రకారం కంపెనీలో 20 మంది కార్మికులు, అంతకన్నా ఎక్కువమంది ఉంటే ప్రావిడెంట్ ఫండ్ వర్తిస్తుంది. కాబట్టి మ్యాకల్ కంపెనీ తన 15 కంపెనీల్లో ప్రతిదానిలో ఏడు మందికన్నా ఎక్కువమంది కార్మికులు లేరన్నట్లు ప్రభుత్వాన్ని, లేబర్ డిపార్ట్‌మెంట్‌కు లెక్కలుచూపి ప్రావిడెంట్ ఫండ్‌ను తప్పించుకున్నారు. ఈ నేపథ్యంలోనే 2017లో షోలాపూర్‌లోని పవర్‌లూమ్ కంపెనీల్లో పనిచేస్తున్న 14 వేలకు పైగా కార్మికులు తమకు ప్రావిడెండ్ ఫండ్‌ను అమలుచేయటం లేదని లేబర్ కోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం దీనిపై విచారణకు ఆదేశించి వాస్తవాల పునాదిపై కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ అమలు చేయాల్సిందేనని కంపెనీ యజమాన్యాలను ఆదేశించింది. ఇందులో మ్యాకల్ కంపెనీ కూడా ఉండటం యాదృచ్ఛికం కాదు. షోలాపూర్ ఉదంతం ఓ ఉదాహరణ మాత్రమే. దేశంలో మూలమూలన చిన్న, మధ్య తరహా కంపెనీలన్నింటిలో ఈ విధమైన తంతే నడుస్తున్నది. కంపెనీలో 20 మంది కన్నా కార్మికులు పనిచేస్తున్నా.., టెంపరరీ, క్యాజువల్ కార్మికులుగా లెక్కలుచూపి కార్మిక సంక్షేమ పథకాల అమలుకు కంపెనీ యాజమాన్యాలు తిలోదకాలిస్తున్నాయి.

స్వయం ఉపాధి పథకం కింద బ్యాంకు లోన్లతో చిన్నతరహా పరిశ్రమలు నిర్వహిస్తున్న వారిలో 80 శాతం మంది నెలకు పదివేలకన్నా తక్కువ ఆర్జిస్తున్న స్థితి ఉన్నది. ఇలాంటి పరిస్థితిలో వీరు ఉద్యోగకల్పనకు ఎలా దోహదపడుతారో ఏలికలే చెప్పాలి. చాలా సందర్భాల్లో జీవిక కోసం ఏదో పనిచేసుకంటున్నా అది జీవిత భద్రతకు ఏ విధంగానూ భరోసా ఇవ్వనిదిగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఓ సందర్భంలో మోదీ చెప్పిన కథనాన్ని చెప్పుకోవాలి. మోదీ ప్రకారం.. ఒక వ్యక్తి పకోడీలు చేసుకుంటూ రోజుకు రూ.200 సంపాదిస్తే అతనికి ఉద్యోగం, జీవనోపాధి ఉన్నాట్లా లేనట్లా అని నిరుద్యోగం గురించి మాట్లాడుతున్న వారిని నిలదీశారు. దీనిపై కాంగ్రెస్ నేత, మాజీ ఆర్థికమంత్రి చిదంబరం స్పందిస్తూ.. దేశంలో ఓ భిక్షగాడు కూడా రోజుకు 200 సంపాదిస్తాడు. అయితే అతనిది ఉద్యోగమేనా? అని మోదీని ప్రశ్నించాడు.

2022 నాటికి దేశంలో స్కిల్ ఇండియా పథకం కింద 40 కోట్ల మందికి నైపుణ్యాలు పెంచటానికి కృషిచేస్తామని 2015 జూలై 15న మోదీ ప్రకటించారు. కానీ ప్రభుత్వ లెక్కల ప్రకారమే.. 2018 నాటికి 33.93 లక్షల మందికి మాత్రమే నైపుణ్యాల పెంపుదలకు శిక్షణ ఇచ్చారు. ఇలా నైపుణ్య శిక్షణ ఇచ్చిన వారిలో కూడా పది లక్షల మందికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. మరోవైపు నైపుణ్య శిక్షణలో ఒక నిర్దిష్ట, ప్రామాణికత అంటూ ఏదీ లేదని ప్రభుత్వవర్గాలే అనటం ఆ పథక అమలు తీరుకు నిదర్శనం.

మోదీ చాలా గొప్పగా చెప్పుకున్న పథకాల్లో 'మేక్ ఇన్ ఇండియా' ఒకటి. 2014 సెప్టెంబర్ ఈ పథకాన్ని ప్రవేశపెడుతూ మేక్ ఇన్ ఇండి యా పథకంతో భారత స్వరూపమే మారిపోతుందని చెప్పుకొచ్చారు. దీంతో భారతదేశం ప్రపంచంలోనే వస్తుతయారీ కేంద్రంగా మారిపోతుందన్నారు. ఈ పథకాన్ని ప్రారంభించిన నాలుగేండ్ల తర్వాత కూడా పరిస్థితిలో మార్పేమీ లేదు. ఉద్యోగ కల్పన అసలే లేదు. పోగా 2017 ఏప్రిల్–జూన్ మధ్యకాలంలోనే దేశంలో 87 వేల ఉద్యోగాలు పోయా యి. దీంతో మేక్ ఇన్ ఇండియాతో ఏం ఒనగూరిందో అర్థమవుతూనే ఉన్నది. మోదీ అనుసరించిన విధానాలు, పథకాల పుణ్యమాని గత నాలుగేండ్లలో 24 శాతం నుంచి 35 శాతానికి నిరుద్యోగం పెరిగింది. నిపుణుల అధ్యయనం ప్రకారం మోదీ ప్రవేశపెట్టిన స్కిల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా పథకాలు ఆచరణకు ఆమడదూరంలో ఉన్నాయని తేలింది. ఈ మేక్ ఇన్ ఇండియా పథకం ద్వారా ఉత్పత్తి, ఉద్యోగ కల్పన పెరుగుతుందని మోదీ చెప్పినా ఆచరణలో దానికి భిన్నమైన ఫలితాలనే ఇచ్చాయన్నది వాస్తవం. నిజానికి మేక్ ఇన్ ఇండియా పథకంలోని లోపం గురించి చెబుతూ.. మేక్ ఇన్ ఇండియా అనేది మేక్ ఫర్ ఇండియాగా ఉన్నప్పుడే సత్ఫలితాలు ఇస్తాయన్నారు. ఈ కోవలోనే అతి ముఖ్యమైనదిగా, తలమానికమైనదిగా చెబుతున్న మహాత్మాగాంధీ జాతీ య ఉపాధి హామీ పథకం కూడా ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. దీంతో ప్రజల జీవన విధానంలో, ప్రమాణాల్లో మార్పులు తేవాలని, ఉన్నతిని సాధించాలని చెప్పినా అవన్నీ ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. ఇలా చెప్పుకుంటూపోతే మోదీ ప్రభుత్వం గొప్పగా చెప్పుకొచ్చిన పథకాలేవీ ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. మరోవైపు విప్లవాత్మక మార్పులకు అంకురార్పణగా చెప్పిన పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ పన్ను విధానం మోదీ అనుకున్నదానికి పూర్తిభిన్నమైన ఫలితాలు ఇచ్చాయి. వీటి కారణంగా దేశవ్యాప్తంగా ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభానికి లోనైంది. ఉద్యోగ కల్పన అనేది ఆవిరైపోయింది. ఫలితంగా ఈ మధ్య కాలంలో జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజే పీ ఓటమి పాలైంది.

రాజకీయపార్టీలు దేశం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల చిత్తశుద్ధితో, నిబద్ధతతో ఆలోచించాలి. నిరుద్యోగం లాంటి ప్రధాన సమస్యను విస్మరించే ఎంత గొప్ప పథకమైనా ఆచరణలో విఫలం కాకతప్పదు. ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకోక తప్పదు. ఈ నేపథ్యంలో దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పునాదిగా రాజకీయపార్టీలు నడుచుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

మరికొన్ని నెలల్లో సాధారణ ఎన్నికలు రాబోతున్న వేళ.. రాజకీయ పార్టీలు దేశం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల చిత్తశుద్ధితో, నిబద్ధతతో ఆలోచించాలి. నిరుద్యోగం లాంటి ప్రధాన సమస్యను విస్మరించే ఎంత గొప్ప పథకమైనా ఆచరణలో విఫలం కాకతప్పదు. ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకోక తప్పదు. ఈ నేపథ్యంలో దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పునాదిగా రాజకీయపార్టీలు నడుచుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

('కారవాన్' సౌజన్యంతో..)

మారనున్న గ్రామీణ ముఖచిత్రం

తెలంగాణం



వి.రాజామహేందర్ రెడ్డి

సమైక్య రాష్ట్రంలో పుష్కలమైన కృష్ణా, గోదావరి నీటి వనరులున్నప్పటికీ రైతులకు సంబంధించి భయంకరమైన పరిస్థితులుండేవి. చెరువులు నిర్లక్ష్యానికి గురై ధ్వంసం కావడం, నీటి పారుదల ప్రాజెక్టులు మూలకు పడ్డాయి. దీని కి తోడు కరువు కారణంగా సాగునీరు లేక బోరుబావులు ఎంత అడుగుల లోతు తవ్వినా నీరు కనిపించని పరిస్థితి. గ్రామాల్లో బోర్ల తవ్వకాల ద్వారా అప్పుల పాలైన రైతులు ఎంతో మంది ఉన్నారు. గ్రామాలను విడి చి గల్ఫ్‌దేశాల బాట పట్టారు. గత ప్రభుత్వాలు రైతులను విస్మరించడం వల్లనే వలసలు, ఆత్మహత్యలు పెరిగాయి.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావనంతరం రైతుల దుఃఖానికి చరమగీతం పాడే ఉద్దేశంతో టీఆర్‌ఎస్ ప్రభుత్వం వరుసగా నాలుగు బడ్జెట్లలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చింది. కోటి ఎకరాలకు నీరు అందించాలనే లక్ష్యంతో ఏడాదికి 25 వేల కోట్లు సాగునీటి కోసం ఖర్చు చేసున్నది. గోదావరి, కృష్ణ బేసిన్లలో మన రాష్ట్రానికి ఉన్న వాటా నదీ జలాలను, వేలాది చెరువులను పూర్తిగా ఉపయోగించుకొనే విధంగా, ప్రతి ఎకరానికి సాగునీరు ఇవ్వడంతో పాటు అన్ని జిల్లాలకు సాగునీరు అందేవిధంగా ప్రాజెక్టులను రూపకల్పన చేశారు.

అరువై ఏండ్ల వలస పాలనలో గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. వాటిని సమగ్రంగా పునరుద్ధరించి, పూర్వ వైభవం కల్పించడం తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష. దానికి అనుగుణంగా మొదటి ప్రాధాన్యం చెరువులకు ఇచ్చింది. వాటికోసం దీర్ఘకాలిక చర్యగా 'మిషన్ కాకతీయ' కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమం కింద వేలాది చెరువులను దశల వారీగా పునరుద్ధరిస్తున్నారు.

గోదావరిలో తెలంగాణకు 950 టీఎంసీల నీటి వాటా సమైక్య రాష్ట్రంలోనే ఖరారైంది. దీనిప్రకారం గోదావరిపై కాళేశ్వరం, తుపాకులగూడెం, సీతారామ ప్రాజెక్టులను నిర్మిస్తున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులను రీ డిజైన్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యం ఉమ్మడి జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, మెదక్, నల్గొండ జిల్లాలకు సాగునీరు, హైదరాబాద్‌కు తాగునీరు అందించడం. దాదాపు 60 శాతం భూభాగానికి ఉపయోగపడే ప్రాజెక్టు ఇది. కేంద్రం, కేంద్ర జలసంఘం సహా జాతీయ, అంతర్జాతీయ నిపుణులు కూడా దీనిపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తుపాకులగూడెం వద్ద ఏడాదికి 70 టీఎంసీలకు పైగా నీటిని తీసుకునే అవకాశం ఉండటం వల్ల ఈ మేరకు దేవాదుల ప్రాజెక్టులపై పూర్తిస్థాయి సమీక్ష చేసి, పాత వరంగల్ జిల్లాకు తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజక వర్గాలకు నీరివ్వడం. దుమ్ముగూడెం వద్ద నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడం లక్ష్యంగా చేసుకున్నారు.

కృష్ణానదిపై ఇప్పటికే ప్రారంభించిన కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల ప్రాజెక్టులను నాలుగేండ్లలోపే పూర్తిచేశారు. కృష్ణానదిపై రూపొందించిన పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని, డిండి ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తిచేసి ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరు అందించడానికి ప్రయత్నం చేస్తున్నది. డిండి ప్రాజెక్టుతో నల్గొండలో దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ బాధ నుంచి ప్రజలు విముక్తులవుతారు.

ప్రాజెక్టులు పూర్తిచేయడం టీఆర్‌ఎస్ ప్రభుత్వం వల్లనే సాధ్యమని ప్రజలు నమ్మారు. ఇదే కారణంతో టీఆర్‌ఎస్‌కు మళ్లీ ఓటు వేశారు. తెలంగాణ రైతు ఎప్పుడూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతు గర్వపడే రోజులు రావాలని కేసీఆర్ సంకల్పాన్ని చూసి కుల, మత, ప్రాంతాల కతీతంగా జై కొట్టని రైతు లేడు. మన బతుకులు మారాలంటే సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే నాయకుడైన కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజల్లో బలమైన ఆకాంక్షకు ప్రతిరూపంగా ఎన్నికల ఫలితాలు వచ్చాయి.

మొదటి నాలుగేండ్లలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా 17.17 శాతం వృద్ధిరేటు, ఈ సంవత్సరం 29.17 శాతం సాధించడం జరిగింది. 2018-19 వానకాలంలో వరి ధాన్యం రికార్డు స్థాయిలో ఉత్పత్తి అయింది. సాగునీటి ప్రాజెక్టుల వల్ల రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించడమేకాకుండా, వ్యవస్థారపరమైన, సాంకేతికపరమైన మార్పులతో పాటు ఆకలిచావులు, ఆత్మహత్యలు, వలసలు, అప్పుల్లేని రాష్ట్రం 'తెలంగాణ రాష్ట్ర ముఖచిత్రం' మారబోతున్నది.

మొదటి టర్మ్‌లో సాగునీటి ప్రాజెక్టులు ప్రారంభించారు. అవి పురోగతిలో ఉన్నాయి. ప్రాజెక్టులపై సమీక్షల మీద సమీక్షలు చేస్తూ, ప్రత్యక్షంగా ప్రాజెక్టులను సందర్శిస్తూ నిబద్ధతతో పనిచేస్తూ రాత్రింబవళ్లు, నిద్రాహారాలు మాని ప్రాజెక్టులను పూర్తి చేయిస్తున్నారు. తెలంగాణలో సాగు భూమి 1.43 కోట్ల ఎకరాలుగా ఉన్నదని గుర్తించి మొదటి టర్మ్‌లో కోటి ఎకరాలకు సాగునీరు అందించాలని భావించినప్పటికీ ప్రస్తుతం 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించాలని దానికిగాను లక్షల కోట్ల వ్యయం చేయబోతున్నారు. రాబోయే ఐదేండ్లలో నిధుల కొరత లేకపోవడం వల్ల ఆ మొత్తం ఖర్చుచేసి, ఈ టర్మ్‌లో ప్రాజెక్టులను కేంద్రం అండ లేకున్నా అనుకున్న సమయానికి పూర్తిచేయడానికి కేసీఆర్ కృషిచేస్తున్నారు. పాలమూరులో ఏకంగా దాదాపు 12 వందల చెరువులను నింపారు. చెరువులను నింపడం ద్వారా పాలమూరు జిల్లాను కోనసీమ ను తలపించేలా మార్చారు.

వ్యవసాయ విస్తీర్ణం పెరుగడం వల్ల అన్ని రుతువుల్లో పని దొరకడం జరుగుతున్నది. ఫలితంగా రుతు సంబంధిత నిరుద్యోగిత తగ్గింది. వ్యవసాయం పుంజుకోవడంతో గ్రామాల్లో ఉండే వివిధ వృత్తికులాల వారికి వారి సొంత ఊళ్లలోనే ఉపాధి అవకాశలు పెరిగాయి.

ఏ రాష్ట్రంలో లేనివిధంగా అన్ని జిల్లాలకు నీటి సౌకర్యాలు కల్పించడం వల్ల ప్రాంతీయ అసమానతలు, ఆదాయ అసమానతలు, జనాభా, పేదరికం తగ్గుముఖం పట్టడమేగాక ప్రజల జీవన ప్రమాణం కూడా పెరుగుతుంది. మిషన్ కాకతీయ అమలు తర్వాత 2016–17లో 51 శాతం సాగు విస్తీర్ణం చెరువుల కింద పెరిగిందని, 62 శాతం చేపల పెంపకం విస్తరించిందని నాబార్డ్ అనుబంధ సంస్థ 'నాబ్కాన్' సర్వే ద్వారా తెలిపింది. తెలంగాణ గ్రామాల్లో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వికాసానికి మిషన్ కాకతీయ దోహదం చేస్తున్నదని పేర్కొన్నారు.

అప్పులు, ఆత్మహత్యలు, ఆకలి, వలసలతో అల్లాడిన ఈ భూమి కుంటలు, రిజర్వాయర్లు, ప్రాజెక్టులతో కళకలలాడుతున్నది. బీడు భూములు పచ్చ చీర కట్టుకుంటున్నవి. తెలంగాణ అంతా పచ్చదనం పరుచుకున్నది. ప్రాజెక్టుల పూర్తితో ఆకాశం వైపు కన్నెత్తి చూడాల్సిన అవసరం లేకుండా చేస్తున్నారు. వచ్చే ఐదేండ్లలో వ్యవసాయం రూపురేఖలు మారిపోనున్నాయి. మొదటి నాలుగేండ్లలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా 17.17 శాతం వృద్ధిరేటు, ఈ సంవత్సరం 29.17 శాతం సాధించడం జరిగింది. 2018–19 వానకాలంలో వరి ధాన్యం రికార్డు స్థాయిలో ఉత్పత్తి అయింది. సాగునీటి ప్రాజెక్టుల వల్ల రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించడమేకాకుండా, వ్యవస్థారపరమైన, సాంకేతికపరమైన మార్పులతో పాటు ఆకలిచావులు, ఆత్మహత్యలు, వలసలు, అప్పుల్లేని రాష్ట్రం 'తెలంగాణ రాష్ట్ర ముఖచిత్రం' మారబోతున్నది.

(వ్యాసకర్త: హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, తెలంగాణ వికాస సమితి)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy**. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

వేములవాడ కల్చరల్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో శుక్రవారం నుంచి ఈ నెల 29 వరకు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో దూస రాజేశ్వర్ వెల్లడించారు. ఇందుకుగాను ఆలయ ప్రాంగణంలోని ఓపెన్‌స్లాబ్‌పైన వేదికను ముస్తాబుచేశారు. 66 ఏండ్లుగా ఈ క్షేత్రంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు స్వస్తి పుణ్యాహవచనం నిర్వహించి.. 7.25 గంటలకు త్యాగరాజ స్వామి చిత్రపటంతో పురవీధులగుండా నగర సంకీర్తన, 9.30 గంటలకు వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని ఆలయ ఈవో దూస రాజేశ్వర్ వెల్లడించారు.

రేపట్నుంచి పలుచోట్ల ఓ మోస్తరు వర్షం

స్వల్పంగా పెరుగనున్న చలి తీవ్రత

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ నుంచి రాయలసీమ వరకు 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో శని, ఆదివారాలు రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు, అక్కడక్కడ వడగండ్లు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్రవారం వర్షాలు పడే అవకాశంలేదని, చలితీవ్రత కొంత పెరుగొచ్చని వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం అత్యల్పంగా మెదక్‌లో 15 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, మహబూబ్‌నగర్, రామగుండం, హన్మకొండ, హకీంపేటలో 17 డిగ్రీలు, ఆదిలాబాద్, భద్రాచలంలో 18 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి.

గ్రేటర్‌లో పెరిగిన ఉష్ణోగ్రతలు

గ్రేటర్ హైదరాబాద్‌లో గురువారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. గరిష్ఠ ఉష్ణోగ్రత సాధారణ స్థాయికంటే 0.4 డిగ్రీలు పెరిగి 31.4 డిగ్రీలుగా, కనిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కంటే 1.3 డిగ్రీలు పెరిగి 18.3 డిగ్రీలుగా నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఉపరితల ద్రోణి ప్రభావంతో శని, ఆదివారాల్లో గ్రేటర్ పరిధిలోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశమున్నదని, చలిగాలుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గొచ్చని చెప్పారు.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
సంగారెడ్డి	13.0	34.9
సూర్యాపేట	14.0	31.0
మహబూబ్‌నగర్	14.1	35.7
జనగామ	14.2	35.5
వికారాబాద్	14.5	29.0
నాగర్‌కర్నూల్	14.6	34.7
ఆసిఫాబాద్	14.8	31.6
ఆదిలాబాద్	14.8	31.6
మంచిర్యాల	14.8	31.6
కరీంనగర్	15.3	32.7
సిద్దిపేట	15.4	34.6
వనపర్తి	15.6	35.3
మెదక్	15.7	34.8
యాదాద్రి	15.7	35.7
జోగుళాంబ గద్వాల	16.5	35.3
పెద్దపల్లి	16.6	30.2
రంగారెడ్డి	17.0	30.0
నల్లగొండ	17.0	30.0
ఖమ్మం	17.0	31.0
మహబూబాబాద్	17.7	34.6
వరంగల్ అర్బన్	18.0	29.5
వరంగల్ రూరల్	18.0	30.0
నిర్మల్	18.0	30.0
రాజన్న సిరిసిల్ల	18.0	31.0
భద్రాద్రి కొత్తగూడెం	18.0	32.0
హైదరాబాద్	18.3	31.4
మేడ్చల్ మల్కాజిగిరి	18.3	31.4
జయశంకర్	19.0	31.0
జగిత్యాల	19.0	31.0
నిజామాబాద్	19.1	31.2
కామారెడ్డి	20.0	29.0



సిద్దిపేటలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సంక్షేమ ఫలాలు పేదలకందాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పేద ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సిద్దిపేట నియోజకవర్గంలో అభివృద్ధిని మరింత పరుగులు పెట్టించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతీరుపై గురువారం సిద్దిపేటలోని ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ కృష్ణభాస్కర్, జేసీ పద్మాకర్‌తో కలిసి హరీశ్‌రావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్ నిర్మాణం, భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మార్చి 2019 నాటికి గజ్వేల్ వరకు రైలు నడపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని.. అందుకనుగుణంగా రైల్వే, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి పనులు వేగవంతం చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

వెల్గటూరు: జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలంలోని ఎండపల్లికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీల్లో మనీష, విష్ణువర్ధన్ 800 మీటర్లు, రచన 400 మీటర్లు, కోమలత, శ్రీలత 600 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చూపి 27, 28లలో నిజమబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికపై సర్పంచ్ మారం జలెందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మల్లారం సతీశ్, క్రీడాకారులు మారంపెల్లి కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కోచ్ బౌకని కొంరయ్య, నాయకులు బూరగడ్డ శ్రీనివాస్, శ్రీనివాస్, ఇబ్రహిం, ఆర్ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

కరీంనగర్ కలెక్టర్‌కు జాతీయ స్థాయి అవార్డు

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'బేటీ బచావో- బేటీ పడావో' పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలుచేసి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చినందుకు కరీంనగర్ కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ 'ఎఫెక్టివ్ కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ అవార్డు' అందుకున్నారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన జాతీయ బాలికాదినోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి మేనకాగాంధీ కలెక్టర్‌కు ఈ అవార్డు ప్రదానం చేశారు.

జల్లాపల్లిలో అభ్యర్థి 'గుర్తు' తారుమారు

బ్యాలెట్ పత్రంలో మారిన సింబల్

ఆందోళనలో సర్పంచ్ అభ్యర్థి.. నేటి పోలింగ్‌పై ఉత్కంఠ

కోటగిరి: అధికారుల చిన్న పొరపాటుతో బ్యాలెట్ పత్రంలో గుర్తు తారుమారు కావడంతో ఓ సర్పంచ్ అభ్యర్థి భవిష్యత్తు ఇరకాటంలో పడింది. శుక్రవారం పోలింగ్ జరగాల్సి ఉండగా ఎన్నికల సిబ్బంది గురువారం సాయంత్రం గ్రామానికి చేరుకొని బ్యాలెట్ పత్రాలను పరిశీలించగా అందులో ఓ అభ్యర్థి గుర్తు కనిపించక పోవడంతో కంగుతిన్నారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా జల్లాపల్లిలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా.. జల్లాపల్లిలో గ్రామంలో సర్పంచ్ స్థానానికి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. రిటర్నింగ్ అధికారి మొదటి అభ్యర్థికి ఉంగరం, రెండో అభ్యర్థికి కత్తెర, మూడో అభ్యర్థికి బ్యాట్ గుర్తు ఇవ్వాల్సి ఉంది. కాగా మూడో అభ్యర్థికి బ్యాట్‌కు బదులు కప్‌సాసర్ కేటాయించారు. వాస్తవంగా బ్యాలెట్ పత్రంలో మూడో స్థానంలో బ్యాట్, నాలుగో స్థానంలో కప్‌సాసర్ గుర్తు ఉంటుంది. అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు సమక్షంలో మూడో స్థానంలో ఉన్న అభ్యర్థికి బ్యాట్‌కు బదులు కప్ సాసర్ గుర్తు ఇవ్వడంతో ఆయన అదే గుర్తుతో ఎన్నికల ప్రచారం చేసుకున్నారు. చివరకు బ్యాలెట్ పత్రంలో కప్ సాసర్ కనిపించక పోగా ఆ స్థానంలో బ్యాట్ గుర్తు వచ్చి చేరింది. దీంతో ఆందోళనకు గురైన సదరు అభ్యర్థి ఎండీ సికిందర్ ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి తనకు న్యాయం చేయాలని కోరారు. ఇక్కడ జరిగిన పొరపాటును సరిదిద్దేందుకు కలెక్టర్‌తోపాటు ఎన్నికల అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. శుక్రవారం పోలింగ్ ప్రారంభం కంటే ముందే ఓ నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నది. ఎలాంటి నిర్ణయం వస్తుందోనని సదరు అభ్యర్థి ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

ఇద్దరు స్టేజ్-2 అధికారుల సస్పెన్షన్

బ్యాలెట్ పేపర్లు బయట దొరకటమే కారణం

సూర్యాపేట, నమస్తే తెలంగాణ: గ్రామ పంచాయతీ మొదటి విడుత ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు స్టేజ్-2 అధికారులను సస్పెండ్ చేస్తూ సూర్యాపేట కలెక్టర్ అమయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా హుసేనాబాద్, గుంజలూరులో బ్యాలెట్ పేపర్లు బయట లభించిన ఘటనల్లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి స్కూల్ అసిస్టెంట్ బుచ్చిరెడ్డి, చివ్వెంల మండలం దురాజ్‌పల్లి స్కూల్ అసిస్టెంట్ ఖాజా అలీఖాన్‌లను సస్పెండ్ చేశారు. ఇటీవల జరిగిన మొదటి విడుత పంచాయతీ ఎన్నికల్లో ఖాజా అలీఖాన్‌కు మోతె మండలం హుసేనాబాద్ గ్రామ పంచాయతీలో స్టేజ్ -2 అధికారిగా, బుచ్చిరెడ్డికి చివ్వెంల మండలం గుంజలూరు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో స్టేజ్-2 అధికారిగా బాధ్యతలు అప్పగించారు. పోలింగ్ నిర్వహించి లెక్కింపు అనంతరం వారు బ్యాలెట్ పత్రాలను పోలింగ్ కేంద్రాల వద్ద వదిలేసి వెళ్లారు. దీంతో గ్రామస్థుల ఫిర్యాదుమేరకు అధికారులు విచారణ జరిపి వారిని సస్పెండచేశారు.

నల్లమలలో సీసీఎంబీ పీహెచ్‌డీ స్కాలర్స్ పర్యటన

అమ్రాబాద్ రూరల్: హైదరాబాద్‌లోని సెంట్రల్ ఫర్ సెల్యూలార్ మాలిక్యూలర్ ఆఫ్ బయాలజీ (సీసీఎంబీ)కి అనుసంధానమైన లాకోన్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్న వివిధ దేశాలకు చెందిన 17 మంది స్కాలర్స్ గురువారం నల్లమలలో పర్యటించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ అటవీశాఖ విజ్ఞాన కేంద్రంలో అమ్రాబాద్ రిజర్వు అటవీ ప్రాముఖ్యతపై ఏటీఆర్ ప్రాజెక్టు డైరెక్టర్ వినోద్‌కుమార్ అవగాహన కల్పించారు.



యాదాద్రిలో తరగతులు ప్రారంభించి పాఠాలు బోధిస్తున్న స్థపతి డాక్టర్ ఆనందాచారి వేలు

మరో ముందడుగు

సీఎం కేసీఆర్ చొరవతో యాదాద్రిలో శిల్పకళ కళాశాల ఏర్పాటు

తరగతులను ప్రారంభించిన స్థపతి ఆనందాచారి వేలు

శిల్పశాస్త్రంలో నిపుణులను తీర్చిదిద్దనున్న కళాశాల

యాదాద్రిభువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తేతెలంగాణ: రాష్ట్రంలోనే మొట్టమొదటగా ఇటీవల యాదాద్రిలో ఏర్పాటు చేసిన శిల్పకళ కళాశాలలో గురువారం తరగతులు ప్రారంభమయ్యాయి. దేశంలో ఇప్పటికే తమిళనాడులోని మహాబలిపురం, ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో శిల్పకళాశాలలు ఉండగా, తెలంగాణ తిరుపతిగా యాదాద్రిని అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఇక్కడ ఈ కళాశాల ఏర్పాటైన విషయం తెలిసిందే. కళాశాలకు అన్ని రకాల హంగులను సమకూరుస్తున్నారు. శిల్పకళను అభివృద్ధి చేసి రాబోయే తరాలకు శిల్పశాస్త్రంలో నిపుణులను అందించేందుకు యాదాద్రిని కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. ఓవైపు దేశం మొత్తం గర్వపడేలా ఆలయాన్ని అత్యున్నతనమైన శిల్పకళాఖండాలతో నిర్మాణం చేస్తూ అబ్బురపరుస్తున్న ఉప స్థపతులు, స్థపతుల సేవలను ఉపయోగించుకుంటూ వారితోనే అద్భుతమైన శిల్పులను తయారు చేయనున్నారు. ఇందులో భాగంగానే స్థపతి డాక్టర్ ఆనందాచారి వేలు గురువారం కళాశాల తరగతులను ప్రారంభించారు. జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలగా ఇది పని చేయనున్నది. ఇటీవలే ప్రవేశపరీక్ష నిర్వహించి 15 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. విద్యార్థులకు భోజన, వసతి సౌకర్యాలను యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం సమకూర్చుతున్నది. సంస్కృత విద్యాపీఠం విద్యార్థులకు ఇచ్చే మెనూ, ఇతర సౌకర్యాలు అన్నీ వీరికి కూడా అందనున్నాయి. యాదాద్రి ఆలయ విస్తరణ పనుల్లో విశేష అనుభవం గడించిన ఉప స్థపతులు పార్ట్‌టైం లెక్చరర్లుగా నియమితులయ్యారు. ప్రముఖ స్థపతి ఎస్ సుందరరాజన్ కళాశాల చైర్మన్‌గా, ఉప స్థపతి మోతీలాల్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించనున్నారు.

మంచి భవిష్యత్తు: డాక్టర్ ఆనందాచారి వేలు

శిల్పశాస్త్రం అభ్యసించే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ శిల్పశాస్త్ర నిపుణుడు, స్థపతి డాక్టర్ ఆనందాచారి వేలు అన్నారు. కళాశాల తరగతులను ప్రారంభించిన సందర్భంగా 'శిల్పశాస్త్రం భవిష్యత్తు అవసరాలు ప్రాధాన్యత' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. శిల్పశాస్త్రంలో నిపుణులు సరిపోను నిష్పత్తిలో లేనందున డిమాండ్ అధికంగా ఉన్నదని చెప్పారు.

ఖనిలో పంచలోహ విగ్రహాల చోరీ ముఠా అరెస్టు

ఫెర్టిలైజర్‌సిటీ: పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పురాతన పంచలోహ విగ్రహాలను దొంగిలించే ముఠాను గురువారం గోదావరిఖని బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు అరెస్టు చేశారు. వీరినుంచి రూ.20 లక్షల విలువ చేసే 2 శివపార్వతుల పంచలోహ విగ్రహాలు, రూ.10,200 నగదుతోపాటు వీరినుంచి కొనుగోలు చేసిన వ్యాపారులపైనా కేసులు నమోదుచేసి 30 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. రామగుండం సీపీ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రికి చెందిన గుమ్మడి సారయ్య అలియాస్ రాసపెల్లి సారయ్య, ఐబీ తాండూరుకు చెందిన తోడేటి శంకర్ అలియాస్ వెంకటేశ్, కాసిపేటకు చెందిన సిలికారి గోపాల్, కౌటాలకు చెందిన నాయిన పోశం, కొలనూరుకు చెందిన తోట రమేశ్ ముఠాగా ఏర్పడ్డారు. వీరు మంచిర్యాల, కౌటాల, రెబ్బన ప్రాంతాల్లోని ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 3 ఆలయాల్లో చోరీకి యత్నించగా అక్కడ బంగారం దొరక్కపోవడంతో గుడిని ధ్వంసం చేశారు. గోదావరిఖని, సుల్తానాబాద్, బెల్లంపల్లిలో ఇండ్లల్లోనూ దొంగతనంచేసి ఆ సొత్తును పెద్దపల్లి, వేములవాడ, కరీంనగర్, కాగజ్‌నగర్, మంచిర్యాలలోని బంగారు షాపు యజమానులకు విక్రయించారు. వీరిచ్చిన సమాచారం మేరకు చోరీ సొత్తు కొనుగోలు చేసిన పలువురు వ్యాపారులను కూడా నిందితులుగా చేర్చారు. వీరి వద్ద 30 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా ఐదుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీపీ తెలిపారు. నిందితులపై మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి, పెద్దపల్లి , రెబ్బన తదితర ప్రాంతాల్లో గుమ్మడి సారయ్యపై 36, తోడేటి శంకర్‌పై 21 కేసులు, సిలివేరు వేణుగోపాల్‌పై 2 కేసులు ఉన్నాయన్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లి సర్పంచ్ భారతమ్మకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు



జగిత్యాల జిల్లా కోరుట్లలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

గులాబీ పార్టీలో జోరుగా చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. గురువారం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో గులాబీ పార్టీలో చేరారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం వెల్మల్ నూతన సర్పంచ్ మచ్చర్ల సాయమ్మ, పలువురు కాంగ్రెస్ నాయకులు ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో, సిరికొండ మండలం కొండూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మామిడిపల్లి ఏకగ్రీవ సర్పంచ్ కొక్కుల భారతమ్మ 100 మంది అనుచరులతో కలిసి వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు సమక్షంలో, జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో 11వ వార్డుకు చెందిన స్వతంత్ర కౌన్సిలర్ జంగంపల్లి విజయ రాజిరెడ్డి, 19వ వార్డుకు కాంగ్రెస్ కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న 126 మంది కార్మికులు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సమక్షంలో, మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం చక్రాపూర్‌కు చెందిన 50 మంది దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

కుక్కల దాడిలో 49 గొర్రెలు హతం

కొల్లాపూర్/మక్తల్, నమస్తే తెలంగాణ: వేర్వేరు చోట్ల గొర్రెల మందలపై కుక్కలు దాడి చేయగా 49 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిలకు చెందిన మేకలరాముడుకు చెందిన తన గొర్రెలను సమీపంలోని కృష్ణానది వద్దకు తీసుకెళ్లాడు. గురువారం మధ్యాహ్నం భోజనం చే సేందుకు నది ఒడ్డుకు చేరుకోగా అప్పుడే ఊర్లో నుంచి గుంపుగా వ చ్చిన కుక్కలు ఒక్కసారిగా దాడిచేసి 25 గొర్రెలను చంపేశాయి. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మండలం కర్ని గ్రామానికి చెందిన చిన్న శివలింగప్ప, శివలి ంగప్ప, శివరాజులకు చెందిన 80 గొర్రెలను గ్రామశివారులోని దొడ్డిలో ఉంచిన గొర్రెల మందపై బుధవారం రాత్రి కుక్కలు దాడిచేయడంతో 24 గొర్రెలు మృతి చెందాయి.

మందమర్రిలో పులి-చర్మం స్వాధీనం

ఎన్జీవో సహకారంతో పట్టుకున్న అటవీ అధికారులు

మంచిర్యాలరూరల్/మందమర్రి: మంచిర్యాల జిల్లా మందమర్రిలోని ఓ ఇంటిపై గురువారం అధికారులు దాడి చేసి పులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్నారు. మందమర్రి రామన్‌కాలనీ అంగడి బజార్ ఏరియాలోని ఐలవేని లింగయ్య అనే సింగరేణి మాజీ కార్మికుడి ఇంట్లో ఇది లభించింది. అయితే కవ్వాల్ టైగర్ ఫారెస్ట్‌లో కెమెరాకు చిక్కిన మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన పులికి ఉన్న చారలు, తాజాగా దొరికిన చర్మానికి ఉన్న చారలు పోలి ఉండటంతో.. ఇది ఆ పులి చర్మమే అయి ఉంటుందని పలువురు అనుమానిస్తున్నారు. సదరు పులిని వేటాడి ఉంటారని భావిస్తున్నారు. డీఎఫ్‌వో రామలింగం, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లికి చెందిన మేకల నర్సయ్య అనే వ్యక్తి పులి చర్మాన్ని అమ్మకానికి పెట్టాడు. సమాచారం తెలుసుకున్న చంద్రాపూర్‌కు చెందిన టైగర్ హంట్ ఎండ్ అసోసియేషన్ (ఎన్జీవో) సభ్యులు అతడితో మాట్లాడి కొంటామని చెప్పారు. కాగజ్‌నగర్‌కు పులిచర్మాన్ని తీసుకొస్తామని నర్సయ్య చెప్పడంతో రెండు రోజుల క్రితం ఎన్జీవో సభ్యులు అక్కడికి వెళ్లినా అతడు తీసుకురాలేదు. మందమర్రి కేకే5 గనిలో పనిచేస్తున్న ఐలవేని అంజయ్య అనే వ్యక్తి ఎన్జీవో సభ్యులకు ఫోన్‌చేసి.. శుక్రవారం అంగడిబజార్‌లోని లింగయ్య ఇంటికి వస్తే పులిచర్మాన్ని విక్రయిస్తానని చెప్పాడు. ఎన్జీవో సభ్యులు, అటవీ అధికారులు గురువారం ఆ ప్రాంతానికి చేరుకొని వేచిచూశారు. సాయంత్రం మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ కలిగిన ఓ వాహనంలో వచ్చిన నలుగురు వ్యక్తులు పులిచర్మంతో లింగయ్య ఇంటికి చేరుకున్నారు. అధికారులు వారిని పట్టుకొనేందుకు వెళ్లగా పులిచర్మాన్ని అక్కడే వదిలి పారిపోయారు. అధికారులు అంజయ్య కుమారుడు శ్యామ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



గురువారం అధికారులు స్వాధీనం చేసుకున్న పులి చర్మం. కింద చిత్రంలో కనిపిస్తున్న పులిపై ఉన్న చారలు.. పై చిత్రంలో చర్మానికి ఉన్న చారలు పోలి ఉండటంతో ఈ పులినే చంపి ఉంటారనే అనుమానాలు కలుగుతున్నాయి

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని మహిళ దుర్మరణం

నిజామాబాద్ జిల్లా కాలూరులో ఘటన



మారెమ్మ (ఫైల్)

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ జిల్లా కాలూరు గ్రామశివారులో గురువారం ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో పారిశుద్ధ కార్మికురాలు మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా.. తిర్మన్‌పల్లికి చెందిన మారెమ్మ(48) పారిశుధ్య కార్మికురాలిగా పనిచేసున్నది. గురువారం ఉదయం ఆమె తన మేనల్లుడు మారయ్య బైక్ మీద ఇంట్లో నుంచి పని కోసం బయల్దేరింది. మార్గమధ్యంలో కాలూర్ గ్రామశివారులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మారెమ్మ తలపైనుంచి బస్సు టైరు వెళ్లగా ఆమె అక్కడికక్కడే దుర్మరణం చెందింది.

భర్త చేతిలో భార్య హత్య



నాగమ్మ (ఫైల్)

మక్తల్, నమస్తే తెలంగాణ: క్షణికావేశంలో కట్టుకున్న భార్యను కడతేర్చిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మండలం గుర్లపల్లిలో గురువారం చోటు చేసుకున్నది. ఎస్సై అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్లపల్లి గ్రామానికి చెందిన గొల్ల చెన్నప్పకు మక్తల్ మండలం చీర్లపురంకు చెందిన నాగమ్మతో 26 ఏండ్ల క్రితం వివాహమయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు, కుతురు ఉన్నారు. కొద్ది రోజులుగా భార్యాభర్తలిద్దరూ తరచూ గొడవ పడుతుండేవారు. గురువారం ఉదయం కూడా పొలం వద్ద ఇద్దరూ గొడవపడ్డారు. ఈ సమయంలో క్షణికావేశానికిలోలైన భర్త చెన్నప్ప అక్కడే గుంటుకకు ఉన్న మేడితోకతో నాగమ్మ తలపై బలంగా కొట్టడంతో నాగమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని పొలంలోని పశుగ్రాసంలో పడేసి చెన్నప్ప పరారయ్యాడు. కేసు నమోదు చేసి చెన్నప్ప కోసం గాలిస్తున్నట్టు ఎస్సై తెలిపా రు.

మహిళ దారుణ హత్య

నాగర్‌కర్నూల్‌టౌన్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ కాలనీలో గురువారం ఓ మహిళ హత్యకు గురైంది. డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తాడూరు మండలం యత్మతాపూర్‌కు చెందిన లక్ష్మ మ్మ(52) తన చిన్న కొడుకు వెంకటేశ్‌తోకలిసి నాగర్‌కర్నూల్ పట్టణంలో అద్దె ఇంటిలో ఉంటున్నారు. ఈ క్రమంలో మతిస్థిమితం లేని కొడుకు తల్లితో తరచూ గొడవ పడుతుండేవాడు. గురువారం తెల్లవారుజామున ఆమెను రక్తపుమడుగులో చేసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మతిస్థిమితం లేని ఆమె కుమారుడే హత్య చేసి ఉంటాడనే పోలీసులు అనుమానిస్తున్నారు.

తెలంగాణ యువకుడికి ఐరాస ఆహ్వానం

జెనీవా సదస్సుకు రావాలంటూ పిలుపు




మోట వీర్‌కుమార్

లింగాల: తెలంగాణ యువకుడికి అరుదైన ఆహ్వానం అందింది. శుక్రవారం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జరిగే ఓ సదస్సుకు హాజరుకావాలని ఐక్యరాజ్యసమితి (ఐరాస) ఆహ్వానించింది. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన గిరిజన యువకుడు మోట వీర్ కుమార్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చదివాడు. 'స్కైలార్క్ మెడికల్ ఇండియా' పేరిట అతడు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాలను ఐరాస గుర్తించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కల్పించింది. ఇందులో భాగంగానే జెనీవా సదస్సుకు హాజరుకావాలని ఆహ్వానించింది.

పల్టీ కొట్టిన ఆటో.. పదిమంది విద్యార్థులకు గాయాలు

జనగామ టౌన్: సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించుకొని.. ఒక చేత్తో ఫోన్ మాట్లాడుతూ.. మరో చేత్తో ఆటో నడుపుతూ.. రోడ్డుపైకి వచ్చిన కుక్కలను ఢీకొట్టాడు ఓ డ్రైవర్. అదుపుతప్పిన ఆటో మూడు పల్టీలు కొట్టడంతో అందులోని పదిమంది విద్యార్థులు గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. జనగామలోని వివిధ పాఠశాలలకుపాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులతో ఆటో బచ్చన్నపేట నుంచి ఉదయం 8.25 గంటలకు బయలు దేరింది. మరో రెండు కిలోమీటర్లయితే జనగామకు చేరుకుంటుందనగా ఆటో డ్రైవర్ ఫాజిల్ మొబైల్ మోగడంతో ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో జనగామ శివారులోని పెట్రోల్ పంపు వద్ద ఆటోకు ఎదురుగా రెండు కుక్కలు రావడంతో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. అదుపు తప్పిన ఆటో రోడ్డుపై మూడు పల్టీలు కొట్టింది. ఆటోలో ఉన్న 13 మందిలో 10 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని జనగామ దవాఖానకు తరలించారు. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి దవాఖానకు చేరుకొని విద్యార్థులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో జింకకు గాయాలు



గాంధారి (సదాశివనగర్): కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం పద్మాజివ్వాడీ గ్రామ సమీపంలోని జాతీయరహదారిపై గురువారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో జింక గాయపడింది. ఈ ప్రమాదంలో జింక రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు జింకకు చికిత్స నిమిత్తం తరలించారు.

ఖమ్మంలో 8 లక్షల విలువైన గుట్కా పట్టివేత

ఖమ్మంక్రైం: ఖమ్మం జిల్లా కేంద్రంలో అక్రమంగా నిల్వఉంచిన రూ. 8 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను గురువారం వన్‌టౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రెహమాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన వాసుదేవరావు కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి గుట్కాలను తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్, వన్‌టౌన్ పోలీసులు దాడిచేసి గుట్కా పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

నాగర్‌కర్నూల్ డీఈవో సరెండర్

నాగర్‌కర్నూల్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన నాగర్‌కర్నూల్ డీఈవో సహదేవుడును రాష్ట్ర విద్యాశాఖకు సరెండర్ చేస్తూ కలెక్టర్ శ్రీధర్ శుక్రవారం సాయ ంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగు నెలల కిందట డీఈవోగా బాధ్యతలు తీసుకున్న సహదేవుడు.. ఉపాధ్యాయులు, ఆ శాఖ అధికారులతో వ్యవహరించిన తీరు, తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారాయి. దీంతో పలువురు ఉపాధ్యాయులు, అధికారులు డీఈవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం డీఈవో కార్యాలయానికి వెళ్లిన కలెక్టర్ విచారణ చేపట్టి డీఈవోను విద్యాశాఖకు సరెండర్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు. ఇంచార్జి డీఈవోగా ఖాజా ఫకీర్ బేగ్ బాధ్యతలు చేపట్టారు.



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ నిర్వాసితులతో మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

ముంపు బాధితులకు న్యాయం చేస్తాం

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వెల్లడి

గంగాధర: కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ కింద ఎల్లమ్మ చెరువులో ముంపునకు గురవుతున్న 86 ఎకరాల భూమికి తగిన పరిహారం చెల్లించి రైతులను ఆదుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ భరోసా ఇచ్చారు. గురువారం గంగాధర మండలంలోని మంగపేట వద్ద ఎల్లమ్మ చెరువులో ముంపునకు గురవుతున్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు ఆందోళన చెందవద్దనీ, ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. అనంతరం మధురానగర్‌లో నారాయణపూర్ కుడికాలువ కింద ముంపునకు గురౌతున్న భూములను పరిశీలించారు.



బాన్సువాడలో ఏకగ్రీవాల హోరు

- 124 పంచాయతీలకు 47 యునానిమస్
- 37.9 శాతం ఏకగ్రీవాలతో రాష్ట్రంలో టాప్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని పంచాయతీలు ఏకగ్రీవాల్లో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచాయి. మొత్తం 124 గ్రామ పంచాయతీలకుగాను 47 గ్రామాల్లో సర్పంచులను, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే రూ. 10 లక్షల నజరానాతో అభివృద్ధి చేసుకోవచ్చనే ఆలోచన చాలా గ్రామాల్లో కనిపించింది. దీంతో తమ గ్రామంలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికను అందరి ఆమోదంతో ఐక్యంగా ఊరంతా మెచ్చిన వ్యక్తులకే అప్పగించారు. బాన్సువాడ నియోజకవర్గంలో 37.9 శాతం మేర గ్రామాలు ఏకగ్రీవంగా సర్పంచ్, వార్డు సభ్యులను ఎన్నుకోవడం రాష్ట్రంలోనే విశేషం. బాన్సువాడ మండలంలో 13, బీర్కూర్‌లో 6, నస్రుల్లాబాద్‌లో 4, వర్నిలో 11, కోటగిరిలో 12, రుద్రూర్‌లో 01 చొప్పున గ్రామాలు అధికారికంగా ఏకగ్రీవాలయ్యాయి.

శాసనసభ స్పీకర్ పోచారం చొరువ

రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరువతో బాన్సువాడ నియోజకవర్గంలో ఏకగ్రీవ పంచాయతీ సంఖ్య గణనీయంగా పెరిగింది. ఎన్నికల్లో పోటాపోటీగా ఖర్చు పెట్టడం, గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కడం, ఘర్షణ పూరిత పరిస్థితులను నివారించడం, ఎన్నికల ఖర్చును తగ్గించి గ్రామాభివృద్ధికి పాటు పడటంపై స్థానిక శాసనసభ్యుడు, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలతో ప్రత్యేకంగా మాట్లాడటంతో ఏకగ్రీవ పంచాయతీల తీర్మానాలు భారీగా పెరిగాయి.

మైనార్టీ యువత ఉపాధికి ఉచిత శిక్షణ

- మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్‌చైర్మన్ ఎంఏ వహీద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మైనార్టీ యువతకు ఉపాధిని కల్పించేందుకు మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, కైరోస్ కాంపోజిట్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్‌చైర్మన్ అండ్ ఎండీ ఎంఏ వహీద్ తెలిపారు. ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురువారం మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. అభ్యర్థులకు 45 రోజులపాటు అన్నిసౌకర్యాలతో శిక్షణ ఇస్తారని, ఈ నెల 29 నుంచి హజ్ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. కైరోస్ సంస్థకు చెందిన శిక్షణాధికారి బీ సాయి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. పోలీస్, ఆర్మీ, రైల్వే రంగాల్లో యువతకు శిక్షణ అందిస్తామని, ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించని వారికి జీవీకే సంస్థలో ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు.

ప్రవేశ పరీక్షల నూతన షెడ్యూల్

ప్రవేశ పరీక్ష	యూనివర్సిటీ	పరీక్ష తేదీలు	పరీక్ష సమయం
ఎంసెట్	జేఎన్టీయూ	మే 3, 4, 6 (ఇంజినీరింగ్) మే 8, 9(అగ్రికల్చర్)	ఉ:10-1, మ: 3-6
ఈసెట్	జేఎన్టీయూ	మే 11	ఉ: 10-1:00, మ: 3-6
పీఈసెట్	ఎంజీయూ	మే 15	ఆఫ్‌లైన్‌లో పరీక్షలు
ఐసెట్	కేయూ	మే 23, 24	ఉ: 10-12:30 మ: 2.30-5
లాసెట్	ఓయూ	మే 20	ఉ: 11-12.30
పీజీలాసెట్	ఓయూ	మే 20	మ: 2.30-4.00
పీజీఈసెట్	ఓయూ	మే 28-31	ఉ: 10-12, మ: 2 -4
ఎడ్‌సెట్	ఓయూ	మే 31	ఉ: 11-1:00, మ: 3-5

రెండో విడుత సం'గ్రామం'



బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది



బుధవారం ఖమ్మం జిల్లా ఏన్కూరు గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన శిబిరం నుంచి బస్సులలో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

తుదివిడుతలో 573 ఏకగ్రీవం

- గ్రామపంచాయతీల్లో మొదలైన ప్రచార పర్వం
- 3,529 సర్పంచ్‌స్థానాలకు బరిలో 11,667 మంది అభ్యర్థులు
- 27,583 వార్డులకు 67,316 మంది పోటీ
- 10 గ్రామాలు, 185 వార్డుల్లో ఎన్నికలకు బ్రేక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 30న జరుగనున్న తుదివిడుత గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. ఏకగ్రీవాలపై జనరల్ అబ్జర్వర్ల విచారణ నేపథ్యంలో ఏకగ్రీవ పంచాయతీలపై గ్రామాల్లో విచారణ చేసి ప్రకటించారు. తుదిలో మొత్తం 573 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అత్యధికంగా నిజామాబాద్‌లో 61, ఆదిలాబాద్ జిల్లాలో 55 పంచాయతీల ప్రజలు ఏకతాటిపై నిలిచి ఏకగ్రీవం చేసుకున్నారు. 8,956 వార్డులు కూడా ఏకగ్రీవమయ్యాయి. మూడోవిడుత ఎన్నికల్లో భాగంగా తుదిజాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదలచేసింది. ఈ విడుతలో మొత్తం 4,116 గ్రామాల్లో ఎన్నికలు జరుగాల్సి ఉండగా, 10 గ్రామాల్లో రిజర్వేషన్లకు అనుకూలమైన సామాజికవర్గాలు లేకపోవడంతో నామినేషన్లు దాఖలుకాలేదు. దీంతో ఇక్కడ ఎన్నికలు నిర్వహించడంలేదు. ఈ విడుతలో 573 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3,529 గ్రామాల్లో ఎన్నికలు జరుగుతుండగా సర్పంచ్‌స్థానాలకు 11,667 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. వీరికి ఇప్పటికే గుర్తులు కేటాయించడంతో ప్రచారం సైతం జోరుగా సాగుతున్నది. 36,729 వార్డులకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా, 185 వార్డులకు నామినేషన్లు దాఖలుకాలేదు. ఈ విడుతలో మొత్తం 8,956 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 27,583 వార్డులకు 67,316 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

ఏకగ్రీవమైన పంచాయతీలు జిల్లాలవారీగా..

ఆదిలాబాద్ 55, కుమ్రంభీం ఆసిఫాబాద్ 23, మంచిర్యాల 10, నిర్మల్ 9, జగిత్యాల 10, కరీంనగర్ 13, పెద్దపల్లి 6, రాజన్న సిరిసిల్ల 14, భద్రాద్రి కొత్తగూడెం 12, ఖమ్మం 24, జోగుళాంబ గద్వాల 6, మహబూబ్‌నగర్ 24, నాగర్‌కర్నూల్ 22, వనపర్తి 7, మెదక్ 12, సంగారెడ్డి 26, సిద్దిపేట 16, నల్లగొండ 16, సూర్యాపేట 9, యాదాద్రి భువనగిరి 21, కామారెడ్డి 38, నిజామాబాద్ 61, రంగారెడ్డి 12, వికారాబాద్ 23, జనగామ 15, జయశంకర్ భూపాలపల్లి 16, మహబూబాబాద్ 39, వరంగల్ రూరల్ 29, వరంగల్ అర్బన్ 5 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

రీచార్జ్ చేసుకుంటేనే కరంటు!



రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రతి ఇంటికి ప్రి-పెయిడ్ రీచార్జ్ కరంటు మీటర్లను బిగించనున్నది. ఇవి స్మార్ట్‌కార్డు ఆధారంగా పనిచేస్తాయి. సెల్‌ఫోన్ మాదిరిగానే ఈ మీటర్లకు ముందస్తుగా రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది.

నేడు రెండోవిడుత పోలింగ్

మొదటిపేజీ తరువాయి...

వాయిదాపడ్డాయి. 10,317 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ప్రస్తుతం 26,191 వార్డులకు పోలింగ్ నిర్వహిస్తుండగా, 63,480 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోలింగ్ శుక్రవారం ఉదయం 7నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు మాత్రమే జరుగనున్నది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ముందుగా వార్డు స్థానాలు, ఆ తర్వాత సర్పంచ్‌స్థానాల ఓట్లను లెక్కిస్తారు. రెండో విడుతలో పోలింగ్ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఓటరు స్లిప్పులు పంపిణీ చేసింది. టీపోల్ యాప్‌తో డౌన్‌లోడ్ చేసుకునే వెసలుబాటు కల్పించింది. ఈ ఎన్నికలకోసం 1.37 లక్షల మంది పోలింగ్ సిబ్బందిని వినియోగిస్తున్నారు. 26 వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. రెండోవిడుతలో రాష్ట్రవ్యాప్తంగా 29,964 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పోలింగ్ జరిగే ప్రాంతాలకు ఎన్నికల సామగ్రితో సిబ్బంది తరలివెళ్లారు. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తున్నారు. నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మెదక్ జిల్లాలు మినహా మిగిలిన జిల్లాల్లోని సమస్యాత్మక ప్రాంతాల్లో వెబ్‌క్యాస్టింగ్ ద్వారా ఎన్నికల సరళిని పర్యవేక్షించనున్నారు. మొత్తం 673 కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లుచేశారు. అదేవిధంగా తొలివిడుతలో పలు కారణాలతో వాయిదాపడిన వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి మండలం ముంజాలకుంట రెండోవార్డుకు, పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం సోమన్‌పల్లి ఎనిమిదో వార్డుకు శుక్రవారం పోలింగ్ నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.

ప్రాజెక్టుల పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- సీఎం కేసీఆర్ లక్ష్యానికి అనుకూలంగా పని చేయాలి
- ప్రాజెక్టులపై సమీక్షలో టీఎస్ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ : రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీరందించే సంకల్పంతో తలపెట్టిన ప్రాజెక్టుల నిర్మాణపనుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని టీఎస్ ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అన్నారు. పనుల్లో నిర్లక్ష్యం చేస్తున్న కొంతమంది అధికారులపై చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రాజెక్టుల పనులపై ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. ఎన్ని ఆటంకాలు కలిగించినా ఎత్తిపోతల పథకాలు పూర్తి చేస్తామని చెప్పారు. గతేడాది వానకాలంలో ఎత్తిపోతల పథకాల ద్వారా మూడు లక్షల ఎకరాలకు అదనంగా నీటిని అందించామని.. ఈ సారి మరో మూడు లక్షల ఎకరాలకు నీటిని అందిస్తామని తెలిపారు. వచ్చే రబీ నాటికి రెండు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే కొన్ని పాత పథకాలకు తాత్కాలిక మరమ్మతులు చేసి, పునరుద్ధరణ కోసం ప్రతిపాదనలు చేస్తున్నామని శంకర్‌రెడ్డి వివరించారు. అలాగే ఎన్నికల కోడ్ కారణంగా మరో పది కొత్త ఎత్తిపోతల పథకాలు ప్రారంభోత్సవం చేసుకోలేదని, వాటిని కూడా త్వరలో ప్రారంభించి వచ్చే యాసంగి నాటికి రెండు లక్షల ఎకరాలకు అదనంగా సాగు నీరు అందిస్తామని తెలిపారు. నిజామాబాద్, ఆదిలాబాద్, నల్లగొండ జిల్లాల్లోని మరికొన్ని ఎత్తిపోతల పథకాలకు అటవీ శాఖ అనుమతుల కోసం సీఎం కేసీఆర్‌తో చర్చిస్తామని వివరించారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణలో రైతులను తప్పకుండా భాగస్వామ్యం చేయాలని శంకర్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో ఐడీసీ ఎండీ లక్ష్మారెడ్డి, ఎస్ఈ కిశోర్‌కుమార్‌తో పాటు ఆయా జిల్లాల నుంచి ఈఈలు, డీఈఈలు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు నేడు ఈసీ అవార్డులు

- అసెంబ్లీ ఎన్నికల్లో సమర్థంగా పనిచేసినందుకు గుర్తింపు
- అవార్డులు అందజేయనున్న గవర్నర్ నరసింహన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసెంబ్లీ ఎన్నికల్లో సమర్థంగా పనిచేసిన వివిధశాఖల అధికారులకు సీఈవో కార్యాలయం అవార్డులను ప్రకటించింది. రాష్ట్రస్థాయిలో నలుగురికి, మరో 16 మంది అధికారులను ప్రత్యేక అవార్డులకు ఎంపికచేసింది. శుక్రవారం రవీంద్రభారతిలో జరిగే ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్ చేతులమీదుగా అవార్డులను ప్రదానం చేయనున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేవిడుతలో శాంతియుతంగా ఎన్నికలు పూర్తిచేసిన విషయం తెలిసిందే. రీపోలింగ్‌కు తావులేకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించినందుకు అధికారులకు అవార్డులను ఇవ్వాలని భావించినట్టు రజత్‌కుమార్ పేర్కొన్నారు. గతంలోకంటే 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 4శాతం పోలింగ్ అధికంగా నమోదైందన్నారు.

అవార్డులకు ఎంపికైనవారు..

రాష్ట్రస్థాయి..

1. సోమేశ్‌కుమార్, ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ
2. అంజనీకుమార్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్
3. దివ్య, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్
4. సర్ఫరాజ్ అహ్మద్, కరీంనగర్ జిల్లా కలెక్టర్

ప్రత్యేక అవార్డులకు..

1. బుద్ధప్రకాశ్, అడిషనల్ సీఈవో
2. ఆమ్రపాలి, జాయింట్ సీఈవో
3. దానకిశోర్, జీహెచ్ఎంసీ కమిషనర్
4. ఆర్వీ కర్ణన్, ఖమ్మం జిల్లా కలెక్టర్
5. లోకేశ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్
6. అనిత రామచంద్రన్, యాదాద్రి జిల్లా కలెక్టర్
7. వీ వెంకటేశ్వర్లు, భూపాలపల్లి రిటర్నింగ్ అధికారి
8. బీ యాదగిరి, డిప్యూటీ సీఈవో
9. ఎంఏ ఫాహిం సాబేరీ, కన్సల్టెంట్
10. సయ్యద్ ఆరిఫ్, సెక్షన్ ఆఫీసర్
11. ఐవీ భాస్కర్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్
12. ఎస్ నరహరి, సెక్షన్ ఆఫీసర్
13. కే వెంకటేశ్వర్‌రావు, సెక్షన్ ఆఫీసర్
14. సీహెచ్ సాయికుమార్, తహసీల్దార్
15. శీర్ల శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్
16. జే నాగేశ్వర్‌రావు, బూత్‌లెవల్ ఆఫీసర్ (వైరా)

మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీకి హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో 546 లెక్చరర్ పోస్టుల భర్తీకి హైకోర్టు బుధవారం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2017లో నోటిఫికేషన్ జారీచేసిన టీఎస్‌పీఎస్సీ.. రాత పరీక్ష నిర్వహించి ఇంటర్వ్యూలు చేపడుతున్న దశలో బీసీలకు తగిన పోస్టులు కేటాయించలేదని ఓ అభ్యర్థి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తాజాగా టీఎస్‌పీఎస్సీ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే నియామక ప్రక్రియను చేపట్టినట్టు చెప్పారు. దాంతో ఒక్క పోస్టు మినహాయించి మిగతా వాటి నియామక ప్రక్రియను పూర్తిచేయవచ్చునని ఆదేశాలు జారీచేసింది.

ఎంటీఏఆర్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాంబాబుయాదవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎంటీఏఆర్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టీఆర్ఎస్ కార్మికవిభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ ఎన్నికయ్యారు. తెలంగాణ భవన్‌లో గురువారం యూనియన్ సర్వసభ్య సమావేశం ప్రధాన కార్యదర్శి ఎం రాజయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాంబాబుయాదవ్‌ను కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. కార్మికులకు మంచి అగ్రిమెంట్ ఉండేలా చూస్తానన్నారు. గతంలో పవర్‌హాలీడేలతో నెలలో సగంరోజులు మాత్రమే పని దొరికేదని, ప్రస్తుతం కరంటుకోతలు లేకపోవడంతో కార్మికులకు చేతినిండా పనిదొరుకుతున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాంబాబుయాదవ్‌ను ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు వెంకటరామయ్య, సంయుక్త కార్యదర్శి బీవీ రమణ, కార్యనిర్వాహక కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కోశాధికారి కాసన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



టీఆర్ఎస్కేవీ అధ్యక్షుడు రాంబాబుయాదవ్‌ను సత్కరిస్తున్న ఎంటీఏఆర్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రాజయ్య

ఎస్సీ యువతకు ఉపాధి కల్పన శిక్షణ


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎస్సీ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో.. పర్యాటక, ఆతిథ్యరంగాల్లో ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాంబూక్యా గురువారం తెలిపారు. ప్రస్తుతం ఈ రంగాల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ఎయిర్‌పోర్ట్ సర్వీసులు, చెఫ్, పంచకర్మ ఆయుర్వేదస్పా వంటి అంశాల్లో జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో శిక్షణ ఇప్పించి, అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి 16 వేల వరకు వేతనంతో కూడిన ఉపాధి కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏండ్ల మధ్య వయసున్న నిరుద్యోగ యువత ధ్రువీకరణ పత్రాలతో గచ్చిబౌలిలోని జాతీయ పర్యాటక, ఆతిథ్య నిర్వహణ సంస్థ కార్యాలయంలో లేదా జిల్లా ఎస్సీ కోఆపరేటివ్ అభివృద్ధి సంస్థను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన వెల్లడించారు.

మంత్రాలు నేర్పుతానని మట్టుబెట్టాడు

- మూసీ వద్దకు వెళ్లాక మారిన మనసు
- ఒంటిపై ఉన్న బంగారం కోసం ఘర్షణ.. ఆపై ఇద్దరి దారుణహత్య
- అక్కాచెల్లెండ్ల హత్యకేసులో.. వెలుగుచూసిన కొత్త కోణం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: లంగర్‌హౌస్‌లో అక్కాచెల్లెండ్ల దారుణహత్యలో కొత్త కోణం వెలుగుచూసింది. మంత్రాలు నేర్పుతానంటూ వారిని మూసీ వద్దకు తీసుకెళ్లిన ఆ వ్యక్తి.. ఆ తర్వాత మనసు మార్చుకొని వారి ఒంటిపై ఉన్న బంగారం కోసం ఘర్షణ పడ్డాడు. బంగారం లాక్కొనే క్రమంలో వారిపై జరిపిన దాడిలో ఇద్దరు చనిపోయారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గిరి అనే వ్యక్తి బోనాల పండుగ సమయంలో శిగం ఊగుతుంటాడు. మృతుల్లో ఒకరైన యాదమ్మకు కూడా అప్పుడప్పుడు పూనకం వస్తుంటుంది. ఈ క్రమంలో ఈ నెల 21న యాదమ్మ, ఆమె చెల్లె సుమిత్రలకు మంత్రాలు నేర్పిస్తానని నమ్మించి ధాతునగర్ నుంచి లంగర్‌హౌస్ మూసీ కాలువ వద్దకు తీసుకొచ్చాడు. పసుపుతో ముగ్గులేసి వారి ముఖాలకు పసుపు రాసుకోవాలని చెప్పాడు. పసుపు రాసుకొంటుండగా వారి శరీరంపై ఉన్న బంగారునగలపై గిరి కన్ను పడింది. బంగారం తీసేయాలని బలవంతం చేయడంతో వాళ్లు ఒప్పుకోకపోవడంతో ఘర్షణ జరిగింది. నగలు లాక్కొనే ప్రయత్నంలో వారిద్దరినీ బండరాయితో కొట్టి చంపేశాడు. అనంతరం వారిని మూసీ కాలువలో పడేసి గిరి అక్కడి నుంచి జారుకొన్నాడు. మూసీ కాలువలో శవం ఉన్నట్టు స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఇద్దరు మహిళల మృతదేహాలను వెలికితీశారు. లంగర్‌హౌస్ రోడ్డుపై ఉన్న సీసీ కెమెరాల సాయంతో హంతకుడు గిరిని అదుపులోకి తీసుకొని విచారించగా ఈ విషయాలను వెల్లడించినట్టు తెలిసింది. కందుకూరు మండలం దెబ్బలగూడకు చెందిన అక్కాచెల్లెండ్లు సుమిత్ర, యాదమ్మ కుటుంబంతో కలిసి కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాపూర్ జనప్రియ ప్రాంతంలో నివసిస్తున్నారు. భర్త చనిపోవడంతో సుమిత్ర.. అక్క యాదమ్మ కుటుంబంతో కలిసి ఇక్కడే ఉంటున్నది. ఒకటిరెండురోజుల్లో జంటహత్యలకు సంబంధించి పూర్తిసమాచారం తెలిసే అవకాశాలున్నాయి.

ప్రధానితో ముఖాముఖికి 20 మందిఎంపిక



ఉపేందర్, శ్రీరాం శ్రీనివాసరావు

పాల్వంచ: ఢిల్లీలోని కల్కతోర స్టేడియంలో ఈ నెల 29న ప్రధాని నరేంద్రమోదీ పదోతరగతి విద్యార్థుల పరీక్షలపై నిర్వహించే 'పరీక్షపై చర్చా' ముఖాముఖి కార్యక్రమానికి రాష్ట్రం నుంచి 16 మంది విద్యార్థులు, ఒక ప్రధానోపాధ్యాయుడు, మరో ఉపాధ్యాయుడు, ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులు ఎంపికయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని కేటీపీఎస్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పీవీకే ఉపేందర్, సూర్యాపేట జిల్లాలోని మునగాల మండలంలోని నరసింహులగూడెం ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీరాం శ్రీనివాసరావుకు ప్రధానితో ముఖాముఖిలో పాల్గొనే అవకాశం దక్కింది. రాష్ట్రం నుంచి వెళ్లనున్న బృందానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన హెచ్ఎం ఉపేందర్ నేతృత్వం వహించనున్నారు. ఈ మేరకు వీరిద్దరూ శుక్రవారం హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

మే 12న కోమెడ్‌కే ప్రవేశ పరీక్ష

- ఆన్‌లైన్ నమోదుకు ఏప్రిల్ 19తుది గడువు

బంజారాహిల్స్: కర్ణాటక మెడికల్, డెంటల్, ఇంజినీరింగ్ కాలేజీల కన్సార్టియం (కోమెడ్‌కే), యూనిగేజ్ ప్రవేశ పరీక్ష మే 12న నిర్వహించనున్నట్టు ఎరా ఫౌండేషన్ సీఈవో మురళీధర్ తెలిపారు. కోమెడ్‌కే ద్వారా 21 ప్రైవేటు యూనివర్సిటీలు, 200 కాలేజీల్లో 40 వేల సీట్లను పొందవచ్చునని తెలిపారు. ఏప్రిల్ 19లోగా ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు.

నటి భానుప్రియపై ఫిర్యాదు

అమరావతి, నమస్తే తెలంగాణ: ప్రముఖ నటి భానుప్రియపై ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదుచేసింది. కొంతకాలంగా నిర్బంధించి లైంగిక వేధింపులకు గురిచేయడమే కాకుండా దొంగతనం అంటగడుతున్నారని సామర్లకోట మండలంలోని పండ్రవాడకు చెందిన ప్రభావతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. తన కూతురిని ఇంటికి పంపాలని అడిగితే దొంగతనం చేసిందని బెదిరించారని, భానుప్రియ సోదరుడు గోపాలకృష్ణ తన కుమార్తెను లైంగికంగా వేధిస్తున్నాడని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరింది. ప్రభావతి ఫిర్యాదును స్వీకరించిన సామర్లకోట పోలీసులు చైల్డ్‌లైన్ ద్వారా చెన్నై పోలీసులకు కేసును బదలాయించారు. కాగా, తనపై కేసు నమోదు అవడంపై స్పందించిన నటి భానుప్రియ.. ప్రభావతి కూతురు దొంగతనం చేసిన మాట వాస్తవమని, దొంగిలించిన వస్తువులు తీసుకొస్తానని చెప్పి వెళ్లి పోలీసులకు ఫిర్యాదుచేసిందన్నారు.

బస్‌స్టేషన్లలో మినీథియేటర్లు

- 23 చోట్ల స్థలాల గుర్తింపు
- టీఎస్‌ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) ఆర్థిక పరిపుష్టి కోసం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. సంస్థ ఖాళీ స్థలాల్లో పెట్రోల్ బంకులతోపాటు బస్‌స్టేషన్లలో మినీథియేటర్ల నిర్వహణపై దృష్టి సారించింది. మినీథియేటర్ల ఏర్పాటుకు ప్రాథమికంగా 23 స్థలాలను గుర్తించినట్లు ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ, టీఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ 15 స్థలాల్లో మినీ థియేటర్లను నిర్మించడానికి ముందుకు వచ్చిందని, వీటిద్వారా రూ.3.11 కోట్లమేర వార్షికాదాయం సమకూరుతుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబా ద్, నిర్మల్, కొల్లూరు, కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, ధర్మపురి, హుజూరాబాద్, సిరిసిల్ల, పెద్దపల్లి, జడ్చర్ల, షాద్‌నగర్, నర్సాపూర్, సంగారెడ్డి, నాగార్జునసాగర్, కోదాడ, ఆర్మూర్, బోధన్, చేవెళ్ల, తాండూర్, వికారాబాద్, స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటుకు స్థలాలను గుర్తించినట్లు వెల్లడించారు. ఆర్టీసీ కార్యదర్శి పురుషోత్తం ఆధ్వర్యంలో అధికారుల బృందం వాటి నిర్వహణ, పనితీరు వంటి అంశాలపై అధ్యయనం చేయనున్నట్లు చెప్పారు.



ఉర్దూ అకాడమీ క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉర్దూ అకాడమీ-2019 క్యాలెండర్‌ను గురువారం హజ్ హౌస్‌లో అకాడమీ చైర్మన్ రహీమొద్దీన్ అన్సారీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉర్దూను ప్రోత్సహించేందుకు అవార్డులను అందిస్తున్నామని, ఎంపికకు కమిటీని నియమించామన్నారు.



టీజీవో విశ్రాంత అధికారుల సంఘం డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రిటైర్డ్ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం క్యాలెండర్‌ను టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఎన్ మోహన్‌నారాయణ, కార్యదర్శి నర్సరాజు, రవీందర్, సలీమొద్దీన్, చంద్రశేఖర్, రామ్మోహన్, సీతారాంరెడ్డి, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో వచ్చే ఎన్నికల్లో ఒంటరిపోరు : బాబు

అమరావతి: ఏపీలో రాబోయే ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగాలని టీడీపీ భావిస్తున్నది. ఏపీలో టీడీపీతో పొత్తు లేకుండా ఎన్నికల్లో పోటీచేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజే గురువారం జాతీయపార్టీతో ఎలాంటి పొత్తు ఉండబోదని పార్టీ నాయకులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఏపీ సీఎం చంద్రబాబు సంకేతాలిచ్చారు. రాష్ట్రాల్లో స్థానిక పార్టీల అభీష్టం మేరకు ఎన్నికల్లో పొత్తు ఉంటుందని, జాతీయస్థాయిలో బీజేపీపై పోరు కొనసాగుతుందని తెలిపారు. కాపు రిజర్వేషన్ల అంశంపై వైసీపీ, బీజేపీ వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు.

అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్‌గా పీ వేమనారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్‌గా పీ వేమనారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు ఆయన సంగారెడ్డి మున్సిపాలిటీలో మెప్మా పరిపాలనాధికారిగా విధులను నిర్వహిస్తున్నారు. డిప్యుటేషన్ పద్ధతిన వెంటనే విధుల్లో చేరాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బ్యాలెట్‌తోనే ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్యాలెట్ పేపర్ ద్వారానే వచ్చే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని విపక్ష పార్టీల నేతలు డిమాండ్‌చేశారు. గురువారం ధర్నాచౌక్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో టీడీపీ, టీజేఎస్, సీపీఐ నేతలు మాట్లాడారు. ఈవీఎంలపై అనుమానాలు వచ్చినప్పుడు ఎందుకు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించరని ప్రశ్నించారు. బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరిపే వరకు ఉద్యమిస్తామని వెల్లడించారు. ఎన్నికల కమిషన్ తీరుపై హైకో ర్టు, సుప్రీంకోర్టుకు కూడా వెళ్లినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఈ ధర్నాలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీనేత మల్లు భట్టివిక్రమార్క, పార్టీ నేతలు డీకే అరుణ, పొన్నాల లక్ష్మయ్య, మర్రి శశిధర్ రెడ్డి, టీడీపీ నేతలు ఎల్ రమణ, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, సీపీఐ కార్యదర్శి చాడవెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఐఆర్సీటీసీ ఆన్‌లైన్ సేవల్లో మరిన్ని ఫీచర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఐఆర్సీటీసీ వెబ్‌సైట్ ప్రయాణికుల కోసం కొత్త ఫీచర్లు తీసుకొచ్చింది. అందులో ఆస్క్ దిశా చాట్‌బాట్, పోస్ట్‌పెయిడ్ ఫెసిలిటీ, ట్రావెల్ ఇన్సూరెన్స్, ఆన్‌లైన్ క్యాన్సిలేషన్, డెబిట్ కార్డు ట్రాంజాక్షన్, పుష్ నోటిఫికేషన్ అందుబాటులోకి తెచ్చింది. దిశా చాట్‌బాట్.. విచారణ కోసం సహకరిస్తుంది. పోస్ట్‌పెయిడ్ సౌకర్యంతో టికెట్లు బుక్‌చేసుకొని తర్వాత చెల్లింపులు చేయొచ్చు. ఎక్కువ ప్రయాణాలుచేసే వారికి నెల వ్యవధిలో 12 టికెట్లు తీసుకొనే అవకాశం కల్పించింది. ట్రావెల్ ఇన్సూరెన్స్ కింద రూ.10 లక్షల వరకు బీమా వర్తింపజేస్తున్నది. ఆన్‌లైన్ క్యాన్సలేషన్‌తో సులభంగా టికెట్ రద్దు చేసుకోవచ్చు. ఎలాంటి పేమెంట్ చార్జీలు లేకుండా డెబిట్‌కార్డు మీద రూ. లక్ష వరకు టికెట్ల కోసం చెల్లింపులు చేసే వెసులుబాటు ఇచ్చింది. పుష్ నోటిఫికేషన్ పేరుతో రైల్వేకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు వెబ్‌సైట్, మొబైల్ యాప్ అందించనుంది.

బాస్కెట్‌బాల్ చాంపియన్ తెలంగాణ జట్టు



హైదరాబాద్: అండర్-15 ఇంటర్నేషనల్ స్కూల్‌గేమ్స్-2019 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌ను రాష్ట్ర జట్టు నిలిచింది. పంజాబ్ రాష్ట్రం, జలంధర్‌లో ముగిసిన టోర్నీలో కెప్టెన్ గోన ప్రతీక్ అద్భుతమైన ఆటతీరుతో మన రాష్ట్ర జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అంతేకాదు మ్యాన్ ఆఫ్ ది టోర్నీ అవార్డును కూడా ప్రతీక్ అందుకున్నాడు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను హైదరాబాద్ స్టేట్ స్కూల్ కరస్పాండెట్ వాసిరెడ్డి అమర్‌నాథ్ జట్టు సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జట్టు కోచ్ ప్రభుచరణ్‌తోపాటు అండర్-15 జట్టు సభ్యులు శశాంక్, రోహిత్, జెనాయ్, రిషిక్, సాయితేజ, రోహిత్ రాజ్, ఆకాశ్, నిఖిల్ పాల్గొన్నారు.

నంబర్‌వన్ ఎవరిదో?

మహిళల సింగిల్స్ ఫైనల్లో ఒసాకా, క్విటోవా
గెలిచినోళ్లకు టాప్ ర్యాంక్
టైటిల్ పోరుకు నాదల్
సిట్సిపాస్ సంచలనాలకు తెర
ఆస్ట్రేలియన్ ఓపెన్



కత్తిపోటుకు వెరువని ధీరత్వం.. విమర్శలకు కుంగిపోని వ్యక్తిత్వం.. ఆటలో వెనుకబడుతున్నా.. వరుస పరాజయాలు వెక్కిరిస్తున్నా.. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో.. అంతకుమించిన పట్టుదలతో మళ్లీ టెన్నిస్ యవనికపై తళుక్కున మెరిసింది. కొత్తతరం నుంచి సవాళ్లు ఎదురవుతున్నా.. తనదైన రోజు కోసం ఎదురుచూసిన చెక్ రిపబ్లిక్ అమ్మాయి పెట్రా క్విటోవా తన ఆశలను నిజం చేసుకుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ చేరి మళ్లీ ఆటతోనే తన దమ్ము చూపించింది. ఫైనల్ గెలిస్తే ప్రపంచ నంబర్‌వన్ సొంతంకానున్న నేపథ్యంలో మహిళల టైటిల్ పోరుపై ఉత్కంఠ పెరిగింది. యూఎస్ ఓపెన్ ట్రోఫీతో అందరి చూపూ తనవైపు తిప్పుకున్న జపాన్ చిన్నది నవోమి ఒసాకా కూడా తుది దశకు చేరింది. జపాన్ చరిత్రలో తొలిసారి గ్రాండ్‌స్లామ్ సాధించిన మహిళగా చరిత్ర సృష్టించిన ఒసాకా.. ఈసారి ట్రోఫీతోపాటు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌పై కన్నేసింది. పురుషుల సింగిల్స్‌లో గ్రీస్ యువ సంచలనం సిట్సిపాస్ దూకుడుకు ముగింపు పలికిన రఫెల్ నాదల్ ఫైనల్‌కు చేరుకున్నాడు. అన్ని కుదిరితే ఫైనల్లో నాదల్‌తో జొకోవిచ్ తలపడడం ఖాయంగా కనిపిస్తున్నది.

మెల్‌బోర్న్: రెండువారాలుగా టెన్నిస్ అభిమానులను అలరిస్తున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ తుది అంకానికి చేరింది. జపాన్ తార నవోమి ఒసాకా, చెక్ భామ పెట్రా క్విటోవా మహిళల సింగిల్స్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన తొలి సెమీస్ మ్యాచ్‌లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన పెట్రా క్విటోవా 7-6(7-2),6-2 స్కోరుతో అమెరికా టెన్నిస్ ప్లేయర్ డానియెల్ కొలిన్స్ పోరాటానికి తెరదించింది. మరోవైపు హోరాహోరీగా సాగిన సెమీస్ మ్యాచ్‌లో ఒసాకా 6-2,4-6,6-4 స్కోరుతో చెక్ రిపబ్లిక్‌కు చెందిన కరోలినా ప్లిస్కోవాను ఓడించింది. మెల్‌బోర్న్ పార్క్ ఆఖరాటలో ట్రోఫీ ఎవరు గెలిస్తే వారికి వచ్చేవారం ప్రకటించే డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ హోదా దక్కనుంది. అంతేకాదు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ చేరుకోవడం వీరిద్దరికీ ఇదే తొలిసారి కావడం విశేషం. చివరి ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్ గెలుచుకుని ..ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ చేరిన అరుదైన రికార్డును ఒసాకా అందుకుంది. సెరెనా తర్వాత ఒసాకా మాత్రమే ఈ ఘనత అందుకోవడం విశేషం. కాగా, కెరీర్‌లో రెండు వింబుల్డన్ టైటిల్స్ గెలుచుకున్న క్విటోవా కూడా తొలిసారిగా ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ చేరింది. దీంతో వీరిద్దరి మధ్య జరిగే ఫైనల్ సమరం ఆసక్తిని కలిగిస్తున్నది. కాగా, పురుషుల తొలిసెమీస్‌లో స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ ఫైనల్ చేరాడు. ఫెదరర్‌ను ఓడించడంతోపాటు సంచలన విజయాలతో సెమీస్‌కు దూసుకొచ్చిన గ్రీస్ యువ యోధుడు స్టెఫనోస్ సిట్సిపాస్‌పై 6-2,6-4,6-0తో వరుససెట్లలోవిజయం సాధించాడు. సిట్సిపాస్ సెమీస్‌లో నాదల్‌కు ఏమాత్రం పోటీనివ్వలేకపోయాడు. మంచి ఫామ్‌లో ఉన్న స్విస్ టెన్నిస్ యోధుడు రోజర్ ఫెదరర్‌ను ఓడించిన సిట్సిపాస్..నాదల్ ముందు తేలిపోయాడు. టాప్‌సీడ్ జొకోవిచ్, ఫ్రాన్స్ సంచలనం లూకాస్ పౌలే మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో నాదల్.. ఫైనల్లో తలపడనున్నాడు.



క్విటోవా



నాదల్

క్విటోవా జోరు..

కత్తిపోటు ఘటనతో తన పనైపోయిందన్న విమర్శలకు ఎనిమిదో సీడ్ పెట్రా క్విటోవా దీటైన జవాబిచ్చింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి సెమీస్‌లో అమెరికా అమ్మాయి,35వ సీడ్ డానియెల్ కొలిన్స్‌ను ఓడించిన క్విటోవా ఫైనల్ చేరింది. రాడ్‌లేవర్ ఎరీనాలో వేడిని తట్టుకుంటూ క్విటోవా వరుససెట్లలో ప్రత్యర్థిని మట్టి కరిపించింది. దాదాపుగా నాలుగేండ్ల అనంతరం గ్రాండ్‌స్లామ్ ఫైనల్ చేరడం తనకు ఇంకా నమ్మశక్యంగా లేదని విజయానంతరం క్విటోవా వ్యాఖ్యానించడం విశేషం. కొలిన్స్ పోటాపోటీగా ఆడడంతో తొలి సెట్‌లో ఇద్దరి మధ్య హోరాహోరీ పోరాటం సాగింది. 3-2 స్కోరుతో కొలిన్స్ ఆధిక్యంలో ఉన్న దశలో క్విటోవా సర్వీస్‌ను బ్రేక్ చేసేలా కనిపించింది. ఆ సమయంలో తనదైన క్రాస్‌కోర్ట్ షాట్‌తో పాయింట్ సాధించి స్కోరును సమం చేసిన క్విటోవా మ్యాచ్‌లో మరింత ఉత్కంఠను పెంచింది. ఇద్దరూ పోటాపోటీగా ఆడుతుండంతో తొలిసెట్ టైబ్రేకర్‌కు దారి తీసింది. టై బ్రేకర్‌లో క్విటోవా వేగానికి కొలిన్స్ వద్ద సమాధానం లేకుండా పోయింది. కళ్లు చెదిరే సర్వీస్‌తోపాటు ట్రేడ్‌మార్క్ రిటర్న్స్‌తో 7-2 తేడాతో టైబ్రేకర్‌లో తొలిసెట్‌ను క్విటోవా గెలుచుకుంది. అనంతరం రెండోసెట్‌లో అప్పటికే అలిసిపోయిన కొలిన్స్ పూర్తిగా చేతులెత్తేసింది. దీంతో సునాయాసంగా 6-2 స్కోరుతో క్విటోవా సెట్‌తోపాటు మ్యాచ్‌ను గెలుచుకుని కెరీర్‌లో తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ చేరింది. 'ఫైనల్ చేరుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఫలితంతో సంబంధం లేకుండా ఫైనల్ మ్యాచ్ ఆడాలని నిర్ణయించుకున్నాను' అని మ్యాచ్ అనంతరం క్విటోవా తెలిపింది. ఈసారి ఏడుస్తావా అన్న ఇంటర్వ్యూయర్ ప్రశ్నకు అంత భావోద్వేగం ఇప్పుడు లేదంటూ క్విటోవా సరదాగా బదులివ్వడం విశేషం.

ఒసాకా దూకుడు

వరుసగా రెండో గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు దూసుకెళ్లిన నవోమి ఒసాకా ట్రోఫీకి అడుగుదూరంలో నిలిచింది. 2018 ఏడాది చివరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్ గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్‌లోనూ ఫైనల్ చేరి తనకు ఎదురులేదని నిరూపించింది. క్వార్టర్ ఫైనల్లో సెరెనాను ఓడించిన కరోలినా ప్లిస్కోవాను ఓడించి ఒసాకా తడాఖా చాటింది. తొలి సెట్ ఆరంభంలోనే ప్లిస్కోవాపై దూకుడు ప్రదర్శించిన ఒసాకా మూడోగేమ్‌లోనే బ్రేక్ సాధించి 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. గురితప్పని గ్రౌండ్‌స్ట్రోకులతో కచ్చితమైన లైన్‌పై ఒసాకా అద్భుతంగా ఆడుతూ పాయింట్లు సాధించి 5-2తో స్పష్టమైన ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలిసెట్‌లో ఒసాకా 16 విన్నర్లు సాధించగా.. ప్లిస్కోవా కేవలం 4 విన్నర్లతో సరిపెట్టుకుంది. తొలిసెట్ ఓటమితో ప్లిస్కోవా కాస్త దూకుడు ప్రదర్శించింది. ఒసాకా గ్రౌండ్ స్ట్రోకులకు బదులిస్తూ అద్భుతమైనా ఆటతీరుతో రెండోసెట్‌ను దక్కించుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడోసెట్‌కు మళ్లించింది. కాగా, మూడోసెట్లో ఒసాకా ఏస్‌లతో ప్లిస్కోవాను హడలెత్తించింది. సుదీర్ఘ ర్యాలీలతో పాయింట్లు రాబడుతున్న ప్లిస్కోవాను నిలువరిస్తూ సర్వీసులతో హడలెత్తించింది. మూడోగేమ్‌లో 2 ఏస్‌లతోపాటు ఫోర్‌హ్యాండ్ విన్నర్‌తో 3-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ దశలో ఒసాకా సర్వీస్‌ను బ్రేక్ చేసిన ప్లిస్కోవా మ్యాచ్‌లో పైచేయిని ప్రదర్శించాలని ప్రయత్నించినా ఒసాకా సాగనివ్వలేదు. తిరుగులేని ఫోర్‌హ్యాండ్, బలమైన సర్వీస్‌లతో మూడోసెట్‌తోపాటు మ్యాచ్‌ను గెలుకుని కెరీర్‌లో తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ చేరింది. క్విటోవాతో జరిగే ఫైనల్లో ఒసాకా విజయం సాధిస్తే..ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ అందుకున్న తొలి జపాన్ టెన్నిస్ ప్లేయర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించనుంది.

పాండ్యా, రాహుల్‌కు ఊరట

సస్పెన్షన్ ఎత్తివేసిన సీవోఏ ■ న్యూజిలాండ్‌కు పాండ్యా!



న్యూఢిల్లీ: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన భారత క్రికెటర్లు హర్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌కు ఉపశమనం లభించింది. ఈ ఇద్దరిపై కొనసాగుతున్న సస్పెన్షన్‌ను బీసీసీఐ పరిపాలన కమిటీ (సీవోఏ) గురువారం ఎత్తేసింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. అయితే ఇద్దరు క్రికెటర్లపై విచారణ మాత్రం కొనసాగుతుందని ప్రకటించింది. సస్పెన్షన్ తొలగిపోవడంతో పాండ్యా వీలైనంత త్వరగా న్యూజిలాండ్ బయలుదేరి వెళ్లనున్నాడు. రాహుల్ మాత్రం దేశవాళీ సర్క్యూట్ లేదా ఇంగ్లండ్ లయన్స్‌తో తలపడే భారత్-ఎ జట్టుతో కలిసి మ్యాచ్‌లు ఆడే అవకాశాలున్నాయి. ఒకవేళ కర్ణాటక రంజీ ఫైనల్‌కు చేరుకుంటే మయాంక్ అగర్వాల్‌తో కలిసి రాహుల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. 'అమికస్ క్యూరీ పీఎస్ నర్సింహ సూచనల మేరకు క్రికెటర్లపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఈనెల 11న విధించిన ఈ సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేస్తున్నాం. అంబుడ్స్‌మన్ నియామకం పెండింగ్‌లో ఉంది. సుప్రీంకోర్టు దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అంబుడ్స్‌మన్‌ను నియమించిన తర్వాత ఈ ఇద్దరిపై విచారణ కొనసాగుతుంది' అని సీవోఏ పేర్కొంది. మరోవైపు క్రికెటర్ల అంశంపై వచ్చే నెల 5న విచారణ చేపట్టాలని సుప్రీం నిర్ణయించింది.

బెన్ స్టోక్స్ ఆడుతున్నాడుగా..

అంబుడ్స్‌మన్ నియామకం ఆలస్యం అవుతుండటంతో.. పాండ్యా, రాహుల్‌ను తిరిగి క్రికెట్ ఆడనివ్వాలని ఇటీవల బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా.. సీవోఏకు లేఖ రాశారు. అందుకు అనుగుణంగా సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని విజ్ఞప్తి చేశాడు. 'పాండ్యా, రాహుల్ అంశం పాలకుల మధ్య చిచ్చుపెట్టే విధంగా మారకూడదు. ఎందుకంటే ఇద్దరు క్రికెటర్లకు మ్యాచ్ ప్రాక్టీస్ చాలా అవసరం. ప్రపంచకప్‌నకు సమయం లేదు. కాబట్టి ఈ ఇద్దరిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి. ఇంగ్లండ్ ఆటగాడు బెన్ స్టోక్స్‌పై కోర్టులో కేసు నడుస్తున్నా క్రికెట్ ఆడుతున్నాడు. మరి పాండ్యా, రాహుల్‌కు ఎందుకు వర్తించదు' అని ఖన్నా వ్యాఖ్యానించారు. అంతకుముందు క్రికెటర్ల భవితవ్యాన్ని తేల్చేందుకు ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎమ్) ఏర్పాటు చేయాలని 14 రాష్ట్ర సంఘాలు డిమాండ్ చేసినా ఖన్నా పరిగణనలోకి తీసుకోలేదు. సుప్రీంకోర్టు పరిధిలో ఉన్న అంశంపై చర్చిస్తే కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని తోసిపుచ్చారు.



క్వార్టర్స్‌లో సింధు, సైనా

శ్రీకాంత్ కూడా..

జకార్తా: ఇండోనేషియా మాస్టర్స్‌లో.. భారత స్టార్ షట్లర్ల జైత్రయాత్ర కొనసాగుతూనే ఉన్నది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్‌లో రెండోసీడ్ సింధు 23-21, 21-7తో జార్జియా తున్‌జుంగ్ (ఇండోనేషియా)పై గెలిచింది. 37 నిమిషాల పోరులో తున్‌జుంగ్.. తొలి గేమ్‌లో తెలుగమ్మాయికి గట్టిపోటీ ఇచ్చింది. అయినా బలమైన సర్వీస్‌లు, సుదీర్ఘమైన ర్యాలీలు, నెట్ వద్ద మెరుగైన డ్రాప్స్ వేస్తూ ప్రత్యర్థిని కట్టడి చేసింది. ఏకపక్షంగా సాగిన రెండో సెట్‌లో సింధు కొట్టిన క్రాస్ కోర్టు విన్నర్లకు తున్‌జుంగ్ జవాబు కూడా చెప్పలేకపోయింది. తాజా విజయంతో తున్‌జుంగ్‌తో ముఖాముఖి రికార్డును సింధు 5-0కు పెంచుకుంది. మరో మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ సైనా నెహ్వాల్ 21-17, 21-15తో ఫిత్రిని ఫిత్రిని (ఇండోనేషియా)ను చిత్తు చేసి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. దీంతో ముఖాముఖి రికార్డును 5-0కు తీసుకెళ్లింది. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 21-14, 21-9తో కెంటా నిషిమాటో (జపాన్)పై గెలిచి క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టాడు. నిషిమాటోతో జరిగిన చివరి మ్యాచ్‌లో ఓడిన భారత ప్లేయర్.. ఈసారి పట్టు వదలకుండా పోరాడుతూ ప్రతీకారం తీర్చుకున్నాడు. 2-5తో తొలి గేమ్‌ను ఆరంభించినా.. తర్వాతి దశలో వరుస పాయింట్లతో 11-8 ఆధిక్యంలోకి వెళ్లాడు. తర్వాత అదే జోరుతో గేమ్‌ను చేజిక్కించుకున్నాడు. రెండో గేమ్‌లో 6-0 ఆధిక్యం నుంచి 18-8 వరకు ఎదురులేకుండా దూసుకుపోయాడు. ఫలితంగా అర్ధగంటలో ప్రత్యర్థికి చెక్ పెట్టేశాడు. పురుషుల డబుల్స్‌లో మను అత్రి-సుమిత్ రెడ్డి 14-21, 21-17, 10-21తో కిమ్ అస్ట్రాప్-సుకర్ప్ రాస్‌ముస్సేన్ (డెన్మార్క్) చేతిలో ఓడారు

మా మధ్య సమన్వయం కుదిరింది!

చాహల్‌పై కుల్దీప్ ప్రశంసలు



నేపియర్: ఓ ఎండ్‌లో చాహల్ బౌలింగ్ చేయకపోతే ఏదో కోల్పోయినట్లు ఉంటుందని మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్.. సహచరుడిపై ప్రశంసలు కురిపించాడు. తమ మధ్య సమన్వయం బాగా కుదిరిందని, ఒకవేళ చాహల్ లేకపోతే ఏదీ తోచదన్నాడు. 'నీవు ఆడకపోతే చాలా అంశాలు మరుగున పడిపోతాయి. మా ఇద్దరి బౌలింగ్‌ను, పిచ్‌ను పరస్పరం బాగా అర్థం చేసుకున్నాం. మా ఇద్దరి మధ్య అంతా బాగా సమన్వయం కుదిరింది. ఒక్కోసారి నేను ముందుగా బౌలింగ్‌కు వస్తే కొన్నిసార్లు అతను వస్తాడు. పరిస్థితులను బట్టి ఇది ఉంటుంది. ఏదేమైనా పిచ్ ఎలా ఉంది... బ్యాట్స్‌మన్ ఎలా ఆడుతున్నాడు అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని మా వ్యూహాలు రచిస్తాం. చాహల్, నేను ఒకే రకమైన ఫలితాన్ని రాబడుతాం. అందుకే బ్యాట్స్‌మెన్ బాగా ఇబ్బందిపడుతారు. దక్షిణాఫ్రికాలో మేం చాలా వికెట్లు తీశాం. భారత్‌లో మాకు ఎదురులేదు. ఇప్పుడు కివీస్‌లోనూ సత్తా చాటాలని చూస్తున్నాం' అని బీసీసీఐ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కుల్దీప్ వ్యాఖ్యానించాడు. టీమ్ఇండియా పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో అత్యంత కీలకంగా మారిన చాహల్-కుల్దీప్ ఇప్పటివరకు 36 మ్యాచ్‌లు ఆడారు. ఇందులో చాలా వాటిని ఏకపక్షంగా గెలిపించారు. అయితే ఈ మధ్యకాలంలో ఇద్దరిలో ఒక్కర్నే ఆడించి జడేజాతో చేసిన ప్రయోగాలన్నీ బెడిసికొట్టాయి. దీంతో ఇంగ్లండ్‌లో జరుగనున్న వన్డే వరల్డ్‌కప్‌లోనూ ఈ ఇద్దరు మరోసారి కీలకం కానున్నారు.




పంజాబ్, బటిండాలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే 31వ జాతీయ జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్న బాల బాలికల జట్లు. వరంగల్‌లో ప్రాబబుల్స్‌కు శిక్షణ ముగిసిన అనంతరం గురువారం జట్టు సభ్యులను ప్రకటించిన రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మహ్మద్ ఖాజా ఖాన్, జట్టు చీఫ్‌కోచ్ మనోజ్ కుమార్ తదితరులు.

శ్రీలంక 144 ఆలౌట్

కుమ్మేసిన కమిన్స్, రిచర్డ్‌సన్

బ్రిస్బేన్: శ్రీలంకతో గురువారం ప్రారంభమైన తొలి డేనైట్ టెస్ట్‌లో ఆసీస్ పేసర్లు చెలరేగిపోయారు. కమిన్స్ (4/39), అరంగేట్రం కుర్రాడు రిచర్డ్‌సన్ (3/26) నిప్పులు చెరగడంతో.. తొలి రోజు లంక తొలి ఇన్నింగ్స్‌లో 56.4 ఓవర్లలో144 పరుగులకు కుప్పకూలింది. డిక్వెల్లా (64) ఒంటరిగా పోరాటం చేసినా.. సహచరులు పెవిలియన్‌కు క్యూ కట్టారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన లంకకు ఓపెనర్లు కరుణరత్నే (24), తిరిమన్నే (12) శుభారంభాన్నివ్వలేకపోయారు. ఆతిథ్య పేసర్ల బౌన్స్, స్వింగ్‌ను ఎదుర్కోలేక చండిమల్ (5), మెండిస్ (14), డి సిల్వా (5) తక్కువ స్కోరుకే వెనుదిరగడంతో లంక 66 పరుగులకే సగం జట్టు పెవిలియన్‌కు చేరుకుంది. ఈ దశలో డిక్వెల్లా, సిల్వా (9) ఆరో వికెట్‌కు 25 పరుగులు జోడించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 25 ఓవర్లలో 2 వికెట్లకు 72 పరుగులు చేసింది. హారిస్ (40 బ్యాటింగ్), లైయన్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. బర్న్స్ (15), ఖవాజ (11) తొందరగా ఔటయ్యారు.

క్రికెట్‌కు బోథా గుడ్‌బై



హోబర్ట్: దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ జాన్ బోథా.. క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. తక్షణమే ఇది అమల్లోకి వస్తుందని చెప్పాడు. 2016లో ఆస్ట్రేలియా పౌరసత్వం తీసుకున్న 36 ఏండ్ల బోథా.. ప్రస్తుతం ఆసీస్ టీ20 లీగ్‌లో హోబర్ట్ హారికేన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. బుధవారం సిడ్నీ సిక్సర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒక్క వికెట్ కూడా తీయలేకపోవడంతో నిరాశ చెంది ఆటకు గుడ్‌బై చెప్పాడు. ఈ మ్యాచ్‌లో హరికేన్స్ 9 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ సీజన్‌లో హరికేన్స్ తరపున అన్ని మ్యాచ్‌లు (10) ఆడిన బోథా బౌలింగ్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. 2005 నుంచి 2012 మధ్యకాలంలో దక్షిణాఫ్రికా తరపున 5 టెస్టులు, 78 వన్డేలు, 40 టీ20లు ఆడిన ఈ ఆల్‌రౌండర్.. ఒకానొక దశలో ప్రొటీస్ జట్టుకు కెప్టెన్‌గా కూడా వ్యవహరించాడు. 2009లో ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌ను 4-1తో గెలిపించి సఫారీ జట్టుకు నంబర్‌వన్ ర్యాంక్‌ను సాధించిపెట్టాడు.

మందన మెరిసెన్..

కివీస్‌పై భారత మహిళల జట్టు విజయం ■ రాణించిన రొడ్రిగ్స్



మందన (105)



రొడ్రిగ్స్ (81★)

నేపియర్: భారత పురుషుల జట్టును స్ఫూర్తిగా తీసుకున్న మహిళల టీమ్ కూడా న్యూజిలాండ్ గడ్డపై అదరగొట్టింది. ఓపెనర్లు స్మృతి మందన (104 బంతుల్లో 105; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), రొడ్రిగ్స్ (94 బంతుల్లో 81 నాటౌట్; 9 ఫోర్లు) దంచికొట్టడంతో.. ఐసీసీ చాంపియన్‌షిప్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి వన్డేలో టీమ్ఇండియా 9 వికెట్ల తేడాతో కివీస్‌పై గెలిచింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 48.4 ఓవర్లలో 192 పరుగులకు ఆలౌటైంది. సుసి బేట్స్ (36) టాప్ స్కోరర్. భారత స్పిన్ ద్వయం పూనమ్ యాదవ్ (3/42), ఏక్తా బిష్త్ (3/32) టర్నింగ్ మ్యాజిక్‌ను అర్థం చేసుకోలేక కివీస్ విలవిలలాడింది. పూనమ్ స్వల్ప విరామాల్లో కెప్టెన్ సాటెర్త్‌వైట్ (31), లౌరెన్ డౌన్ (0), అమిలియా కెర్ (28) వికెట్లను పడగొట్టడంతో ఆతిథ్య జట్టు పుంజుకోలేకపోయింది. డివైన్ (28), బేట్స్ తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించి శుభారంభాన్నిచ్చినా.. మిడిలార్డర్ వైఫల్యం భారీ స్కోరుకు అడ్డంకిగా నిలిచింది. 193 పరుగుల లక్ష్యాన్ని భారత్ 33 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి ఛేదించింది. కివీస్ బౌలింగ్‌లో పదును లేకపోవడంతో టీమ్ఇండియా ఓపెనర్లు రొడ్రిగ్స్, మందన బౌండరీల వర్షం కురిపించారు. ఎలాంటి బౌలరైనా లెక్క చేయకుండా పరుగుల వరద పారించారు. ఈ ఇద్దరు తొలి వికెట్‌కు 32.2 ఓవర్లలో 190 పరుగులు జోడించడంతో టీమ్ఇండియా విజయం నల్లేరు మీద నడకగా మారింది. కివీస్‌పై ఓపెనింగ్‌లో ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం కావడం విశేషం. ఈ క్రమంలో మందన కెరీర్‌లో నాలుగో సెంచరీ (101 బంతుల్లో) సాధించగా, రొడ్రిగ్స్ తొలి అర్ధసెంచరీ (61 బంతుల్లో)తో సత్తా చాటింది. గెలువడానికి మరో మూడు పరుగులు అవసరమైన దశలో కెర్ బౌలింగ్‌లో మందన ఔటైనా.. రొడ్రిగ్స్, దీప్తి శర్మ (0 నాటౌట్) మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు. తాజా విజయంతో భారత్‌కు 2 పాయింట్లు లభించాయి. ఇరుజట్ల మధ్య రెండో వన్డే మౌంట్ మంగనుయ్‌లో మంగళవారం జరుగనుంది.

కొచ్చర్‌పై ఎఫ్‌ఐఆర్

దీపక్‌తోపాటు ధూత్‌పైనా నమోదు చేసిన సీబీఐ • మరికొన్ని సంస్థలపై కూడా..



న్యూఢిల్లీ, జనవరి 24: ఐసీఐసీఐ బ్యాంక్-వీడియోకాన్ గ్రూప్ రుణం కేసు విచారణను కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ వేగవంతం చేసింది. బ్యాంక్ మాజీ సీఈవో చందా కొచ్చర్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. మోసం, అవినీతి ఆరోపణలపై చందా కొచ్చర్‌తోపాటు ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూప్ ఎండీ వేణుగోపాల్ ధూత్‌లపైనా సెంట్రల్ ఏజెన్సీ ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసింది. దీపక్‌కు చెందిన నూపవర్ రెన్యువబుల్స్ సంస్థతోపాటు సుప్రీం ఎనర్జీ, వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, వీడియోకాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పేర్లను ఈ ఎఫ్‌ఐఆర్‌లో సీబీఐ పేర్కొన్నది. అవినీతి నిరోధక చట్టం నిబంధనలు, నేరపూరిత కుట్రకు సంబంధించి భారత శిక్షాస్మృతి (ఐపీసీ) ప్రకారం వివిధ సెక్షన్ల కింద బుధవారం రాత్రి పొద్దుపోయాక ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేశామని సీబీఐ వర్గాలు గురువారం వెల్లడించాయి. వీడియోకాన్ గ్రూప్‌నకు రుణాల మంజూరులో చందా కొచ్చర్ క్విడ్‌ప్రోకో (నీకిది-నాకది) ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. బ్యాంకింగ్ నిబంధనలను ఉల్లంఘించి స్వప్రయోజనాల కోసం కొచ్చర్.. వీడియోకాన్ గ్రూప్‌నకు రూ.3,250 కోట్ల రుణాలను మంజూరు చేశారని ఆరోపణలుండగా, ఈ క్రమంలోనే బ్యాంక్ ఎండీ, సీఈవో పదవులనూ ఆమె కోల్పోవాల్సి వచ్చిన సంగతీ విదితమే. రుణం జారీలో అవకతవకల కారణంగా బ్యాంక్‌కు రూ.1,730 కోట్ల నష్టం వాటిల్లినట్లు సీబీఐ వర్గాలు పేర్కొంటున్నాయి.

కామత్, మరికొందరిపైనా నజర్

ఈ కేసులో బ్యాంకింగ్ పరిశ్రమలోని మరికొందరిపైనా సీబీఐ దృష్టి సారించడం గమనార్హం. వీడియోకాన్ గ్రూప్, దాని అనుబంధ సంస్థలకు రూ.1,875 కోట్ల రుణాలు ఇవ్వడంలో వీరి పాత్ర కూడా ఉండటమే ఇందుకు కారణం. ఈ క్రమంలోనే ఐసీఐసీఐ బ్యాంక్ ప్రస్తుత సీఈవో సందీప్ బక్షితోపాటు సంజయ్ చటర్జీ, జరీన్ దారువాలా, రాజీవ్ సభర్వాల్, కేవీ కామత్, హోమీ ఖుస్రోఖాన్‌లపై అధికారులు కన్నేశారు. వీరంతా కూడా ఐసీఐసీఐ బ్యాంక్ రుణ మంజూరు కమిటీలో ఉన్నారు. వీడియోకాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌తోపాటు వీడియోకాన్ గ్రూప్‌లోని మరో నాలుగు సంస్థలైన మిల్లేనియం అప్లియెన్సెస్, స్కై అప్లియెన్సెస్, టెక్నో ఎలక్ట్రానిక్స్, అప్లికాంప్ ఇండియాలకు 2009 జూన్ నుంచి 2011 అక్టోబర్ మధ్య రూ.1,875 కోట్ల విలువైన ఆరు రుణాలకు ఈ కమిటీ క్లియరెన్స్ ఇచ్చినట్లు 2017 డిసెంబర్‌లో చేసిన ప్రాథమిక విచారణలో సీబీఐ గుర్తించింది. 2009 ఆగస్టు 26న వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్‌కు రూ.300 కోట్లు, 2011 అక్టోబర్ 31న వీడియోకాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు రూ.750 కోట్ల రుణ మంజూరుల్లో కొచ్చర్ కూడా కమిటీలో ఉన్నట్లు సీబీఐ పేర్కొన్నది. రూ.300 కోట్ల రుణం 2009 సెప్టెంబర్ 7న వీడియోకాన్‌కు అందిందని, ఆ మరుసటి రోజే సుప్రీం ఎనర్జీ ద్వారా నూపవర్ రెన్యువబుల్స్‌కు ధూత్ రూ.64 కోట్లను బదిలీ చేశారని సీబీఐ ఎఫ్‌ఐఆర్‌లో వివరించింది. ఈ రుణాలన్నీ కూడా బ్యాంక్ మొండి బకాయిల్లో చేరాయని సీబీఐ చెబుతున్నది. బ్యాంక్‌కు రూ.1,730 కోట్ల నష్టం వాటిల్లిందంటున్నది.

ముంబై, ఔరంగాబాద్‌ల్లో తనిఖీలు

తాజా ఎఫ్‌ఐఆర్ నేపథ్యంలో ముంబై, ఔరంగాబాద్‌ల్లోని వీడియోకాన్ గ్రూప్, నూపవర్ రెన్యువబుల్స్ సంస్థలకు చెందిన కార్యాలయాల్లో సీబీఐ అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. గురువారం వేకువజామునే ఈ సోదాలు మొదలవగా, రెండు నగరాల్లోని నాలుగు చోట్ల క్షుణ్ణంగా పరిశీలించారు. ఒకప్పుడు ధూత్ ప్రమోటర్‌గా వ్యవహరించిన సుప్రీం ఎనర్జీ ఆఫీసుల్లోనూ తనిఖీలు జరిగాయి. చందా కొచ్చర్.. వీడియోకాన్‌కు రుణాలు మంజూరు చేసినందుకుగాను దీపక్ సంస్థల్లో ధూత్ పెట్టుబడులు పెట్టారని, ఆ తర్వాత వాటిని చాలా తక్కువ ధరకు కొచ్చర్ కుటుంబానికే అమ్మేశారని విచారణల్లో వెలుగుచూసిన విషయం తెలిసిందే.

చర్యల్లో జాప్యమెందుకు?

ఆర్బీఐ.. బ్యాంకింగ్ రంగంలో పక్షపాత ధోరణిని కనబరుస్తున్నదని ప్రభుత్వ బ్యాంకర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కొచ్చర్‌పై చర్యలకు ఆలస్యమెందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ బ్యాంకుల్లో వెంటనే చర్యలు తీసుకుంటున్నారని, ప్రైవేట్ బ్యాంకులపై ప్రేమేలని నిలదీశారు.

సూచీలకు స్వల్ప లాభం



భారీ హెచ్చుతగ్గుల మధ్య ట్రేడ్ అయిన స్టాక్‌మార్కెట్లు చివరికి యెస్‌బ్యాంక్, రిలయన్స్, ఐటీసీ షేర్ల ర్యాలీతో స్వల్పలాభాలతో ముగిశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ దాదాపు 260 పాయింట్లమేర హెచ్చుతగ్గులకు గురైంది. 36,146 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ ఆ వెంటనే 36,000 స్థాయికి దిగువకు పతనం అయింది. మధ్యాహ్నం తర్వాత హెవీ వెయిట్ షేర్లలో వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో 86.63 పాయింట్ల లాభంతో 36,195.10 వద్ద ముగిసింది. నిఫ్టీ 18.30 పాయింట్ల లాభంతో 10,849.80 వద్ద ముగిసింది. యెస్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ సీఈవోగా రాణా కపూర్ స్థానంలో డాయిష్ బ్యాంక్‌కు చెందిన రవ్‌నీత్ గిల్ నియామకం జరగడంతో పాటు ఫలితాలు కూడా వెల్లడించడంతో 14,32 శాతం లాభపడి నిఫ్టీలో టాప్ గెయినర్‌గా ఉంది. మార్కెట్ గత రెండు నెలలుగా 10985 స్థాయిలో ఉన్న నిరోధక స్థాయిని అధిగమించలేక స్వల్ప రేంజ్‌లోనే ట్రేడ్ అవుతున్నది. మార్కెట్‌ను నిరోధక స్థాయిని అధిగమించేలా తీసుకువెళ్లగల పాజిటివ్ ట్రిగ్గర్స్ ఏవీ మార్కెట్లో లేకపోవడంతో పాటు మరో వారం రోజుల్లో మధ్యంతర బడ్జెట్ కూడా ఉన్నందున కొత్త పొజిషన్లకు ఇన్వెస్టర్లు దూరంగా ఉంటూ లాభాల స్వీకరణకే ప్రాధాన్యత ఇస్తున్నారు. రూపాయి మారకం విలువ బలహీనపడడంతో ఐటీ షేర్లు ఈరోజు కూడా డిమాండ్‌లో ఉన్నాయి. అలాగే రియల్ ఎస్టేట్, పీఎస్‌యూ బ్యాంకుల షేర్లు కూడా లాభాలను ఆర్జించాయి. రియల్టీ ఇండెక్స్ 2.17 శాతం లాభపడగా, ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్‌లు 0.56 శాతం చొప్పున లాభపడ్డాయి. ఆటో ఇండెక్స్ 0.86 శాతం, ఫార్మా 0.58 శాతం, మెటల్ 0.12 శాతం చొప్పున నష్టపోయాయి. మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 0.34 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.37 శాతం మేర నష్టపోయాయి. ఎన్‌ఎస్‌ఈలో మొత్తం 1175 షేర్లను నష్టపోగా, 590 షేర్లు మాత్రమే లాభాలు గడించాయి. ఎఫ్‌ఐఐలు రూ. 94.45 కోట్ల అమ్మకాలు జరపగా, డీఐఐలు రూ. 389 కోట్ల కొనుగోళ్లు జరిపారు.

యెస్ బ్యాంక్ చీఫ్‌గా రవ్‌నీత్ గిల్

బ్యాంక్ కో-ఫౌండర్‌గా కొనసాగనున్న రాణా కపూర్



ముంబై, జనవరి 24: దేశంలో ఐదో అతిపెద్ద ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థయైన యెస్ బ్యాంక్ నూతన అధిపతి నియామకం ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చింది. జర్మనీకి చెందిన డాయిష్ బ్యాంక్ ఇండియా అధిపతిగా విధులు నిర్వహిస్తున్న రవ్‌నీత్ సింగ్ గిల్‌ను బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా నియమించుకున్నది. మార్చి 1 కంటే ముందే ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తున్నది. రిజర్వు బ్యాంక్ ఆదేశాల నేపథ్యంలో ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న రాణా కపూర్ బ్యాంక్ సహ-వ్యవస్థాపకుడిగా కొనసాగనున్నారు. బ్యాంక్ ప్రమోటర్లైన రాణా కపూర్, ఆయన మరదలు బిందు కపూర్‌లు ఈ నెల చివరినాటికి బ్యాంక్‌ను వీడాలని గత సెప్టెంబర్‌లో రిజర్వు బ్యాంక్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో నూతన వ్యక్తి ఎంపిక అనివార్యమైంది. ఈ నియామకానికి రిజర్వు బ్యాంక్ అనుమతినిచ్చినట్లు యెస్ బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. తాత్కాలిక బదిలీకి సంబంధించి ఈ నెల 29న బోర్డు సమావేశమై అనుమతినివ్వనున్నట్లు బ్యాంక్ సీనియర్ గ్రూపు ప్రెసిడెంట్ రజత్ మోంగా తెలిపారు. 1991 నుంచి డాయిష్ బ్యాంక్‌లో విధులు నిర్వహిస్తున్న గిల్..2012 నుంచి దేశీయ హెడ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం డాయిష్ బ్యాంకుకు దేశవ్యాప్తంగా 16 శాఖలు ఉండగా, అదే యెస్ బ్యాంక్‌కు 1,115 శాఖలు ఉన్నాయి. గడిచిన రెండేండ్లలో కపూర్ నాయకత్వంలో బ్యాంక్ మొండి బకాయిలు రూ.10 వేల కోట్ల మేర పెరుగడంపై ఆందోళన వ్యక్తంచేసిన రిజర్వు బ్యాంక్..ఆయన పదవి కాలాన్ని ఎందుకు పెంచారో వివరణ ఇవ్వాలని గతంలోనే ఆదేశించింది. దీంతో నూతన వ్యక్తిని ఎంపిక చేయడానికి ఐఆర్‌డీఏఐ మాజీ చైర్మన్ టీఎస్ విజయన్ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది.

7 శాతం తగ్గిన బ్యాంక్ లాభం

యెస్ బ్యాంక్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.1,001.85 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి నమోదైన రూ.1,076.87 కోట్ల లాభంతో పోలిస్తే 6.96 శాతం పతనమైంది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.550.20 కోట్ల నిధులను వెచ్చించినట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. సమీక్షకాలంలో బ్యాంక్‌కు నికర వడ్డీ ఆదాయం 41.2 శాతం పెరిగి రూ.2,666.40 కోట్లకు చేరుకోగా, అడ్వాన్స్‌లు 42.2 శాతం ఎగిసి రూ.2,43,885 కోట్లకు చేరుకున్నాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.72 శాతం నుంచి 2.1 శాతానికి పెరుగగా, నికర ఎన్‌పీఏ కూడా 1.18 శాతానికి చేరుకున్నది.

అమెరికాలో డాక్టర్ రెడ్డీస్ అనస్తీషియా ఔషధం

న్యూఢిల్లీ, జనవరి 24: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఔషధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్..అమెరికా మార్కెట్లో మత్తుమందైన ప్రొపొఫోల్ ఇంజెక్ట్ ఎమ్యులేషన్‌ను విడుదల చేసింది. ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ)లలో ఉండే సాధారణ మత్తు మందుకు ప్రత్యామ్నాయంగా దీనిని రూపొందించింది సంస్థ. అక్కడి మార్కెట్లో డిస్ట్రిబ్యూషన్, విక్రయాలను సంస్థనే నిర్వహిస్తున్నది. నవంబర్ 2018తో ముగిసిన ఏడాదికాలంలో ఈ ఔషధాల మార్కెట్ 310 మిలియన్ డాలర్లుగా ఉన్నదని ఐఎంఎస్ హెల్త్ మ్యాట్ వెల్లడించింది.

సదరన్ ట్రావెల్స్ 'హాలిడే బజార్'

SOUTHERN TRAVELS™

హైదరాబాద్, జనవరి 24: ప్రయాణ, పర్యాటక రంగాల్లో అగ్రగామి సంస్థగా వెలుగొందుతున్న సదరన్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్.. రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాల్లో 'హాలిడే బజార్'లను నిర్వహిస్తున్నది. దేశ, విదేశాలకు విహారయాత్రలు వెళ్ళాలనుకునేవారు ఈ హాలిడే బజార్‌ను సందర్శించి తమ నిపుణులతో మాట్లాడుకోవచ్చని గురువారం ఓ ప్రకటనలో సంస్థ తెలియజేసింది. టూర్ ప్యాకేజీల వివరాలను తెలుసుకుని, ప్రత్యేక డిస్కౌంట్లనూ పొందవచ్చని చెప్పింది. ఈ నెల 26, 27 తేదీల్లో జరిగే ఈ హాలిడే బజార్.. హైదరాబాద్‌లో మాసబ్ ట్యాంక్ (ది గోల్కొండ హోటల్), మియాపూర్ క్రాస్‌రోడ్ (హోటల్ శ్రీకృష్ణ గ్రాండ్), హైటెక్ సిటీ (ది పీర్లెస్ ఇన్), ఈసీఐఎల్ క్రాస్‌రోడ్ (హోటల్ స్వాగత్ గ్రాండ్)లలో జరుగనున్నది. అలాగే వరంగల్ (సుప్రభ హోటల్-హన్మకొండ), కరీంనగర్ (ప్రతిమ రీజెన్సీ), ఖమ్మం (బడ్జెట్ హోటల్), సూర్యాపేట (హోటల్ బాలాజీ గ్రాండ్)ల్లో జరుగుతుందని సంస్థ వెల్లడించింది.

'నానో'కు టాటా

- బీఎస్-6తో ప్రియం కానున్న కార్లు

హైదరాబాద్, జనవరి 24: సామాన్యుడికి సైతం కారును అందించాలనే లక్ష్యంతో వ్యాపార దిగ్గజం రతన్ టాటా ప్రవేశపెట్టిన నానో కారు ఇక కాలగర్భంలో కలిసిపోతున్నదా! అంటే అవుననే అంటున్నాయి కంపెనీ వర్గాలు. పదేండ్ల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ కారుకు వినియోగదారుల నుంచి ఆశించిన స్థాయిలో డిమాండ్ లేకపోవడం, మరోవైపు కాలుష్యాన్ని నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు ఉపక్రమించడంతో బీఎస్-4 ప్రమాణాలతో తయారైన ఈ కార్లకు ఇక కాలం చెల్లినట్లేనని ఇండస్ట్రీ వర్గాల పేర్కొంటున్నాయి. బీఎస్-6 ప్రమాణాలకు తగ్గట్టుగా ఈ నానో కారును తయారు చేసే ఉద్దేశమేది లేకపోవడంతో వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ఈ కారు ఉత్పత్తిని నిలిపివేయనున్నట్లు టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహన విభాగ ప్రెసిడెంట్ మయాంక్ పరేఖ్ తెలిపారు. గుజరాత్‌లోని సనంద వద్ద ఉన్న ప్లాంట్లో ఈ నానో కారు పలు నియమ నిబంధనలకు లోబడి తయారు చేసినట్లు, నూతన మార్గదర్శకాలకోసం పెట్టుబడి పెట్టే అవకాశం లేదని రాష్ట్ర మార్కెట్లోకి ఎస్‌యూవీ హారియర్‌ను విడుదల చేసిన అనంతరం ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. నానోతోపాటు మరిన్ని మోడళ్లు కూడా గుడ్‌బై పలికేయోచనలో ఉన్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. ఏప్రిల్ 1, 2020 నుంచి ప్రతి వాహనం బీఎస్-6 ప్రమాణాలకు తగ్గట్టుగా రూపొందించాలని సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆటోమొబైల్ సంస్థలపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడానికి ధరల పెంచడానికి మొగ్గుచూపే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. పెట్రోల్ వాహన ధరలు రూ.20 వేల వరకు పెరుగనుండగా, డీజిల్ వాహనాల ధర మాత్రం ఏకంగా లక్ష రూపాయల వరకు అధికమవనున్నదని ఆయన సంకేతాలిచ్చారు

రాష్ట్ర మార్కెట్లోకి హారియర్

రాష్ట్ర మార్కెట్లోకి ఎస్‌యూవీ హారియర్‌ను ప్రవేశపెట్టింది. నాలుగు రకాల్లో లభించనున్న ఈ కారు రూ.12.69 లక్షల నుంచి రూ.16.29 లక్షల మధ్యలో లభించనున్నది. వ్యాపార విస్తరణలో భాగంగా ప్రస్తుతం 800 ఉన్న డీలర్‌షిప్‌లు 2020-21 నాటికి 2 వేలకు పెంచే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
శుక్రవారం 25 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

**ఒకసారి సంప్రదాయంగా.. మరొకసారి మోడ్రన్‌గా..
అకేషన్‌ని బట్టి.. ఆలోచనను బట్టి.. మన డ్రెస్సింగ్ మారుతూ ఉంటుంది..
ఒకసారి ఇతరులకు మ్యాచింగ్‌గా ఉండొచ్చు..
మరొకసారి మనమే సరికొత్తగా కనిపించొచ్చు..
నీ జతగా అని పాడినా.. ఒంటరిగా ఉన్నా.. ఎవరికి వారిదే సెపరెట్ స్టయిల్..
మరి వారి స్టయిల్ స్టేట్‌మెంట్స్‌పై ఓ లుక్కేయండి..**

సెపరెట్ స్టయిల్!





ఎక్కడైనా తళుక్కున మెరిసేలా కనిపించేందుకు ఈ డ్రెస్‌లు వేయాల్సిందే! ఎర్రని వెల్వెట్ లెహంగా చోళీ మీద జర్దోసీతో హెవీ వర్క్ వచ్చింది. దీనికి తగినట్టుగానే పీచ్ కలర్ నెట్ దుపట్టా మీద కూడా అదే వర్క్ కంటిన్యూ అయింది. బార్డర్ దీనికి అదనపు ఆకర్షణగా నిలిచింది. నల్లని సీక్వెన్స్ డ్రెస్‌ని కూడా డిఫరెంట్‌గా డిజైన్ చేశారు. హై నెక్ లైన్ ఇచ్చి అక్కడ డిఫరెంట్ వర్క్‌తో నింపేశారు. ఫుల్ స్లీవ్స్ పర్ఫెక్ట్‌గా సూటయ్యాయి. నల్లని ప్యాంట్, నెట్ దుపట్టా వీటికి బాగా సూటయ్యాయి.

జోడీలు మ్యాచింగ్ వేసినా బాగుంటారు. కొన్నిసార్లు కాంట్రాస్ట్ కూడా ట్రై చేయొచ్చు. నల్లని పట్టు చీర మీద ఏనుగుల డిజైన్ చూడముచ్చటగా కనిపిస్తున్నది. పింక్ కలర్ చిన్న బార్డర్ కూడా కరెక్ట్‌గా ఉంది. నల్లని పట్టు బ్లౌజ్‌కి పింక్ కలర్, గోల్డెన్ జర్దోసీ బాగా వచ్చింది. అమ్మాయిలకు తగ్గట్టుగా ఉండాలంటే.. అబ్బాయిలు సూటు బూటు వేయాల్సిందే! నల్లని ప్యాంట్, దానికి తెల్లని షర్ట్ మ్యాచ్ చేశారు. ఎర్రని వేస్ కోట్ దీనికి మరింత వన్నె తెచ్చింది.

పచ్చని పట్టు చీర అమ్మడి అందాన్ని రెట్టింపు చేసింది. దీనికి సెల్ఫ్ బార్డర్ మరింత మెరిసిపోతున్నది. చివర ఆకుపచ్చని రంగు, మధ్యలో గోల్డెన్, సిల్వర్ డిజైన్ చీర అందాన్ని పెంచింది. ఆకుపచ్చని హై నెక్ బ్లౌజ్ మీద హెవీ జర్దోసీ వర్క్ సూపర్‌గా కనిపిస్తున్నది.

ఆరెంజ్ హెవీ బుటీ పట్టు చీరకి.. ప్లెయిన్ బ్లాక్ బార్డర్ బాగా సూటయింది. దీనికి బ్లాక్ వర్క్ బ్లౌజ్‌ని మ్యాచ్ చేశారు. ఇక అబ్బాయికి ఎర్రని కుర్తాకి పైన నల్లని వేస్ కోట్ ఇచ్చారు. ఎడమ వైపు ఎంబ్రాయిడరీతో పూలను కుట్టి హైలైట్ చేశారు. ఎర్రని పైజామా దీనికి సరిగ్గా సరిపోయింది. ఇలా డ్రెస్సింగ్‌తో ఇద్దరు పర్‌ఫెక్ట్ కపుల్‌గా కనిపిస్తున్నారు కదూ!

ఆ రోజులు ఆనందంగా..!





మహిళలు ఋతుక్రమ సమయంలో కూడా మామూలుగా ఉండాలనీ, అది కూడా సంతోషంగా గడుపాలనీ ఆ ఇద్దరు పూనుకున్నారు. అందుకు సరైన పరిష్కారంగా వారు ఒక ప్రొడక్ట్‌ను కనిపెట్టారు.

బెంగళూరుకి చెందిన మాలినీ పార్మార్, స్మితా కులకర్ణి మహిళలు పడుతున్న బాధల్ని పంచుకోవాలనుకున్నారు. అది కూడా ఆనందంగా. ఎలా అంటారా? రోజూ హుషారుగా ఇంట్లో పని, ఆఫీసు పని చకచకా చేసే మహిళలు ఒక్క ఋతుక్రమంలో చాలా నిదానంగా, నీరసంగా కనిపిస్తూ ఇబ్బందిగా ఫీలవుతుంటారు. ఇంటికి వెళ్లేంత వరకు కంగారుగా ఉంటారు. దీనికి కారణం ఒక్కటే. మార్కెట్లో ఎన్నో రకాల సానిటరీ ప్యాడ్స్ అందుబాటులోకి వచ్చినా మహిళల్లో ఆందోళన పోవట్లేదు. 2015లో మాలినీ, స్మితా దీనికి సరైన మార్గం కనుక్కోవాలనుకున్నారు. వీరు 'స్టోన్‌సూప్' కంపెనీకి అధినేతలు. దీని ద్వారా 'మెన్‌స్ట్రుయల్ కప్స్'ను తయారు చేశారు. ఈ రకమైన కప్స్‌ని వాడడం వల్ల మనిషిలో ఎటువంటి మార్పు ఉండదు. ఎప్పటిలానే ఋతుక్రమంలో కూడా సంతోషంగా ఉంటారు. ఇవి పర్యావరణానికి ఏ హానీ కలిగించవు. వీరిరువురూ కప్స్ ఎలా వాడాలో వివరిస్తూ మహిళలకి అవగాహన కల్పిస్తున్నారు. ఒక మహిళ పదేండ్లకి ఉపయోగించే సానిటరీ ప్యాడ్స్‌కి 40,000 రూపాయలు ఖర్చు పెడుతున్నది. అదే వ్యవధిలో మెన్‌స్ట్రుయల్ కప్స్‌కు అయ్యే ఖర్చు రూ. 1000 మాత్రమే. ఈ కప్స్ వాడకం ఆరోగ్యానికి ఆరోగ్యం, పర్యావరణంతో పాటు డబ్బునూ ఆదా చేయవచ్చు. వీటిని వాడిన కొంతమంది మహిళలు ఎంతో సౌకర్యంగా ఉన్నాయని తయారు చేసిన మాలినీ, స్మితాకి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

తరచూ టీ తాగుతున్నారా?




టీ చర్మ ఆరోగ్యానికి సహాయం చేస్తుందా? లేక సమస్యలకు దారితీస్తుందా? అన్న సందేహం చాలామందిలో ఉంటుంది. దీని గురించి కొన్ని సలహాలు మీ కోసం.

- పాలు, చక్కెర కలిపిన టీ, చర్మ ఆరోగ్యానికి ఎట్టి పరిస్థితుల్లో మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. అధిక చమురు మొటిమలకు దారితీస్తుందని అందరికీ తెలిసిందే. పాలను జీర్ణించుకోవటం కూడా కష్టంగానే ఉంటుంది. వీటికి కొంచెం దూరంగా ఉంటేనే మంచిది.
- టీ తీసుకోవడం పరిమితం చేయండి. చర్మ ఆరోగ్యానికి బ్లాక్ టీ, గ్రీన్ టీ ప్రతిరోజూ తీసుకోండి. ఇలా చేస్తే మెరుగైన ఫలితాలను పొందగలరు.
- రక్తంలోని అధిక చక్కర స్థాయిలు మొటిమల సమస్య ఎక్కువ అయ్యేలా చేస్తుంది. చక్కెరలు అధికంగా తీసుకున్నప్పుడు శరీరం మరింత ఎక్కువ ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ ఇన్సులిన్ మొటిమల సమస్యకు దారితీస్తుంది.
- టీలో చక్కెరను వీలైనంత తగ్గించి శుద్ధి చేసిన బ్రౌన్ షుగర్, తేనెకు మారడం వందరెట్లు మంచిది. కృత్రిమ స్వీటెనర్లను నివారించండి. ఎందుకుంటే, అవి వేరే ఇతరత్రా సమస్యలకు కారణం అవుతాయి.
- గ్రీన్ టీ మీకొక ప్రత్యామ్నాయంగా ఉంటుంది. ఇది బరువు నష్టాన్ని ప్రోత్సహించడమే కాకుండా, చర్మ ఆరోగ్యానికి కూడా అద్భుతంగా పనిచేస్తుంది. గ్రీన్ టీ రక్తంలో చక్కెరను నియంత్రిస్తూ మొటిమల సమస్యను దూరం చేస్తూంది.
- అధికంగా గ్రీన్ టీ తీసుకోవడం డీహైడ్రేషన్ వంటి సమస్యకు దారితీస్తుంది. కనుక, పరిమిత మోతాదులోనే ఉండాలని గుర్తుంచుకోండి.

టిక్‌టాక్‌తో సంచలనం





ఓ అమ్మాయి చేసిన టిక్‌టాక్ వీడియో దేశంలో చర్చనీయాంశమైంది. ఆ వీడియో వైరల్ అవుతూ రాష్ట్రాలు దాటి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వరకూ వెళ్లింది. వెంటనే స్పందించిన ఆ సంఘం పూర్తి విచారణకు ఆదేశించింది. ఇంతకీ ఆ అమ్మాయి ఏం చేసిందో తెలుసా...?

ఒక ఫేమస్ డైలాగునో, పాటనో, దేన్నో ఒకదాన్ని తీసుకొని లిప్‌సింక్‌తో టిక్‌టాక్‌లు చేయడం ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్. అయితే ఇదే తరహాలో కేరళలోని కొల్లాంకు చెందిన కావ్య అనే పదహారేండ్ల అమ్మాయి ఓ వీడియో చేసింది. అది ఫన్నీ డైలాగ్ కాదు, సినిమా పాట అంతకన్నా కాదు. ఇసుక మాఫియా గురించి సెల్ఫీ వీడియో తీసింది. ఆ వీడియోను ఆమె సోదరి వాట్సప్ ద్వారా ఫ్రెండ్స్ అందరికీ షేర్ చేసింది. ఇంకేముంది? వారం రోజుల్లో అది వైరల్ అయింది. ప్రముఖులు, సెలెబ్రెటీలు ఆ వీడియోను షేర్ చేశారు. మూడు వారాల్లో అది ఆంటిమైనింగ్ క్యాంపెయినింగ్‌కు దారి తీసింది. రాష్ట్ర వ్యాప్త ఆందోళలు జరిగాయి. ఈ విషయం కాస్త నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు చేరడంతో సంబంధిత అధికారులపై సీరియస్ అయింది. వెంటనే మైనింగ్ మాఫియాపై పూర్తి విచారణ జరిపి, నివేదిక అందించాలని అధికారులను హెచ్చరించింది. ఆ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా ఇసుక మాఫియా ఆగడాలు చెలరేగుతున్నాయని, ఇసుకను తవ్వుతూ తవ్వుతూ జనావాసాల్లో కూడా జేసీబీలతో తవ్వుతున్నారని కావ్య వీడియోలో పేర్కొంది. దీంతో ఇక్కడి ప్రజలు భయాందోళనతో బతుకుతున్నారనీ, అధికారులు స్పందించాలని ఈ వీడియో చేస్తున్నట్టు చెప్పింది. ఏదేమైనా ఇంత చిన్న వయసులో ఇసుక మాఫియా ఆటకట్టించేందుకు ధైర్యం చేసిన ఆ అమ్మాయిని మెచ్చుకోవాల్సిందే!

మట్టి లేకుండా మొక్కల పెంపకం!



గార్డెన్‌ని మట్టి లేకుండా కొత్త రకంగా పెంచాలనుకుంటున్నారా? అయితే హైడ్రోపోనిక్ గార్డెనింగ్‌ని ఎంచుకోండి. ఈ పద్ధతికి కావాల్సిన కొన్ని సూచనలు.

- హైడ్రోపోనిక్ తోట పెంపకంలో మొదటగా ఏ రకమైన మొక్కలు పెంచదలిచారు, ఎన్ని పెంచదలిచారనేది నిర్ణయించుకోవాలి. గార్డెన్‌ను ఇంట్లో, బయట కూడా పెంచవచ్చు.
- హైడ్రోపోనిక్ గార్డెనింగ్‌కి అవసరమైన నీటి పంపులు, డ్రమ్ములను సేకరించి పెట్టుకోండి.
- మొక్కలకు అవసరమైన పోషకాలు నీటిలో కరిగించండి. లేదంటే ముందుగా చేసిన తయారీ దారుల నుంచి పొందవచ్చు.
- మొక్క విధానాన్ని బట్టి గొట్టాలకు సమానంగా రంధ్రాలు వేయండి.
- పాతేటటువంటి మొక్కలకు ఉన్న మట్టిని పూర్తిగా తీసేయండి. మొక్కలను జాగ్రత్తగా నీటిలో ఉంచండి.
- అవసరమైనప్పుడు నీరు పెట్టండి. నీటిలోని పోషక ద్రవాన్ని పరీక్షించడానికి ఒక పిహెచ్ టెస్టర్, సిఎఫ్ మీటర్ కొనండి.
- మొక్కలకు సూర్యరశ్మి, ధారాళంగా గాలి తగిలేలా చూడండి. మొక్కల వేర్లు గమనిస్తూ, పురుగు చేరకుండా చూడండి.
- మొక్కలకు కాసిన కూరగాయలు పెద్దవయితే కోసే యండి. తర్వాత కాపర్, పెరాక్సైడ్ ద్రావణాలు వేసి పూర్తిగా గొట్టాలను శుభ్రపరుచండి. మరలా మొక్కలు పెంచేందుకు సిద్ధమవ్వండి.

డీ విటమిన్ లోపం ఉంటే ప్రెగ్నెన్సీ కష్టమా?

నా వయసు 37 సంవత్సరాలు. మాకు రెండేండ్ల పాప ఉంది. నాకు ఈ రెండేళ్లలో రెండు సార్లు ప్రెగ్నెన్సీ వచ్చింది. కానీ కనీసం రెండేండ్లు ఎడం ఉండాలని నియంత్రణలు పాటించాం. ఇప్పుడు పిల్లలు కావాలనుకుంటున్నాం. కానీ కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. డాక్టర్‌ను సంప్రదిస్తే జీవనశైలి మార్చుకోమన్నారు. ముఖ్యంగా డీ విటమిన్ లోపం ఉందని చెప్పారు. డీ విటమిన్ లోపం ఎందుకు ఏర్పడుతుంది? దీనిని ఎలా భర్తీ చేయాలి? ప్రెగ్నెన్సీ రావడానికి ఈ సమస్య ఆటంకం కలిగిస్తుందా తెలియజేయగలరు.
- ఎస్. శ్యామల,
పీర్జాదిగూడ, హైదరాబాద్



అడుగండి చెబుతా

శ్యామలగారూ.. విటమిన్ డీ లోపం ఇండియాలో ఒక సాధారణ సమస్యగా మారిపోతున్నది. ఎముకల్లో ఖనిజ సాంద్రత తగ్గడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. మీరు తెలిపిన లక్షణాలను పరిశీలిస్తే.. తరుచూ ప్రెగ్నెన్సీ రావడం వల్ల ఈ సమస్య ఏర్పడిందని చెప్పవచ్చు. పిల్లల మధ్య వయసు వ్యత్యాసం లేకపోవడం వల్ల కూడా డీ విటమిన్ లోపం ఏర్పడుతుంది. కానీ ఈ ఒక్క సమస్యతోనే మీకు ఇప్పుడు ప్రెగ్నెన్సీ రావడం లేదని మాత్రం నిర్ధారించలేం. దీనికి తోడు ఇంకేవో కారణాలు ఉండొచ్చు. ఏది ఉన్నా పరీక్షలు చేసిన తర్వాతనే చెప్పవచ్చు. అయితే జీవనశైలిలో మార్పులు.. పోషకాహారం తీసుకోవడం వల్ల డీ విటమిన్ సమస్యను అధిగమించవచ్చు. ఇంట్లోనే ఎక్కువగా గడపడం కాకుండా కనీసం ఎండ తగిలే సమయంలోనైనా బయటకు వస్తే ఈ సమస్యను అధిగమించవచ్చు. ఈ సమయంలో సన్‌స్క్రీన్ రాసుకోవద్దు. చేతులు.. ముఖంపై ఏమీ కప్పుకోవద్దు. ఎండ తగిలితే విటమిన్ డీ లోపాన్ని అధగమించే అవకాశాలు చాలా ఉన్నాయి. నిశ్చింతగా ఉండండి. ఇది పెద్ద ప్రమాదకరమైన సమస్యేం కాదు.



డాక్టర్ జీ వింధ్య
కన్సల్టెంట్ గైనకాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్. హైటెక్‌సిటీ

II.
నమస్తే తెలంగాణ
చింతన
[కరీంనగర్]
శుక్రవారం 25 జనవరి 2019




నమో నమామి

సర్వస్వరూపే సర్వేశి
సర్వలోక నమస్కృతే
భయేభస్త్రాహినో దేవి
దుర్గాదేవి నమోస్తుతే ॥

- దుర్గా స్తోత్రం

విశ్వంలో ఆమె లేని చోటు ఎక్కడ? సకల చరాచర సృష్టిలో ప్రతీదీ ఆమె స్వరూపమే. దుష్టుల పాలిట భీకరరూపిణి, శిష్టులను రక్షించే వరప్రదాయిని ఎవరో కాదు. ఆ దుర్గమ్మ! ఈ స్తోత్రంతో ఆ జగజ్జననికి వందనం సమర్పిద్దాం.


మంచిమాట



నా మతం సత్యం, అహింసలపైనే ఆధారపడి ఉంటుంది. సత్యమే నాకు దైవం. అహింసా విధానం ద్వారానే ఆయనను తెలుసుకోగలుగుతాం.

- మహాత్మాగాంధీ

పద్యనీతి



శాంతో మహాంతో నవసంతి సంతో
వసంత వల్లోక హితం చరంత:
తీర్ణా:స్వయం భీమభవార్ణ వం
జనాన హేతునాన్యాసపి తారయంత:

-ఆది శంకరాచార్య, వివేక చూడామణి (37)

శాంతిని, గొప్పతనాన్ని సాధించిన సత్పురుషులు కొందరు వసంత ఋతువు వచ్చినట్లుగా మానవాళికి మంచిని తెస్తారు. భయంకరమైన ఈ భవసాగరాన్ని తాము ముందుగా దాటిన వారై, ఎటువంటి స్వార్థపూరితమైన ఆలోచన లేకుండా ఇతరులు కూడా ఆ సాగరాన్ని దాటేందుకు వారు సహాయపడతారు.

మేల్కొలుపు



శ్రీశేషశైల గరుడాచల వేంకటాద్రి
నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రి ముఖ్యామ్
ఆఖ్యాం త్వఖీదీయ వసతే రనిశం వదంతి
శ్రీ వేంకటా చలపతే తవ సుప్రభాతమ్ ॥ 15 ॥

- శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమ్


ఒకటి కాదు, రెండు కాదు, ఏడు కొండలపైనా వెలసిన స్వామి ఆయనే. అందుకే అవి ఆయన నిలయాలు. శ్రీ శేషాచలమని, గరుడాచలమని, వేంకటాచలమని, నారాయణాచలమని, వృషభాచలమని, వృషాచలమని (మరొకటి అంజనాద్రి) పిలిచే ఆ పర్వతాలనే స్వామి పేరున మేం ఎల్లప్పుడూ కొలుస్తుంటాం. ఓ వేంకటా చలపతీ! నీకు సుప్రభాతమ్ కలుగుగాక.

ఇలా చేద్దాం



'యథారాజా తథాప్రజ', యథాప్రజా తథారాజ'. ఈ రెండు సూక్తులూ పరస్పరం ఆదర్శనీయాలు. ఎవరూ ఎవరినీ శాసించనక్కర్లేదు. అందరూ అందరినీ మార్గదర్శకంగా తీసుకోవాలి. తెలంగాణ పాలక అధినేత కే చంద్రశేఖర్ రావు వ్యవహార సరళి, మన తెలంగాణ బిడ్డల స్పందనలు సరిగ్గా పై సూత్రాల్ని తలపించేవిగానే ఉంటున్నాయి. ఏమని మన రాష్ట్రంపై ఆయన ముద్ర, సాంగత్యం మొదలైనాయో అప్పట్నుంచీ ప్రజలు ఆయనతో మమేకమవడం మొదలైంది. ప్రజల మనోభావాలను గుర్తెరిగి, అందుకు అనుగుణంగానే ఆయనా వ్యవహరిస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా ఇవాళ్టికి పెద్ద సంఖ్యలో జరుగుతున్న చండీ హోమాలనే పేర్కొనాలి. ఒకప్పుడు అసలీ హోమమంటూ ఒకటుందని, సకలజనుల సౌభాగ్యమే ప్రతి ఒక్కరి మతమని తెలిసిన వాళ్లు చాలా తక్కువమంది. లోకకల్యాణం కోసమైతేనేం, యజ్ఞయాగాదులను అటు ప్రజలు, ఇటు పాలకులు ఆచరించడాన్ని మించిన సామరస్య పూర్వక వాతావరణం ఏ ప్రాంతానికైనా మరేముంటుంది!

హస్తభూషణం




'నేనున్నాను' శీర్షికన పురాణపండ శ్రీనివాస్ రచన, సంకలనంలో రాజమండ్రికి చెందిన జ్ఞాన మహాయజ్ఞ కేంద్రం వారు ప్రచురించిన అద్భుత గ్రంథం మహా రామభక్తుడైన ఆంజనేయస్వామి విశ్వరూపాన్ని భక్తులకు దర్శింపజేసింది. ఎ-ఫోర్ సైజులో 532 పేజీలతో అన్నీ అత్యంత అరుదైన కలర్ ఫొటోలను ఎంతో మందమైన గ్లేజ్‌డ్ న్యూస్‌ప్రింట్‌పై ముద్రించిన తీరు అసాధారణం. ఎంతో ఆకర్షణీయమైన ఆంజనేయస్వామి ముఖచిత్రంతోపాటు ప్రతీ పేజీలోనూ చిత్రాలకు తగ్గట్టు శ్లోకాలు, స్తోత్రాలు, వ్యాఖ్యలను పెద్ద సైజు అక్షరాలలో అందించారు. హనుమత్ భక్తులకు, ప్రత్యేకించి శ్రీరామసేవకులకు, మరీ ముఖ్యంగా విష్ణు ఆరాధకులకు ఇదొక వెలకట్టలేని గ్రంథం. ప్రతీ ఇంట వుండదగ్గది.

సత్యశోధన!

'సత్యాగ్రహమే' ఆయుధంగా భారతదేశ స్వాతంత్ర్య సమరాన్ని నడిపిన మన జాతిపిత గాంధీ అర్ధాంతరంగా తనువు చాలించి ఇప్పటికి (జనవరి 30) 71 సంవత్సరాలు కావస్తున్నది. 'హింసనైనా సరే, అహింసతోనే ఎదుర్కోవాలనే' సరికొత్త ఉత్కృష్ట ధర్మాన్ని ప్రవచించిన ఆ మహాత్ముని జీవితం అసలైన సత్యసంధతకు ఒక ప్రతీక. భారతీయ ధార్మిక జగత్తు సిసలైన సత్యానికి ఇచ్చిన ప్రాధాన్యం అనంతం. ఆ విశేషాలే ఇక్కడ క్లుప్తంగా తెలుసుకొందాం.

సందర్భ శుద్ధి



లోకంలో అలవోకగా అసత్యం చెప్పే వాళ్లే గాక, సత్యం చెప్పడానికి సాహసం చూపే వాళ్లూ వున్నారు. సత్యం అంటే ఉన్నదాన్ని ఉన్నట్లుగా చెప్పడం. లేనిదాన్ని ఉన్నట్లు చెప్పినా, ఉన్నదాన్ని లేనట్లు చెప్పినా అది సత్యం అనిపించుకోదు. సత్యం చెప్పే వాళ్లు సత్యసంధులు. సత్యాన్ని వ్రతంగా గలిగిన వాళ్లే సత్యవ్రతులు.

'అసత్తు' నుంచి 'సత్తు'లోకి ప్రయాణించాలని ఉపనిషత్తులు ప్రబోధిస్తున్నాయి. ఇక్కడ 'అసత్తు' అంటే 'సత్యం కానిదని' అర్థం. ఈ ప్రపంచం 'సత్యం కానిది'. కనుక దాని నుంచి బయట పడాలని, బయట పడి సత్యస్వరూపుడైన పరమాత్మను చేరుకోవాలని దాని ఉద్దేశ్యం. అందుకే, వేదం 'సత్యం వద' (సత్యాన్నే చెప్పాలి) అంటుంది.

మనస్సు పరిశుద్ధమయ్యేది సత్యం వల్లనే. మనస్సు పవిత్రంగా ఉన్నప్పుడే మన వాక్కు సత్యమవుతుంది. మనస్సు, వాక్కు, కర్మ అనే త్రికరణాలు సత్యస్పర్శతోనే పవిత్రమవుతాయి. సత్యం కఠినంగా ఉంటుందని అబద్ధం చెప్పవలసిన పని లేదు. సత్యం చెప్పాలనుకున్నప్పుడు ఎన్ని కష్టాలెదురైనా సత్యవంతుడు వెనుకాడడు. అందుకు సత్య హరిశ్చంద్రుడినే ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

అసత్యం తాత్కాలికంగా సుఖపెట్టవచ్చు. కానీ, కాలాంతరంలో కష్ట పెడుతుంది. కనుకనే పాపపంకిలాల నుంచి బయట పడాలనుకునే వాళ్లు సత్యాన్నే ఆశ్రయిస్తారు. మనం సత్యం పట్ల శ్రద్ధ కలిగిన వాళ్లమైతే, మన శత్రువులు కూడా మన మాటలు వినక తప్పదు. ఏదో ఒకరోజు వారు మారక తప్పదు కూడా. 'సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్' అంటే చెప్పవలసిన సత్యాన్ని ప్రియం (ఇష్టం)గా చెప్పాలనే కాని, ప్రియంగా చెప్పలేనప్పుడు అసత్యాన్ని చెప్పాలని కాదు.

'కొన్ని సమయాల్లో అబద్ధం చెప్పవచ్చుననే' మాటలు వింటుంటాం. కానీ, అబద్ధం తాత్కాలికంగా ఉపశమనం కలిగిస్తుందే కానీ విజయానికి తావివ్వదు. 'శ్రద్ధయా సత్యమాప్యతే' అని యజుర్వేదం. శ్రద్ధతోనే సత్యాన్ని వశం చేసుకోగలుగుతాం. 'శ్రద్ధ' అంటే సత్యం పట్ల 'నిష్ఠ' అని అర్థం. సత్యం చెప్పడం వల్లనే జబాల పుత్రుడైన సత్యకాముడు గౌతమునికి పరమ శిష్యుడయ్యాడు. బ్రహ్మవేత్తగా కీర్తి పొందాడు. మాట మీద నిలిచిన వాడు కనుకనే శ్రీ రాముడు మానవకోటికి ఆదర్శమయ్యాడు.


అబద్ధం ఆడకపోతే బతకలేమనే భావన పిరికివాళ్లది. కష్టం కలుగుతుందని, నష్టం వస్తుందని అనుకోవడం వట్టి భ్రమ మాత్రమే. ఒకవేళ సత్యం చెప్పడం వల్లనే కష్టాలు కలుగుతాయనుకుంటే, ఇప్పటికి భూమ్మీద సత్యం చెప్పేవాళ్లెవరూ ఉండేవాళ్లు కాదు. అందరూ అబద్ధాలకోరులుగా మిగిలిపోయేవారు.

సత్యమహిమ వల్ల దు:ఖం నశిస్తుంది. సత్యజ్ఞానం వల్ల మన నుంచి చెడు దూరమవుతుంది. యథార్థజ్ఞానమే దు:ఖ విముక్తికి తోడ్పడుతుంది. సత్య సంభాషణ, సత్యాచరణ మోక్షానికి దారిచూపే దివిటీలు. 'సత్యమేవ జయతే, నా నృతమ్' అని ముండకోపనిషత్తు ప్రబోధిస్తుంది. 'సత్యానికే జయం తప్ప, అసత్యానికి జయం లేదని' దాని భావం.

ఆచార్య మసన చెన్నప్ప

అంతిమ విజయం అదే!

మహాభారతంలోని శకుంతల చరిత్రను ఇక్కడ ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. కణ్వుని ఆదేశం మేరకు చిన్న పిల్లవాడైన భరతుణ్ని వెంట పెట్టుకొని శకుంతల దుష్యంతుని సభలోకి వచ్చింది. దుష్యంతుడు 'నీవెవరో నాకు తెలియదు' అని అబద్ధమాడాడు. అప్పుడు శకుంతల రాజుకు సత్యప్రాశస్త్యం ఎలాంటిదో చెప్పవలసి వచ్చింది. 'నూరు మెట్లు లేని బావులకంటే ఒక దిగుడు బావి మేలు. నూరు దిగుడు బావులకంటే ఒక యజ్ఞం మేలు. నూరు యజ్ఞాలకంటే ఒక సుపుత్రుడు మేలు. నూరు మంది సుపుత్రులకంటే ఒక సత్యవాక్యం మేలు' అని శకుంతల పలికిన పలుకులకు సభ బిత్తరపోయింది. ఆకాశం నుంచి 'శకుంతల సత్యం పలికింది' అనే మాటలు వినిపించాయి. దుష్యంతుడు ఆశ్చర్యపోయాడు. తాను చేసిన తప్పు తెలుసుకున్నాడు. శకుంతలను సభ సాక్షిగా స్వీకరించాడు. శకుంతల సత్యాన్ని ఆశ్రయించడం వల్లనే దుష్యంతుణ్ణి జయించగలిగింది. 'సత్యమేవ జయతే' అంటే ఇదే.



జీవన వేదం

మానవాళి జీవన సౌలభ్యం, రక్షణల కోసమే శుద్ధమైన, శాంతిదాయకమైన జలం రకరకాల మార్గాలలో ప్రకృతి సిద్ధంగా లభిస్తున్నది. హిమాలయాల నుండి, అనేక నదీనదాల నుండి, తటాకాలు, పర్వత శ్రేణులు, జలపాతాలు, బావుల నుండి శాంతిదాయకమైన శుద్ధజలాలు వస్తున్నాయి. వర్షరూపంలోనూ జీవన పుష్టినిచ్చే అద్భుత జలం వస్తున్నది. ఈ జలాలను సేద్యం కోసం ఉపయోగించి, పాడిపంటలను సమృద్ధిగా సమకూర్చుకోండి. ప్రకృతి మమేకమైన జీవనం సాగించండి.

-అథర్వ వేదం



రచనలకు ఆహ్వానం!

వివిధ ఆధ్యాత్మిక విశేషాలు, సముచిత శాస్త్రోక్త విశ్లేషణలను మీరూ ఈ పేజీకి రాసి పంపవచ్చు. ప్రామాణికమైన, ప్రజోపయోగమైన అంశాలకే ప్రాధాన్యం.

మా చిరునామా:
ఎడిటర్, చింతన, నమస్తే తెలంగాణ,
తెలుగు దినపత్రిక, బంజారాహిల్స్,
రోడ్ నంబర్: 10, హైదరాబాద్-34.

ఎందుకంటే?



జీవాత్మ, పరమాత్మల విషయంలో సామాన్యులకే కాదు, కొందరు పండితులకు సైతం ఒకింత మీమాంస కొనసాగుతున్నది. 'ఎందుకిలా?' అన్నది ఇంకా తేల లేదు. అద్వైతం ప్రకారం 'జీవాత్మ, పరమాత్మ రెండూ ఒక్కటే. పరమాత్మ ప్రతిబింబమే జీవాత్మ. అందుకే, మానవసేవే మాధవసేవ అన్న భావనతో కూడిన భక్తి సిద్ధాంతం ఉత్పన్నమైంది'. ఇక, జీవాత్మ, పరమాత్మ రెండూ వేర్వేరు అని, రెండూ పూర్తి స్వాతంత్ర్యాలని, ద్వైత, విశిష్టాద్వైత తత్వాలు బోధించాయి. దీనినిబట్టి దేవుడు, జీవుడు వేర్వేరు అయ్యారు. అయితే, ఈ మూడు తత్వాలూ 'జీవుడు చైతన్య స్వరూపుడని, కర్మఫలాలను తప్పక అనుభవించవలసి ఉంటుందని' అనడంలో మాత్రం నిశ్చితమైన ఏకాభిప్రాయాన్నే వ్యక్తపరిచాయి.

అర్థం- పరమార్థం



ఓం అఘోర చక్షురపతి ఘ్న్యేధి
శివాపతిభ్య స్సుమనాస్సువర్చా:
జీవసూర్దేవ కామాస్యోనా
శంనో భవద్విపదే శంచతుష్పదే ॥

ఇది వధువుకు వరుడు బోధించే నీతి. 'ఓ వధువా! నీవెప్పుడూ మంగళప్రదమైన హృదయంతోనే ఉండు. వీరత్వంతో కూడిన సంతానాన్ని ఇమ్ము. మనుషులు, పశువులు, సాటి వారినందరినీ హితోక్త దృష్టితోనే చూడాలి. ఆత్మీయులు, బంధువులందరితో సఖ్యంగా వ్యవహరించు. మంచి మనసుతో, తేజస్సుతో దైవభక్తిని కలిగి ఉండుము.

సుడోకు

డైలీ సుడోకు 46 సమాధానం

6	1	2	7	9	3	8	5	4
3	4	5	8	1	2	9	6	7
7	8	9	4	6	5	1	3	2
9	3	1	5	7	4	2	8	6
8	5	6	9	2	1	4	7	3
4	2	7	6	3	8	5	9	1
5	6	4	1	8	7	3	2	9
1	7	3	2	5	9	6	4	8
2	9	8	3	4	6	7	1	5

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -47

							4	7
	9					5		6
	4			2	7		1	
	8				2			
4							7	8
7				3	9			
		3	5		4	1		
1	2		9	6				
5				8				9

ట్వీట్

తమన్నా భాటియా
@tamannaahspeaks



ఆడపిల్లలను విద్యావంతులను చేద్దాం, వారికి అధికారం చేతిలో పెడదాం. వారికి సాయపడదాం. రేపటి దేశ భవిష్యత్తు బాగుండాలంటే వాళ్లు ముందడుగు వేయాలి. అప్పుడే ప్రపంచం మారుతుంది.

తమన్నాను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
36,33,058

కామన్‌మ్యాన్ వాయిస్

తన తండ్రికి అన్యాయం చేసిన పార్టీలోకి రాధాబాబు ఎలా వెళ్లాడు? ఏం తన తండ్రికి పోటేసిన పార్టీలో మా బాలయ్య బాబు లేడేంటి?
-Raghav Indra

అవసరానికి మించిన డబ్బు, జీవితానికి పనికిరాని జ్ఞానం, శరీరంలోని అధిక కొవ్వు వ్యర్థం.
-Hari Raghav

వైఎస్ జగన్ అలర్ట్‌గా ఉండాలి. బాబు తన పాత ఆటను ఆడుతూ కీలకమైన నాయకులను గుంజుతూ, తెలంగాణ పథకాలను అమలు చేసే పనిలో ఉన్నాడు.
-Tajnoth Raghuveer

హింసతో వచ్చే హక్కు కంటే అహింసతో వచ్చే విలువ ఎక్కువ కాలం నిలబడుతుంది.
-Uday Kiran Dasharadhi

వైరల్ వీడియో



గల్లీబాయ్ సినిమాలోని మేరే గల్లీ మే వీడియో సాంగ్ విడుదల చేశారు. ఈ పాటను పోస్ట్ చేసిన కొన్ని గంటల్లోనే కోటి వ్యూస్ దాటాయి. సాంగ్ ట్రెండింగ్ అవుతున్నది.

Mere Gully Mein | Gully Boy | Ranveer Singh, Alia Bhatt & Siddhant | DIVINE | Naezy | Zoya Akhtar
Total views : 11,722,207+
Published on Jan 21, 2019



చూడాల్సిన స్థలం

మిరాకిల్ గార్డెన్

7200 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న మిరాకిల్ గార్డెన్‌ను దుబాయిలో నిర్మించారు. ప్రతి ఏడాది నవంబర్ రెండో వారం తర్వాత పార్క్ నిండా పూలు పూస్తాయి. దీనిని 2013, ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం రోజున ప్రారంభించారు. ఇందులో సుమారు 150 మిలియన్ల పువ్వులున్నాయి. ప్రపంచంలోనే అతి పొడువైన గార్డెన్ గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకెక్కింది. లక్షలకు పైగా పూల మొక్కలున్న ఈ గార్డెన్‌లో వందల రకాల పువ్వుల జాతులున్నాయి. ప్రతి ఏడాది మిరాకిల్ గార్డెన్‌ను సుమారు 15 మిలియన్ల మంది సందర్శిస్తారు.



వింత ప్రదేశం

రెండు కలుస్తాయిక్కడ!

రెండు సముద్రాలు కలుస్తాయి. వాటి మధ్య మీరు నిలబడొచ్చు. వావ్.. ఇప్పుడే వెళ్లాలనిపిస్తుంది కదూ! చూస్తే అక్కడే ఉండిపోవాలనిపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని సముద్రాల్లో ఇలాంటి ప్రదేశాలు చాలా తక్కువున్నాయి. రెండు సముద్రాలు కలిసే చోట ఇసుకలో నిల్చుని చూస్తే వచ్చే మజాను అక్షరాల్లో వర్ణించలేం. ప్రకృతి ప్రేమికులైతే ఆ ప్రదేశాన్ని వదిలి ఉండలేరు. డెన్మార్క్‌లోని స్కాగెన్ నగరానికి సమీపంలో గ్రానెన్ పేరుతో ఉన్న ప్రాంతం ఇది. దీని చుట్టుపక్కల సముద్రపు జంతువులు, తీర ప్రాంతాల్లో తిమింగలాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. ఇదొక వైవిధ్యమైన ప్రకృతి దృశ్యంగా ప్రసిద్ధిగాంచింది. కిలోమీటర్ల పొడవు ఇసుక, సముద్ర తీరం ఉన్న ఈ ప్రాంతం లక్షల్లో వచ్చే పర్యాటకులతో ఎప్పుడూ కళకళలాడుతుంటుంది.

నూతన అధ్యయనం

ఉదయం చేస్తే ఉత్తమం

ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసుకుంటున్నారా? ఒక్క నిమిషం ఆగండి. ఏ సమయంలో చేస్తున్నారో చూడండి. ఏ సమయంలో చేస్తే డిస్కౌంట్ లభిస్తుంది? అనే అంశం మీద ఓ అధ్యయనం చెప్తున్న ఆసక్తికరమైన విశేషాలు..



ఆదివారం ఉదయం ఐదు గంటలకు ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసుకుంటే తక్కువ ధరకు వస్తాయట. ట్రావెల్ బుకింగ్ సైట్ స్కై స్కానర్ సంస్థ ఇటీవల చేపట్టిన సర్వేలో ఈ విషయం వెల్లడయింది. విమానాల రాకపోకలు, వాటి టికెట్లు ఏ సమయంలో బుక్ చేసుకుంటే తక్కువ ధరకు లభిస్తాయి వంటి అంశాలపై అధ్యయనం చేశారు. వాస్తవానికి రోజు, తేదీ, సెలవులను బట్టి విమాన టికెట్ల రేట్లు పెరుగుతూ తగ్గుతూ ఉంటాయి. ఆ సమయంలో కూడా కొంత డిస్కౌంట్ లభిస్తుంది. అంతర్జాతీయ విమాన టికెట్లు బుక్ చేసుకోవాలనుకునే వాళ్లు అయిదు నుంచి ఆరు నెలల ముందు చేసుకుంటే మంచిదని అభిప్రాయపడుతున్నారు. అమెరికాకు వెళ్లాలనుకునే వాళ్లు జనవరి, ఫిబ్రవరి నెలల్లో టికెట్లు బుక్ చేసుకుంటే తక్కువ ధరకు టికెట్లు లభిస్తాయని కూడా ఈ సర్వేలో తేలింది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెలల్లో అంతర్జాతీయ ట్రిప్పులు పెట్టుకుంటే టికెట్లు తక్కువకు దొరుకుతాయట. ట్రావెల్ చేయాలనుకునే వాళ్లు సమయం, సందర్భం చూసుకొని ముందే టికెట్లు బుక్ చేసుకుంటే బాగుంటుంది.

మన్నించి..చెల్లించి



జయేష్ పాండ్యా 2014 మేలో గో ఎయిర్ విమానంలో 25 టికెట్లు బుక్ చేశాడు. అహ్మదాబాద్‌లో తన కూతురి పెళ్లి కోసం వచ్చే అతిథుల కోసం ఆ టికెట్లు. ఆరు నెలల ముందు టికెట్లు బుక్ చేస్తే అన్నింటికీ కలిపి సుమారు యాభై వేల రూపాయలయ్యాయి. ఎలాంటి కారణం లేకుండా విమానయాన సంస్థ విమానాన్ని ఆ రోజు రద్దు చేసింది. పాండ్యా ఏదోలా వాళ్లందరినీ పెళ్లికి వచ్చే ఏర్పాట్లు చేయించాడు. ఈ విషయం మీద రెండు మూడుసార్లు ఆ సంస్థకు ఫిర్యాదు చేశాడు. ఎవరూ పట్టించుకోలేదు. రెండో సారి ఫిర్యాదు చేసినప్పుడు మూడు వేల రూపాయల విలువైన వోచర్ ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. పాండ్యా ఈ సారి ఆర్టీఐకి ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు కస్టమర్ ఫోరం దాకా వెళ్లింది. క్యాన్సలేషన్ సమాచారం మెయిల్ ద్వారా వచ్చింది. గో ఎయిర్ సంస్థ అతనికి యాభై వేలతో పాటు ముప్పై ఎనిమిది వేల రూపాయలు అదనంగా తిరిగి చెల్లించింది.

బ్రేకప్ తర్వాత చుట్టేయండి!

ప్రేమ విఫలమయ్యాక కలిగే బాధ అంతా ఇంతా కాదు. పక్కన వందల మంది ఉన్నా ఒంటరిగా ఉన్నట్టే అనిపిస్తుంది. చుట్టూ ఎంతమంది ఉన్నా ఒక్కరూ లేనట్టు కనిపిస్తుంది. ఆ బాధ అలాంటిది. జీవితంలో కోల్పోయిన అన్నింటిని కన్నా ప్రేమను కోల్పోవడం విచారకరం. అందుకే బ్రేకప్ అయ్యాక చాలామంది సోలోరైడ్‌లు వేస్తుంటారు. దూర ప్రయాణాలు చేస్తుంటారు. లవ్‌లో బ్రేకప్ అయ్యాక ఇండియాలో చూడాల్సిన కొన్ని ప్రదేశాలున్నాయి. అవి చూస్తే చాలు.. గతాన్ని మరిచిపోయి కొత్త అనుభూతుల్ని సొంతం చేసుకోవచ్చు. వచ్చే నెలలో ప్రేమికుల దినోత్సవం ఉన్నది. లవ్‌లో బ్రేకప్ అయిన వాళ్లు ఇప్పటి నుంచే ప్లాన్ చేసుకొని మీకు అందుబాటులో ఉండే ప్రాంతాలను చుట్టేసిరండి.

శిమోగ : కర్ణాటక

ఎత్తైన కొండలు, తలకు తాకుతాయా అన్నట్టు మేఘాలు, చుట్టుపక్కల చూస్తే భయంకరంగా కనిపించే లోయలు జోగ్ జలపాతాల వద్ద కనిపించే దృశ్యాలివవి. ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసే ఈ ప్రదేశాన్ని ఒంటరిగా వెళ్లి చూస్తే మరిచిపోలేని మధురానుభూతి పొందొచ్చు.



మావ్‌పాలాంగ్ ఫారెస్ట్ : మేఘాలయా

కనుచూపుమేర పచ్చదనం, కళ్లకు కనిపించే ఎత్తులో చెట్లు ఆకాశాన్ని తాకే ఎత్తు వాటి పొడవు, భయంకరమైన శబ్దాలు చేసే అడవి జంతువులు ఇలా అన్ని ఉన్న ఫ్యామిలీ ప్యాక్‌లా ఉంటుంది మావ్‌పాలాండ్ అడువులు. మేఘాలయాలో ఉన్న ఈ అడవులు ఇప్పుడిప్పుడే పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇక్కడికి వెళ్తే గతాన్ని మరిచిపోతారు.



ఇడుక్కి : కేరళ

ఈ ప్రదేశాన్ని చూస్తే మనసు కరిగిపోతుంది. నూతనోత్తేజం కలుగుతుంది. చుట్టు గుట్టలు, మధ్యలో డ్యాం. దానిపై నుంచి రోడ్డు ప్రయాణం చేస్తుంటే కలిగే ఆ ఫీలింగ్ మాటల్లో చెప్పలేం. సుందరమైన పరిసరాలు, సహజమైన నీటి సరస్సులను చూస్తుంటే కొండలపై నుంచి జారుతున్న నీటి బిందువుల్లా మీ సమస్యలు కూడా వెళ్లిపోతాయనిపిస్తాయి.

థార్ ఎడారి : రాజస్థాన్

మన దేశంలో ఉన్న ఎడారుల్లో ఇదే పెద్దది. ఇసుక తిన్నెలపై నడుస్తూ అందమైన ఎడారి ప్రాంతాలను చూస్తూ ఉంటే భిన్నమైన అనుభూతి కలుగుతుంది. ఒంటెలపై ఊరేగుతుంటే అందంగా, భయంకరంగా అనిపిస్తుంది. ఎత్తు పల్లాలున్న ఆ ప్రాంతంలో ప్రదేశాలు చూసి జీవితాన్ని అర్థం చేసుకోవచ్చు.

రాన్ ఆఫ్ కుచ్ : గుజరాత్

సాల్ట్ పాన్స్ ఆఫ్ ఇండియాగా పిలిచే ఈ ప్రాంతం గుజరాత్‌లో చాలా ఫేమస్. ఇక్కడ నైట్ క్యాంపులు వేసి అర్ధరాత్రి నక్షత్రాలను చూస్తూ గడిపితే వచ్చే కిక్కు మామూలుగా ఉండదు. మీ బాధలన్ని పోయి చిరునవ్వులు మీ సొంతమవుతాయి.

కెమిరీ మొనాస్టరీ : జమ్మూకశ్మీర్

1664లో నిర్మించిన అతి పురాతన కట్టడం ఇది. లడఖ్‌లోని ఎత్తైన పర్వాతల మధ్యన దీన్ని నిర్మించారు. ప్రశాంతత కోల్పోయిన జీవితాల్లో ఇక్కడికి వెళ్తే కొంత స్వాంతన లభిస్తుంది.



ఇవేకాకుండా గోవా, హిమాచల్ ప్రదేశ్‌లోని ఖీర్‌గంగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని జీరో, మిజోరంలోని హనలాన్ వంటి ప్రాంతాలకు వెళ్తే మనల్ని మనమే మరిచిపోయి ఒక కొత్త ఆలోచనలను, కొత్త అభిప్రాయాలను పొందుతాం. కారణం అక్కడి వాతావరణం, అక్కడి పరిస్థితులు. జీవితంలో అన్ని కోల్పోయామని బాధపడే వాళ్లు ఇక్కడికి వెళ్లి చాలా నేర్చుకోవచ్చు. అలా చేస్తే విహారం విజయవంతం అవుతుంది. విజ్ఞానమూ లభిస్తుంది.

ప్రయాణం - ఆరోగ్యం

ప్రెగ్నెన్సీతో ప్రయాణం చేస్తే..




గర్భవతిగా ఉన్నప్పుడు ప్రయాణం అంటే భయంగా ఉంటుంది. ఎప్పుడు, ఎలాంటి పరిస్థితుల్లో ప్రయాణం చేస్తే బాగుంటుందో తెలుసుకోండి.

- మొదటి త్రైమాసికంలో ప్రయాణాలు చేయొచ్చు. కానీ అలసట, విసుగు రావడం వంటివి ఇబ్బంది పెడుతాయి. ఒక్కోసారి అబార్షన్ కూడా అయ్యే ప్రమాదం ఉంటుంది.
- రెండవ త్రైమాసికంలో సులభంగా ప్రయాణాలు చేసుకోవచ్చు. ప్రయాణంలో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. ఆహారం కూడా ఇంటి నుంచి తీసుకెళ్లింది అయితే నష్టం ఉండదు.
- మూడవ త్రైమాసికంలో ఎంత తక్కువ ప్రయాణాలు చేస్తే అంత మంచిది. ఆ సమయంలో ప్రయాణం అవసరం అయితేనే చేయాలి. వీలైతే డాక్టర్ అందుబాటులో ఉండేలా జాగ్రత్తపడాలి.
- వెళ్తున్న వాహనంలో అన్ని సౌకర్యాలు ఉంటే ఏం కాదు. బస్, రైలు ప్రయాణం కన్నా సొంత వాహనం, కారు ప్రయాణం అయితే మంచిది.
- ప్రయాణం చేసే ముందు హెల్త్ ఇన్సూరెన్స్ కట్టుకుంటే బాగుంటుంది. ఆ సమయంలో గతంలో చేసిన మెడికల్ రిపోర్ట్స్ వెంట పెట్టుకోండి.

యాప్‌రే

క్లూక్



ఇదొక ట్రావెల్ బుకింగ్ సర్వీస్ ప్లాట్‌ఫామ్. తక్కువ ధరలో ఉన్న సందర్శన ప్రదేశాలు, అక్కడి సర్వీస్‌ల గురించి తెలుపుతుంది. మీరు ఎక్కడికి వెళ్లాలి? అక్కడికి వెళ్తే ఎక్కడ ఉండాలి? ఎలా ఉండాలి? అనే అంశాలను క్లూక్ సూచిస్తుంది. మీరెళ్లినచోట దొరికే వస్తువుల గురించి, సరళమైన మార్గాలను చూపుతుంది. సందర్శనకు వెళ్లిన ప్రాంతాల్లో అందించే సేవలు ఎలా ఉంటాయి? తక్కువ ధరకు లభించే హోటళ్ల వివరాలను ఈ యాప్‌లో పొందుపరిచారు. ఇది ఐఓఎస్ స్టోర్‌లో, స్మార్ట్ ఫోన్ల కోసం ఆండ్రాయిడ్ యాప్ స్టోర్‌లో ఉన్నది. డౌన్‌లోడ్ చేసుకొని వాడుకోవచ్చు. ఈ సంస్థ హాంగ్‌కాంగ్‌కు చెందినది. ఆ దేశంలో ట్రావెల్ సంస్థలకు సంబంధించిన వాటిలో ఇదే అతి పెద్దది. ప్రపంచవ్యాప్తంగా దీని సేవలు కొనసాగుతున్నాయి.

నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్‌లో

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ తదితర పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- మొత్తం ఖాళీలు: 430
- విభాగాలవారీగా ఖాళీలు: స్టాఫ్ నర్స్-161, నర్సింగ్ ట్రెయినర్-5, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్-264
- అర్హతలు: స్టాఫ్ నర్స్ పోస్టులకు జీఎన్‌ఎం/బీఎస్సీ నర్సింగ్‌లో ఉత్తీర్ణత. నర్సింగ్ ట్రెయినర్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోస్టులకు బీఎస్సీ నర్సింగ్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- వయస్సు: 2019, జనవరి 1 నాటికి స్టాఫ్ నర్స్ పోస్టులకు 40 ఏండ్లు, మిగతా పోస్టులకు 35 ఏండ్లు మించరాదు.
- పేస్కేల్: రూ.9,500-19,000/-
- ఎంపిక: అకడమిక్ మార్కులు+ రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో. నిర్ణీత నమూనాలో దరఖాస్తులను నింపి, సర్టిఫికెట్లతో పర్సనల్ అధికారి వద్ద హాజరుకావాలి.
- ఇంటర్వ్యూతేదీలు: జనవరి 28, 30, ఫిబ్రవరి 1
- వెబ్‌సైట్: www.lifecarehll.com

నేషనల్ సీడ్స్ కార్పొరేషన్‌లో ట్రెయినీలు

నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎస్‌సీ) దేశవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ ఆఫీస్/రీజినల్ ఆఫీసుల్లో ఖాళీగా ఉన్న ట్రెయినీ, మేనేజ్‌మెంట్ ట్రెయినీ తదితర పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.



- మొత్తం ఖాళీల సంఖ్య: 260
- విభాగాలవారీగా ఖాళీలు: డిప్యూటీ జనరల్ మేనేజర్ (విజిలెన్స్)-1, అసిస్టెంట్ లీగల్ (గ్రేడ్-1)-4, మేనేజ్‌మెంట్ ట్రెయినీ (ప్రొడక్షన్-5, మార్కెటింగ్-5, హ్యూమన్ రిసోర్సెస్-2, లీగల్-1, క్వాలిటీ కంట్రోల్-5), సీనియర్ ట్రెయినీ (అగ్రికల్చర్-49, హ్యూమన్ రిసోర్సెస్-5, లాజిస్టిక్స్-12, క్వాలిటీ కంట్రోల్-19) డిప్లొమా ట్రెయినీ (ఎలక్ట్రికల్)-2, ట్రెయినీ (అగ్రికల్చర్-45, మార్కెటింగ్-32, అగ్రికల్చర్ స్టోర్స్-16, టెక్నీషియన్-16, స్టోర్-5, స్టెనోగ్రాఫర్-8, క్వాలిటీ కంట్రోల్-7, డాటా ఎంట్రీ ఆపరేటర్-3, అగ్రికల్చర్-18)
- అర్హతలు: మేనేజర్, అసిస్టెంట్ పోస్టులకు.. ఎంబీఏ లేదా పీజీ డిగ్రీ/డిప్లొమా ఇన్ పర్సనల్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ రిలేషన్, లేబర్ వెల్ఫేర్/హెచ్ఆర్ మేనేజ్‌మెంట్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఏ/ఎల్‌ఎల్‌బీ, మేనేజ్‌మెంట్ ట్రెయినీలకు.. బీఎస్సీ అగ్రికల్చర్‌తోపాటు ఎంబీఏ (మార్కెటింగ్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్), ఎమ్మెస్సీ అగ్రికల్చర్ (ఆగ్రానమీ, సీడ్ టెక్నాలజీ, ప్లాంట్ బ్రీడింగ్ అండ్ జెనిటిక్స్, అగ్రికల్చర్ ఎంటమాలజీ, ప్లాంట్ పాథాలజీ), ఎంబీఏ (హెచ్ఆర్ఎం), ఎల్‌ఎల్‌బీ ఉత్తీర్ణత. సీనియర్ ట్రెయినీలకు.. ఎమ్మెస్సీ అగ్రికల్చర్ (ఆగ్రానమీ, సీడ్ టెక్నాలజీ, ప్లాంట్ బ్రీడింగ్ అండ్ జెనిటిక్స్), ఎంబీఏ (హెచ్ఆర్, మెటీరియల్స్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్) లేదా బీఎస్సీ అగ్రికల్చర్+ఎంబీఏ (అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణత. డిప్లొమా ట్రెయినీలకు.. మూడేండ్ల డిప్లొమా (ఎలక్ట్రికల్ లేదా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్). ట్రెయినీలకు.. బీఎస్సీ అగ్రికల్చర్, ఎన్‌సీవీటీ నుంచి సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ, బీసీఏ, బీఎస్సీ (కంప్యూటర్) లేదా ఏదైనా డిగ్రీ, ఇంటర్ /డిప్లొమా ఉత్తీర్ణత.
- పేస్కేల్: కన్సాలిడేటెడ్ స్టయిఫండ్ రూపంలో మేనేజ్‌మెంట్ ట్రెయినీలకు రూ.43,520/-, సీనియర్/డిప్లొమా ట్రెయినీలకు రూ.23,936/-, ట్రెయినీలకు రూ. 18,496/- నెలకు చెల్లిస్తారు.
- వయస్సు: 2019 ఫిబ్రవరి 9 నాటికి 27 ఏండ్లకు (ట్రెయినీలకు 25 ఏండ్లు) మించరాదు.
- ఎంపిక: రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 9
- వెబ్‌సైట్: www.indiaseeds.com

సీఆర్‌ఆర్‌ఐలో సైంటిస్టులు

సీఎస్‌ఐఆర్-సెంట్రల్ రోడ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఆర్‌ఆర్‌ఐ) సైంటిస్ట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- మొత్తం పోస్టులు: 11
- పోస్టు పేరు: సైంటిస్ట్ (గ్రేడ్-4)
- అర్హత: సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్ లేదా ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ.
- వయస్సు: 32 ఏండ్లకు మించరాదు.
- పే స్కేల్: రూ.67,700+ డీఏ
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 22
- వెబ్‌సైట్ : www.crridom.gov.in

ఉస్మానియాలో బీఈడీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 2018-19కిగాను రెండేండ్ల బీఈడీ ప్రోగ్రామ్ (డిస్టెన్స్ మోడ్)లో ప్రవేశాల కోసం ఇన్ సర్వీస్ టీచర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- కోర్సు పేరు: బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్
- మొత్తం సీట్ల సంఖ్య: 500
- అర్హత: బ్యాచిలర్ డిగ్రీ (బీఏ/బీకాం/బీఎస్సీ)లో కనీసం 50 శాతం మార్కులతో (ఎస్సీ, ఎస్టీ 40 శాతం) ఉత్తీర్ణతతోపాటు టీటీసీ/డీఎడ్ ఉండాలి. ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో పనిచేస్తూ ఉండాలి.
- దరఖాస్తు ఫీజు: రూ. 500/-
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 15
- రూ. 200/-ఫైన్‌తో చివరితేదీ: ఫిబ్రవరి 20
- వెబ్‌సైట్: www.oucde.net

స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

తెలంగాణ స్టేట్ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ రాష్ట్రంలోని వివిధ బ్రాంచీల్లో ఫౌండేషన్ కోర్సు, బ్యాంకింగ్ సర్వీసెస్‌కు సిద్ధమయ్యే అభ్యర్థుల ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- ఫౌండేషన్ కోర్సు: మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, సిద్దిపేట జిల్లాల్లోని స్టడీ సర్కిల్ బ్రాంచీలు శిక్షణను అందిస్తున్నాయి.
- బ్యాంకింగ్ సర్వీస్: దీనిలో ఎస్ఎస్‌సీ, ఐబీపీఎస్, ఆర్ఆర్‌బీతో కలిపి కరీంనగర్, సూర్యాపేట జిల్లాల్లోని ఎస్సీ/ఎస్టీ, బీసీలకు శిక్షణ అందిస్తున్నాయి.
- శిక్షణ కాలం: మూడు నెలలు. ప్రతి స్టడీ సెంటర్‌లో 100 మందికి శిక్షణ ఇస్తారు.
- విదార్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం ఎస్సీ/ఎస్టీలకు రూ.3 లక్షలు, బీసీ/మైనారిటీలకు రూ. 2 లక్షలకు మించరాదు.
- వయస్సు: 18-37 ఏండ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: ప్రవేశ పరీక్ష ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- దరఖాస్తులకు చివరితేదీ: ఫిబ్రవరి 10
- వెబ్‌సైట్: http://tsscstudycircle.telangana.gov.in

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
శుక్రవారం 25 జనవరి 2019

మహేష్‌బాబు క్రైమ్ థ్రిల్లర్!


మహేష్‌బాబు

గతంలో ఏడాదికి ఓ సినిమా చేస్తూ వచ్చిన మహేష్‌బాబు తన పంథాను మార్చుకున్నారు. ఓ సినిమా సెట్స్‌పై ఉండగానే మరో రెండు చిత్రాలను అంగీకరిస్తూ జోరు పెంచుతున్నారు. ప్రస్తుతం 'మహర్షి' సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారాయన. వంశీపైడి పల్లి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతున్నది. మహర్షి' తర్వాత విలక్షణ దర్శకుడు సుకుమార్‌తో ఓ సినిమా చేయబోతున్నారు మహేష్‌బాబు. ఈ చిత్రంతో పాటు 'అర్జున్‌రెడ్డి' ఫేమ్ సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ఆయన ఓ సినిమా చేస్తారని చాలా కాలంగా ప్రచారం జరుగుతున్నది. ఈ సినిమాకు మహేష్‌బాబు ఓకే చెప్పినట్లు సమాచారం. ఈ ఏడాది చివరలో ఈ చిత్రం సెట్స్‌పైకి రానున్నట్లు తెలిసింది. క్రైమ్ థ్రిల్లర్ అంశానికి యాక్షన్ హంగులను మేళవిస్తూ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా వైవిధ్యమైన కథను సిద్ధంచేసినట్లు సమాచారం. ఏషియన్ సినిమాస్, మైత్రీ మూవీస్, ఏంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు ప్రచారం జరుగుతున్నది.


నాగార్జున

యూరప్‌లో 'మన్మథుడు-2'

నాగార్జున సినీ ప్రయాణంలో 'మన్మథుడు' (2002)చిత్రానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఫీల్‌గుడ్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా విశేష ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది. విజయ్‌భాస్కర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి త్రివిక్రమ్ కథ, మాటలు అందించారు. దాదాపు పదిహేడేళ్ల విరామం తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్‌ను తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 'మన్మథుడు-2' పేరుతో రూపొందించనున్న ఈ సీక్వెల్‌కు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తారు. కథానుగుణంగా ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ అధికభాగం యూరప్‌లో జరగనుందని తెలిసింది. ఇందుకోసం నాగార్జున రెండు నెలల పాటు విదేశాలకు పయనమవుతున్నట్లు సమాచారం. ఫిబ్రవరి ద్వితీయార్థంలో ఈ చిత్రాన్ని ఆరంభించబోతున్నట్లు తెలిసింది. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమాను నిర్మించనుంది.

అలా చెప్పుకోవడానికి గర్వపడతాను


'లవర్స్ డే' ఆడియోను ఆవిష్కరిస్తున్న అల్లు అర్జున్. చిత్రంలో ప్రియా ప్రకాష్‌వారియర్, రోషన్, గురురాజ్, వినోద్ తదితరులు

'సౌత్‌ఇండియన్ సినిమాల్లో అంతర్జాతీయ స్థాయిలో వైరల్ అయిన వీడియోలు 'వై దిస్ కొలవెరి డీ.., బాహుబలికి సంబంధించి హు కిల్డ్ కట్టప్ప. వీటి తరువాత అంతే స్థాయిలో వైరల్ అయిన వీడియో ఒరు ఆడార్ లవ్. నాకు సౌత్ ఇండియా అంటే పిచ్చి. నా ప్రొఫెషన్‌లో సౌత్ ఇండియన్ యాక్టర్ అని రాసుకుంటాను. దక్షిణాదికి చెందిన వాడినని చెప్పుకోవడానికి గర్వపడతాను. నేను పుట్టింది చెన్నైలో అయినా పెరిగింది హైదరాబాద్‌లో. అలాగే మలయాళం వాళ్లు, కర్ణాటక వాళ్లు కూడా నన్ను ఆదరిస్తున్నారు. కాబట్టి నేను సౌత్ ఇండియన్‌నే' అన్నారు అల్లు అర్జున్. ప్రియా ప్రకాష్ వారియర్ నటించిన మలయాళ చిత్రం 'ఒరు ఆడార్ లవ్'. ఒమర్ లులు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని 'లవర్స్ డే' పేరుతో ఎ. గురురాజ్, సి.హెచ్. వినోద్‌రెడ్డి సంయుక్తంగా తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. షాన్ రెహమాన్ సంగీతం అందించిన ఈ చిత్ర గీతాలను హీరో అల్లు అర్జున్ గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నా సినిమాలను కేరళ వాళ్లు తమ సొంత సినిమాల మాదిరిగా ఆదరిస్తున్నారు. ఆ భాష నుంచి ఓ ల్యాండ్ మార్క్ ఫిల్మ్ వస్తోంది కాబట్టి నేను సపోర్ట్‌గా నిలవాలనే వచ్చాను. ఈ సినిమాతో మలయాళ ఇండస్ట్రీకి స్వాగతం చెబుతున్నాను' అన్నారు. ప్రియా ప్రకాష్ వారియర్ మాట్లాడుతూ 'నాకు అల్లు అర్జున్ అంటే చాలా ఇష్టం. ఆయనతో కలిసి వేదికను పంచుకునే అవకాశం వస్తుందని ఊహించలేదు. ఆయనకు కేరళలో కూడా అభిమానులున్నారు. ఆడిషన్ ద్వారా నేను చేసిన చిత్రమిది. నాకు దక్కిన గొప్ప అవకాశంగా భావిస్తున్నాను' అని తెలిపింది. ఈ కార్యక్రమంలో నిర్మాతలు గురురాజ్, వినోద్‌రెడ్డి, రోషన్, దర్శకుడు ఒమర్ లులు, అశోక్‌రెడ్డి గుమ్మకొండ తదితరులు పాల్గొన్నారు.

పదమూడేళ్ల తర్వాత..!


అలీరజా, ఫర్హా

ఆర్.కె, అజీజ్ నాజర్, అలీ రజా,నీరూసింగ్, ఫర్హా, సాఫీ ఖాద్రీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'హైదరాబాద్‌లో నవాబ్స్-2'. 13 ఏళ్ల క్రితం వచ్చిన 'హైదరాబాద్ నవాబ్స్' చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రాన్ని నటుడు ఆర్.కె. స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ని గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్.కె. మాట్లాడుతూ ' లోకల్ హైదరాబాదీ సినిమాను అందించాలన్న సంకల్పంతో 'హైదరాబాద్ నవాబ్స్' చిత్రాన్ని నిర్మించాం. దక్కన్ సినిమాకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపును తెచ్చిన సినిమా ఇది. ఈ సినిమా తరువాత ఈ తరహా చిత్రాలు రాలేదు. హైదరాబాదీ చిత్రాల్ని నిలబెట్టాలనే ఉద్దేశంతో కొంత విరామం తరువాత ఆ చిత్రానికి సీక్వెల్‌గా 'హైదరాబాద్ నవాబ్స్-2'సినిమాను స్వీయ దర్శకత్వంలో నిర్మించాను. రియల్ ఎస్టేట్ నేపథ్యంలో ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. అజీజ్ నాజర్, 'ధృవ'తో మంచి గుర్తింపు పొందిన అలీ రజా, నీరూసింగ్, ఫర్హా, సాఫీ కీలక పాత్రల్లో నటించారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసి చిత్రాన్ని వచ్చేనెల విడుదల చేస్తాం' అన్నారు. అలీ రజా మాట్లాడుతూ 'పక్కా హైదరాబాదీని అయిన నేను అదే భాషలో రూపొందుతున్న చిత్రంలో నటించాలనుకున్నాను. అది ఈ సినిమాతో నెరవేరింది' అన్నారు.